www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 6-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 309 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 10.54 తదుపరి దశమి; నక్షత్రం: కృత్తిక రా. 7.29 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ.8.01-9.32; దుర్ముహూర్తం: ఉ.10.35-11.21; అమృతఘడియలు: సా.5.11-6.43; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.09 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఢిల్లీ పీఠం కమలానిదే!

2

- హస్తినలో ముగిసిన పోలింగ్.. 60.10% నమోదు
- బీజేపీకి జైకొట్టిన పలు సర్వే సంస్థలు
- కేజ్రీ, అతీషీ, సిసోదియా ఓడిపోవచ్చన్న ఎగ్జిట్‌పోల్స్
- ఆప్‌నకు మొగ్గు చూపిన కేకే, వీ ప్రిసైడ్
- కాంగ్రెస్ ఖాతా తెరవడం కష్టమే..
- ఈ నెల 8న వెలువడనున్న ఎన్నికల ఫలితాలు



ఢిల్లీలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు

విద్యార్థినిపై టీచర్ల గ్యాంగ్ రేప్

- తమిళనాడులో దారుణం
- గర్భం దాల్చిన 13 ఏళ్ల బాలిక
- ముగ్గురు కామాంధులపై పోక్సో
- విద్యార్థి సంఘాల ఆందోళనలు
- స్టాలిన్ సర్కారుకు మరింత సెగ



చెన్నై, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలను ఉద్ధరించాల్సిన ఉపాధ్యాయులే కీచకుల్లా మారిపోయారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 13 ఏళ్ల విద్యార్థినిపై ముగ్గురు గురువులు సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. దీంతో అభం శుభం తెలియని ఆ బాలిక గర్భం దాల్చింది. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేని

మిగతా 2వ పేజీలో...

మస్తాన్‌కు డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్!

- అతని స్నేహితుడు ఖాజాకు కూడా.. ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ కేసు
- వారాంతాల్లో మస్తాన్ ఇంట్లో డ్రగ్స్ పార్టీలు
- అక్కడ మహిళలపై లైంగిక దాడి.. నగ్న వీడియోలు 10
- లావణ్య వీడియోలను డిలీట్ చేయించిన రాజ్‌తరుణ్
- హార్డ్‌డిస్క్ కోసం ఆమెను హతమార్చేందుకు మస్తాన్ యత్నం
- రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడించిన పోలీసులు



ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు

ఆగాఖాన్ మృతి

2

- సంతాపం ప్రకటించిన ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ
- నేటి సంక్షుభిత ప్రపంచంలో ఆగాఖాన్ శాంతి, కరుణ, సహనానికి ప్రతిరూపం: ఐరాస ప్రధాన కార్యదర్శి
- ఆరోగ్యం, గృహ నిర్మాణం, విద్యారంగాల్లో 30కి పైగా దేశాల్లో ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ సేవలు

జనంలోకి వెళ్దాం

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా నేడు సీఎల్పీ భేటీ

వర్గీకరణ, కులగణన ప్రజల్లోకి తీసుకెళ్లడమే అజెండా

- హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ కూడా..
- ఎన్నికల కార్యాచరణను రూపొందించనున్న నేతలు
- సీఎల్పీ భేటీ అనంతరం నాలుగు గంటలకు ఢిల్లీకి సీఎం
- ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనపై అధిష్ఠానానికి వివరాలు



బుధవారం సీఎం రేవంత్‌ను కలిసిన అండర్ 19 మహిళా క్రికెటర్ గొంగడి త్రిషా రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోబోతోంది. కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి వాటికి సంబంధించిన ఫలాలను ఆయా వర్గాలకు చేరవేసేందుకు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నామని భావిస్తున్న పార్టీ.. వాటిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలన్న దానిపై చర్చ జరపనుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఈ రెండు అంశాల ప్రాతిపదికగా జనంలోకి వెళ్లి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడంపై దృష్టిపెట్టింది. వీటిపై చర్చించేందుకు గురువారం కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసింది. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఈ సమావేశానికి హాజరుకానున్నారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీహెచ్ఆర్‌డీ)లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా ఈ సమావేశం జరగనుంది. ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వేలపై తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశంపై పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ దిశానిర్దేశనం చేయనున్నారు. స్థానిక ఎన్నికలకు సన్నద్ధతపై సమీక్ష చేసి తగు సూచనలూ ఇవ్వనున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యేల అభిప్రాయాలనూ తీసుకునేందుకు.. సీఎల్పీ భేటీ అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల దాకా

మిగతా 13వ పేజీలో...



ఎకరం వరకున్న రైతుల ఖాతాల్లో

'భరోసా' జమ

- 17.03 లక్షల మందికి రూ.1,126.54 కోట్లు
- నిర్ణీత కాల వ్యవధిలో రైతులందరికీ భరోసా ఇస్తాం 13
- గిట్టుబాటు ధరకు ప్రత్యేక చర్యలు
- ఈ యాసంగిలోనూ సన్నాలకు బోనస్ చెల్లింపు: మంత్రి తుమ్మల

అభ్యంతరాలుంటే పార్టీ 12

వేదికలపై మాట్లాడాలి

- బహిరంగంగా మాట్లాడటమేంటి?
- తీన్మార్ మల్లన్న తీరుపై సీతక్క
- పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు
- మహేశ్‌కుమార్ గౌడ్ హెచ్చరిక



అమెరికా నుంచి వచ్చిన వారితో మాట్లాడుతున్న పంజాబ్ మంత్రి కుల్దీప్ సింగ్

104 మంది తిరిగొచ్చారు

- అమృత్‌సర్‌లో దిగిన అమెరికా విమానం
- పంజాబీలు 30 మంది, హరియాణా-33, గుజరాత్-33
- భారతీయులకు సంకెళ్లు వేసి అవమానించారు: కాంగ్రెస్
- సోషల్ మీడియాలో నెటిజన్ల ఆగ్రహం
- మోదీ సర్కారుపై విమర్శలు
- ఆ ఫొటోలు నకిలీవని నిర్ధారణ..
- అవి గ్వాటమాలాకు తరలించిన వారివి

హెచ్ 1బీ వీసాదారులకు ఇక్కట్లు!

- ఆటో రెన్యువల్ కాలపరిమితి పెంపు
- రద్దుకు రిపబ్లికన్ల తీర్మానం
- గాజాను స్వాధీనం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం: ట్రంప్

అమృత్‌సర్, ఫిబ్రవరి 5: అమెరికా నుంచి 104 మంది భారతీయ అక్రమ వలసదారులతో బయల్దేరిన విమానం బుధవారం అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. సీ-17 సైనిక విమానం మధ్యాహ్నం 1.55 గంటలకు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. అమెరికా నుంచి వచ్చిన వారిలో 30 మంది పంజాబ్‌కు చెందిన వారు కాగా.. హరియాణా, గుజరాత్‌కు చెందిన వారు 33 మంది చొప్పున ఉన్నారు. మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, చండీగఢ్ వాసులు ఇద్దరు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తొలుత, విమానంలో 205 మంది వస్తున్నట్లు వార్తలు రాగా.. ఇప్పుడు కేవలం 104 మందే వచ్చారు. అమృత్‌సర్ చేరుకున్న వారిలో 25 మంది మహిళలు, 12 మంది మైనర్లు ఉన్నారని.. వీరిలో నాలుగేళ్ల చిన్నారి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 48 మంది 25 ఏళ్లలోపు వారు ఉన్నట్లు సమాచారం. 11 మంది విమాన సిబ్బంది, వలసదారుల అప్పగింత కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు 45 మంది అమెరికా అధికారులు కూడా విమానంలో వచ్చినట్లు తెలిసింది. అమృత్‌సర్ ఎయిర్‌పోర్ట్ వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. అక్రమ వలసదారుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పంజాబ్

మిగతా 2వ పేజీలో...



మహాకుంభమేళాలో మోదీ

- త్రివేణి సంగమంలో పుణ్యస్నానం
- గంగాహారతితో పాటు ప్రత్యేక పూజలు

లఖ్‌నవూ, ఫిబ్రవరి5: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోన్న మహాకుంభమేళాలో పాల్గొన్నారు. గంగా, యమున, సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమంలో పవిత్ర స్నానమాచరించారు. రుద్రాక్షలు ధరించిన ఆయన మంత్ర జపం చేశారు. అనంతరం గంగానదికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి పడవలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన పడవలోనుంచే భక్తులకు అభివాదం చేశారు. ఆ తర్వాత ప్రధాని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. గంగా మాత ఆశీస్సులతో అందరికీ ఆరోగ్యం, శాంతి, కలగాలని ప్రార్థించినట్లు వెల్లడించారు. పవిత్ర స్నానమాచరించిన ఫొటోలు కూడా జతచేశారు. 90 నిమిషాల పాటు ఆయన మహాకుంభమేళాలో గడిపారు. మహాకుంభమేళా సందర్భంగా ఈ నెల పదో తేదీలోపు పాతికవేల మంది గిరిజనులు పుణ్యస్నానాలు చేయనున్నారు. గురువారం నుంచి ఆదివాసీల పుణ్యస్నానాలు

మిగతా 2వ పేజీలో...

ఎండ మంటలు

- రాష్ట్రంలో పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- అధికమైన ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల వినియోగం
- అమాంతం పెరిగిపోయిన విద్యుత్తు డిమాండ్
- వారంలో మరింత పెరగనున్న ఎండల తీవ్రత



హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికీ పలు జిల్లాల్లో రాత్రి వేళల్లో చలి విజృంభిస్తున్నా పగటి పూట ఎండలు హడలెత్తిస్తున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. రాబోయే వారం రోజులు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం బుధవారం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కనీసం 2-3 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతాయని తెలిపింది. హైదరాబాద్‌లో రానున్న వారం రోజుల్లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 19-34 డిగ్రీల సెల్సియస్‌గా ఉండవచ్చని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఇన్‌చార్జి కే నాగరత్న పేర్కొన్నారు. మరోపక్క, ఎండల తీవ్రతకు తోడు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరిగిపోతోంది. ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల

మిగతా 13వ పేజీలో...



జస్టిస్ అనిల్‌కుమార్

జస్టిస్ లక్ష్మీనారాయణ

జస్టిస్ కె.సుజన

ముగ్గురు హైకోర్టు అదనపు జడ్జిలకు

శాశ్వత హోదా

- కేంద్రానికి సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్ కుమార్, జస్టిస్ కె. సుజనకు అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టులో పనిచేస్తున్న ముగ్గురు అదనపు న్యాయమూర్తులకు శాశ్వత న్యాయమూర్తి హోదా ఇవ్వాలని సుప్రీంకోర్టు కొలీజియం బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్ కుమార్, జస్టిస్ కె.సుజనలను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలన్న ప్రతిపాదనలకు కొలీజియం ఆమోదం తెలిపింది. అందుకు అనుగుణంగా సిఫారసులు పంపించింది. ఈ ముగ్గురు 2023 జూలై 31న హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. ప్రస్తుతం హైకోర్టులో 23 మంది శాశ్వత న్యాయమూర్తులు, ఏడుగురు అదనపు న్యాయమూర్తులు ఉన్నారు. ఈ ముగ్గురిని నియమిస్తే శాశ్వత జడ్జిల సంఖ్య 26కు పెరగనుంది. మరో నలుగురు అదనపు జడ్జిలు ఉంటారు. హైకోర్టుకు

మిగతా 13వ పేజీలో...

ఏపీ అంతటికీ ఒకే రైల్వే జోన్

- కొత్తగా దక్షిణ కోస్తా జోన్.. విశాఖ కేంద్రంగా కార్యాలయం
- సికింద్రాబాద్, ఒడిసాలో కలిసిన ఏపీ ప్రాంతాలన్నీ దీని కిందే..
- వాల్తేరు డివిజన్ రద్దుకు స్వస్తి.. ఇక విశాఖ డివిజన్‌గా..
- కేంద్రంపై ఫలించిన కూటమి ఎంపీల ఒత్తిడి



విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్లు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరిధిలోని రైల్వే వ్యవస్థలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రాన్నంతా కలుపుతూ కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ కేంద్రంగా జోన్ కార్యాలయం పని చేస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అనేక తర్జనభర్జనలు, చర్చలు, ఒత్తిళ్ల అనంతరం కొత్త జోన్‌ను ఏపీ కోసం ఏర్పాటుచేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఇప్పటికే ఏపీ పరిధిలో పని చేస్తున్న డివిజన్లు కోతలకు, కుదింపులకు, మార్పులకు గురి

మిగతా 12వ పేజీలో...



2

3 వేలకు ఏడాది టోల్ పాస్!

- జాతీయ హైవేలపై ఏడాదంతా ప్రయాణం
- 15 ఏళ్ల జీవితకాల పాస్‌కు రూ. 30 వేలు
- ప్రైవేటు కారు యజమానులకు కేంద్రం ఆఫర్
- కార్లకు టోల్ రుసుము తగ్గించే యోచన?

సెల్లార్ తవ్వుతుండగా 12

కూలిన మట్టిదిబ్బలు

- ముగ్గురు కూలీల దుర్మరణం.. ఒకరికి గాయాలు
- మృతులు.. తండ్రి, కుమారుడు, మేనల్లుడు
- హైదరాబాద్ ఎల్బీనగర్ పరిధిలో విషాద ఘటన
- బిల్డర్ నిర్లక్ష్యంతోనే.. జీహెచ్ఎంసీ నోటీసు

వర్గీకరణలో కుట్ర జరిగింది

- మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కావాలి
- 9 శాతానికే పరిమితం చేయడం అన్యాయం
- రిజర్వేషన్ సాధనలో దామోదర ఫెయిల్
- కుటుంబ లబ్ధి కోసం మౌనంగా ఉన్నారు
- 'లక్ష డప్పులు' వాయిదా: మందకృష్ణ మాదిగ



హైదరాబాద్/పంజాగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ నివేదిక అశాస్త్రీయంగా ఉందని, కులాల వారీగా రిజర్వేషన్ల కేటాయింపు వెనుక కుట్ర జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. ఆ కారణంగానే ఏకసభ్య కమిషన్ చేసిన సిఫారసుల్లో మాదిగలకు దక్కాల్సిన మేరకు

మిగతా 3వ పేజీలో...

ఎమ్మెల్సీ ఎన్నికలకు 12

బీఆర్ఎస్ దూరం!

- గత పదేళ్లలో ఏ ఎన్నికలు వచ్చినా దూకుడు
- ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయం!.. ఓటములే కారణం!
- బీఆర్ఎస్ తీరుపై రాజకీయ వర్గాల్లో చర్చ

విద్యార్థినిపై ముగ్గురు టీచర్ల గ్యాంగ్ రేప్

(మొదటి పేజీ తరువాయి)

అసహాయతలో ఉన్న బాలిక తల్లి.. ఆమెను నెలరోజుల పాటు స్కూలుకు సెలవు పెట్టించి అబార్షన్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో దారుణ ఘటన వెలుగు చూసింది. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా పోచంపల్లి గ్రామంలో ఈ దారుణ ఘటన జరిగింది. బాలిక తల్లి చెప్పింది విని ఆగ్రహించిన ఆ హెడ్మాస్టర్.. వెంటనే శిశు సంక్షేమ అధికారులకు ఆమెతో ఫిర్యాదు చేయించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఒక డిగ్రీ టీచర్ తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక చెప్పింది. దీంతో శిశు సంక్షేమ సంరక్షణ అధికారులు బర్గూర్ మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, బాలికపై దారుణానికి ఒడిగట్టిన ఉపాధ్యాయులు చిన్నసామి(57), ఆర్ముగం(45), ప్రకాశ్(37)ను అరెస్ట్ చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారి తీసింది. సీఎం స్టాలిన్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శన చేశాయి. బాలికను కృష్ణగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమిళనాట వరుసగా అత్యాచార ఘటనలు స్టాలిన్ సర్కారును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గత ఏడాది డిసెంబరు 23న ప్రఖ్యాత అన్నామలై విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థినిపై ఇద్దరు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది.

3 వేలకు ఏడాది టోల్ పాస్!

కారు యజమానులకు కేంద్రం ఆఫర్!!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రైవేటు కారు యజమానులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుంది. తరచూ జాతీయ రహదారులపై ప్రయాణించే కారు యజమానులకు టోల్ బాదుడు తగ్గనుంది. ఇలాంటి వారి కోసం ఏడాది పాటు చెల్లుబాటయ్యే 'టోల్ పాస్'ను అందుబాటులోకి తీసుకురానుంది. రూ.3000 చెల్లించి ఈ పాస్ తీసుకుంటే జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల మీదుగా ఎన్నిసార్లయినా ప్రయాణించవచ్చు. రూ.30 వేలు చెల్లిస్తే 15 ఏళ్ల పాటు హైవేలపై అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఈ ప్రతిపాదన కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ వద్ద తుది పరిశీలనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రైవేటు కారు యజమానుల నుంచి ప్రస్తుతం కిలోమీటరుకు వసూలు చేసే ప్రాథమిక టోల్ ధరను తగ్గించే అంశాన్నీ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జాతీయ రహదారులపై స్థానికులు లేదా రోజూ ప్రయాణించే వాహనదారులకు ఒక్క టోల్ ప్లాజాకు మాత్రమే నెలవారీ పాస్‌లు జారీ చేస్తున్నారు. ఈ పాస్‌ల కోసం వాహనదారులు నెలకు రూ.340 చెల్లించాలి. అంటే ఏడాదికి రూ.4080 ఖర్చవుతుంది.

లోకం తీరు



మహాకుంభమేళాలో మోదీ

(మొదటి పేజీ తరువాయి)



ప్రారంభమవుతాయని ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగం వనవాసీ కళ్యాణ ఆశ్రమం తెలిపింది. ఈ సందర్భంగా శుక్రవారం భారీ ఊరేగింపులతో శోభాయాత్ర నిర్వహిస్తామని వెల్లడించింది. పదవ తేదీ వరకు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆట, పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపింది. మరోవైపు, మహాకుంభమేళాలో మౌని అమావాస్యనాడు జరిగిన తొక్కిసలాటకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని పంచ్‌దశ్నమ్ జునా అఖాడా మహామండలేశ్వర్ యతి నరసింహానంద గిరి చెప్పారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తాను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు రక్తంతో లేఖ రాసినట్లు వెల్లడించారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

- బెంగళూరులో జరిగిన ఆరు విపక్ష పాలిత రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ మంత్రుల సమావేశంలో తీర్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: యూజీసీ ముసాయిదా నిబంధనలను తక్షణం వెనక్కితీసుకోవాలని ఆరు విపక్ష పాలిత రాష్ట్రాలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. ఈమేరకు.. కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ మంత్రులు/ప్రతినిధులతో బెంగళూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో 15 సూత్రాల తీర్మానం చేసినట్టు కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ తెలిపారు. వర్సిటీల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వాలకే కీలకపాత్ర ఇవ్వాలని ఆరు రాష్ట్రాల విద్యామంత్రులూ ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. సమాఖ్య విధానంలో రాష్ట్రాలకు చట్టబద్ధంగా దఖలు పడిన హక్కులకు ఈ ముసాయిదా నిబంధనలు తీవ్రంగా విఘాతం కలిగిస్తున్నాయని మండిపడ్డారు. వైస్‌చాన్స్‌లర్ల ఎంపిక నిమిత్తం 'సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ'ల ఏర్పాటుకు రాష్ట్రాలకున్న హక్కులను హరిస్తున్నాయని ధ్వజమెత్తారు. నాన్-అకడమిక్ అభ్యర్థులను వీసీలుగా నియమించే వీలు కల్పించే నిబంధనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇలా పలు ప్రతిపాదనలపై అభ్యంతరాలు తెలిపిన మంత్రులు.. యూజీసీ ముసాయిదా నిబంధనలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి: రాహుల్

పట్నా, ఫిబ్రవరి 5: జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పేర్కొన్నారు. లోక్ సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని అన్నారు. దళితనేత, స్వాతంత్ర్య సమర యోధుడు జగ్‌లాల్ చౌదరీ జయంతి సందర్భంగా బుధవారం పట్నాలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.

ఏం మాట్లాడుతున్నవ్.. నోర్మూసుకొని కూర్చో

- మాజీ ప్రధాని చంద్రశేఖర్ కుమారుడు నీరజ్‌శేఖర్‌ను ఉద్దేశించి ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే బుధవారం రాజ్యసభలో సంయమనం కోల్పోయారు. తాను ప్రసంగిస్తున్న సమయంలో అడ్డుపడిన బీజేపీ ఎంపీని ఉద్దేశించి.. "మీ నాన్న, నేను కలిసి పనిచేశాం. చిన్నప్పటి నుంచి నిన్ను చూస్తున్నా. ఏం మాట్లాడుతున్నావ్. నోర్మూసుకొని కూర్చో" అంటూ నోరు పారేసుకున్నారు. రాష్ట్రపతికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఖర్గే రూపాయి పతనాన్ని ప్రస్తావించారు. ఈ సమయంలోనే బీజేపీ ఎంపీ, మాజీ ప్రధాని చంద్రశేఖర్ కుమారుడు నీరజ్ శేఖర్ అడ్డుపడ్డారు. దీంతో, ఖర్గే ఆగ్రహంతో ఊగిపోయారు. సభలో గందరగోళం నెలకొనడంతో, రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ కలుగజేసుకొన్నారు. చంద్రశేఖర్ ప్రస్తావనను ఉపసంహరించుకోవాలని ఖర్గేను కోరారు. చంద్రశేఖర్ ఎంతో ప్రజాదరణ కలిగిన సోషలిస్టు నేత అని, ఆయన గురించి అమర్యాదగా మాట్లాడటం సరికాదని అన్నారు. నీరజ్ శేఖర్ 2019లో బీజేపీలో చేరారు. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీలో ఉన్నారు.

తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉద్యోగిదే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే విషయమై దర్యాప్తు జరిగినప్పుడు తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉద్యోగిపైనే ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. క్రిమినల్ కేసుల్లో అయితే నిందితుడు నేరం చేశాడని ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా నిరూపించాల్సిన బాధ్యత ప్రాసిక్యూషన్‌పై ఉంటుందని తెలిపింది. అదే క్రమశిక్షణ చర్యల విషయంలో అయితే సంపూర్ణంగా నిరూపించాల్సిన బాధ్యత దర్యాప్తు కమిటీకి ఉండదని పేర్కొంది. దాని పాత్ర పరిమితంగా ఉంటుందని తెలిపింది. ఎలాంటి తప్పూ చేయలేదని ఉద్యోగే రుజువు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఉద్యోగిని సర్వీసు నుంచి తొలగించడాన్ని సమర్థిస్తూ, ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. లంచం తీసుకున్నారన్న ఆరోపణలపై ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)లో అసిస్టెంట్ ఇంజినీరు (సివిల్)గా పనిచేసిన ప్రదీప్ కుమార్ బెనర్జీని ఉద్యోగం నుంచి తొలగించడం సరైనదేనని తెలిపింది.

ఉపాధి కూలీలకు కేంద్రం 6,434 కోట్ల బకాయి!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: గ్రామాల్లో ఉపాధి కల్పన కోసం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కూలీలకు దేశవ్యాప్తంగా వేతన బకాయిలు రూ.6,434 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 19 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు మెటీరియల్ కాంపోనెంట్ కింద చేసిన వ్యయం తాలూకు రూ.6,130 కోట్లను కూడా కేంద్రం చెల్లించాల్సి ఉంది. ఈ వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభకు తెలియజేశారు. కాంగ్రెస్ ఎంపీ తారిక్ అన్వర్ (బిహార్-కతిహార్), సీపీఎం ఎంపీ ఎస్.వెంకటేశన్ (తమిళనాడు-మదురై) మంగళవారం అడిగిన ప్రశ్నలకు ఆయన లిఖితపూర్వకంగా జవాబులిచ్చారు. 'గత నెల 27 నాటికి కేంద్రప్రభుత్వ వేతన బకాయిల్లో తమిళనాడుకు అత్యధికంగా రూ.1,652.45 కోట్లు, యూపీకి రూ.1,214.85 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లోనే కూలీలకు అధిక పనిదినాలు కల్పిస్తున్నారు. యూపీ 29.94 కోట్ల పనిదినాలు, తమిళనాడు 26.27 కోట్ల పనిదినాలు కల్పించాయి' అని తెలిపారు. నకిలీ/తప్పుడు/డూప్లికేట్ జాబ్ కార్డులు కలిగి ఉండడం.. కూలీలు ఇతర గ్రామాలకు శాశ్వతంగా వెళ్లిపోవడం.. గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందడం వంటి కారణాలతో 2022-23లో దేశవ్యాప్తంగా 86,17,887 మంది ఉపాధి క్రియాశీల కూలీలను, 2023-24లో 68.86 లక్షల మందిని తొలగించినట్లు ఆయన చెప్పారు.

ఢిల్లీ పీఠం కమలానిదే!

కేజ్రీవాల్, అతిషి, సిసోదియా ఓడిపోవచ్చన్న ఎగ్జిట్ పోల్స్.. ఢిల్లీలో బీజేపీకి జైకొట్టిన సర్వే సంస్థలు

- ఆప్‌నకు మొగ్గు చూపిన కేకే, వీ ప్రిసైడ్
- ఈ నెల 8న ఎన్నికల ఫలితాలు




ఢిల్లీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకుంటున్న రాష్ట్రపతి ముర్ము, తల్లితో పాటు పోలింగ్ కేంద్రంలో కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పీఠం కమలానిదేనని ఎగ్జిట్ పోల్స్ తేల్చేశాయి. హోరాహోరీగా సాగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కమలం విజయం సాధించబోతోందని సర్వే సంస్థలు ప్రకటించాయి. ప్రధాన సర్వే సంస్థలన్నీ బీజేపీకి జై కొట్టగా, కేకే, వీ ప్రిసైడ్ సర్వే సంస్థలు ఆప్ మరోసారి గెలుస్తుందని తేల్చాయి. కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరిచే అవకాశం కష్టమేనని తెలిపాయి. ఢిల్లీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ మొదటి నుంచే పటిష్ఠ ప్రణాళికతో ముందుకెళ్లింది. ఆర్ఎస్ఎస్ శ్రేణులు కూడా వార్డుల వారీగా ప్రచారం నిర్వహించాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు తదితరులు బీజేపీ తరపున ప్రచారం చేశారు. ఫలితంగా 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని సర్వే సంస్థలు చెబుతున్నాయి.

ఆమ్ ఆద్మీ అవకాశాలకు కాంగ్రెస్ గండి

ఇండియా కూటమిలో కీలక భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఎన్నికల్లో వేర్వేరుగా బరిలో నిలిచాయి. ఆప్ కంటే ముందు సుదీర్ఘకాలం ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ తర్వాత గడిచిన రెండు ఎన్నికల్లో కనీసం ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. ఈసారి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గత రెండు ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ ఓటు శాతం ఈ సారి పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆప్ ఓట్లను కాంగ్రెస్ చీల్చడం వల్ల బీజేపీ గెలుపు మరింత సులభమైందని విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ ఓటు శాతం పెరిగినప్పటికీ సీట్లు మాత్రం వచ్చే అవకాశం లేదని సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ ద్వారా తెలుస్తోంది. మరోవైపు గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సరిగ్గా అంచనా వేసి దేశవ్యాప్తంగా పేరును సంపాదించుకున్న కేకే సర్వే మాత్రం అందరికంటే భిన్నంగా ఫలితాలను ప్రకటించింది. ఆమ్ ఆద్మీ పార్టీ 44 స్థానాలతో మరోసారి అధికారంలోకి వస్తుందని, బీజేపీ కేవలం 26 స్థానాలకే పరిమితం అవుతుందని తెలిపింది. వీ ప్రిసైడ్ అనే సంస్థ కూడా 46 నుంచి 52 స్థానాలతో మరోసారి ఆప్ అధికారంలోకి వస్తుందని, బీజేపీ 18 నుంచి 23 స్థానాలతో సరిపెట్టుకుంటుందని తెలిపింది. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ముఖ్యమంత్రి అతిషి, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియాల విజయం కష్టమేనని కేకే సహా మరికొన్ని సర్వేలు తెలిపాయి. అసలు ఫలితాలు ఈ నెల 8న వెలువడతాయి. ఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని మొత్తం 70 నియోజకవర్గాల్లో బుధవారం ఓటింగ్ జరిగింది. 60.10 శాతం పోలింగ్ నమోదైంది. 699 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, ఆమ్ ఆద్మీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, సీఈసీ రాజీవ్ కుమార్ సహా మరికొందరు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాకిస్థాన్ నుంచి శరణార్థులుగా ఢిల్లీకి వచ్చి భారత పౌరసత్వం పొందిన హిందువులు తొలిసారిగా ఓటేశారు.

ప్రధాన సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్

సర్వే సంస్థ	ఆమ్ ఆద్మీ	బీజేపీ	ఇతరులు
పీపుల్స్ పల్స్	10-19	51-60	0
పోల్ డైరీ	18-25	42-50	0-2
పీపుల్స్ ఇన్ సైట్	25-29	40-44	0-1
పీ మార్క్	21-31	39-49	0-1
టైమ్స్ నౌ	22-31	39-45	0-2
జేవీసీ	22-31	39-45	0-2
చాణక్య స్ట్రాటజీస్	25-28	39-44	2-3
మ్యాట్రిజ్	32-37	35-40	0-1
డీవీ రీసెర్చ్	26-34	36-44	0
వీ ప్రిసైడ్	46-52	18-23	0-1
కేకే సర్వే	44	26	0

పీఓకేలోకి హమాస్

జైషే, లష్కర్ నేతలతో కశ్మీర్ సంఘీభావ సభలో భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్.. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో తొలిసారి అడుగుపెట్టింది. ఫిబ్రవరి 5వ తేదీని కశ్మీర్ సంఘీభావ దినంగా పాకిస్థాన్ పాటిస్తుంది. ఈ సందర్భంగా రావల్‌కోట్‌లోని షాహిద్ సబీర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో జైషే మహమ్మద్(జేఈఎం), లష్కరే తాయిబా(ఎల్ఈటీ) ప్రధాన కమాండర్లతోపాటు హమాస్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఇరాన్‌లో హమాస్ ప్రతినిధి డాక్టర్ ఖలీద్ అల్ ఖుదామీ.. ఈ సమావేశంలో హమాస్‌కు ప్రాతినిధ్యం వహించారు. పీఓకేలో అడుగుపెట్టిన తొలి హమాస్ నేతగా నిలిచారు. హమాస్‌తో సంబంధం ఉన్న మరికొందరు పాలస్తీనా నేతలు కూడా ఖలీద్ వెంట ఉన్నారు. ఇక, జైషే చీఫ్ మసూద్ అజర్ సోదరుడు తల్హా సైఫ్, జైషే కమాండర్లు అస్గర్ ఖాన్ కశ్మీరీ, మసూద్ ఇలియాస్‌తోపాటు లష్కర్ కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కశ్మీర్ సహా అన్నింటిపై చర్చలు

- భారత్‌కు పాక్ ప్రధాని ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుదామంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌కు ప్రతిపాదన చేశారు. కశ్మీర్ సహా అన్ని అంశాలపైనా మాట్లాడుదామని సూచించారు. బుధవారం ముజఫరాబాద్‌లో జరిగిన పాక్ ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కశ్మీర్ సంఘీభావ దినం పేరుతో ప్రతియేటా ఇక్కడ సమావేశాన్ని జరుపుతుంటారు. ఆయన ప్రసంగిస్తూ చర్చలు ద్వారానే కశ్మీర్ సహా అన్నిసమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు.



గాజాను స్వాధీనం చేసుకుంటాం

- ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: యుద్ధ కల్లోల గాజాను తాము స్వాధీనం చేసుకుని, అభివృద్ధి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మంగళవారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో చర్చల అనంతరం వైట్‌హౌస్‌లో సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. "మేం(అమెరికా) గాజాను స్వాధీనం చేసుకుంటాం. అక్కడ ధ్వంసమైన భవనాల వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. యుద్ధం కారణంగా పేలకుండా మిగిలిపోయిన బాంబులను నిర్వీర్యం చేయాల్సి ఉంది. ఆ తర్వాత గాజాను ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తాం. దాంతో ఆర్థికాభివృద్ధి, కొత్త ఇళ్ల నిర్మాణం జరుగుతుంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటన గాజా చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. ట్రంప్ ప్రకటనపై అరబ్ దేశాలు విముఖత వ్యక్తం చేశాయి. ఇజ్రాయెల్ దాడులకు ముందు వరకు గాజాలో ప్రభుత్వాన్ని నడిపిన హమాస్ కూడా ట్రంప్ ప్రకటనను ఖండించింది. ఈ ప్రతిపాదనకు ఒప్పుకొనేది లేదని, ట్రంప్ గందరగోళాన్ని సృష్టిస్తున్నారని హమాస్ సీనియర్ నేత సమీఅబూ జుహ్రీ వ్యాఖ్యానించారు. అమెరికా దురాక్రమణను అడ్డుకుంటామన్నారు. కాగా, గాజా పునర్నిర్మాణం జరిగే వరకు 2 లక్షల మంది పాలస్తీనీయులను శరణార్థులుగా స్వీకరించాలంటూ ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, అరబ్ లీగ్, పాలస్తీనా అథారిటీని ట్రంప్ ఇటీవల కోరారు. అయితే.. తమ దేశాల్లో ఉగ్రవాద భయాలు పెరుగుతాయనే ఆందోళనతో ఆయా దేశాలు ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించాయి.

పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధం: జెలన్‌స్కీ

కీవ్, ఫిబ్రవరి 5: రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రత్యక్ష చర్చకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్‌స్కీ తెలిపారు. "ఉక్రెయిన్ ప్రజలకు శాంతిని సమకూర్చేందుకు ఇదే ఏకైక మార్గమయితే ఆయనతో మాట్లాడేందుకు సిద్ధం. కానీ నేను ఆయనను శత్రువులానే చూస్తాను. ఆయన కూడా నన్ను అలానే చూస్తారని అనుకుంటున్నా" అని మంగళవారం ఓ ఇంటర్వ్యూలో జెలన్‌స్కీ పేర్కొన్నారు. ఆ చర్చల్లో ఉక్రెయిన్, రష్యాతో పాటు అమెరికా, యూరోప్‌లు కచ్చితంగా ఉండాలని అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుకు ఒప్పందం కుదుర్చుకోకపోతే రష్యాపై అధిక పన్నులు, సుంకాలు, ఆంక్షలు విధిస్తామని గతనెలలో ట్రంప్ హెచ్చరించారు. ఆ తర్వాత యుద్ధం ముగించడంపై ట్రంప్‌తో చర్చలకు తాము సిద్ధమని గతనెల 24న పుతిన్ మీడియాకు తెలిపారు.

104 మంది తిరిగొచ్చారు

(మొదటి పేజీ తరువాయి)



భారతీయులను తీసుకువచ్చిన సీ-17 విమానం ఇదే

డీజీపీ తెలిపారు. అన్ని తనిఖీలు పూర్తి చేసిన తర్వాతే అక్రమ వలసదారులను వారి సొంత ప్రాంతాలకు పంపిస్తామని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, అమెరికా నుంచి వెనక్కి పంపేసిన వలసదారులకు అండగా ఉండేందుకు పునరావాస నిధిని ఏర్పాటు చేయాలని ఉత్తర అమెరికా పంజాబీ అసోసియేషన్ (నాపా) పంజాబ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రానికి మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. కాగా, అమెరికా అధికారుల లెక్కల ప్రకారం.. 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించారు. 17,940 మందిని వెనక్కి పంపేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్‌వో) నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 104 మందిని వెనక్కి పంపించారు. ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గ్వాటమాలా, పెరూ, హోండురాస్ తదితర దేశాలకు తరలించింది. కాగా, అక్రమ వలసదారులంటూ భారతీయుల చేతులకు సంకెళ్లు వేసి విమానంలో తరలించడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. అమెరికా నుంచి భారతీయులను అలా అవమానకరంగా విమానంలో తరలించిన ఫొటోలు చూసి, ఒక భారతీయుడిగా ఎంతో బాధపడ్డానని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం హెడ్ పవన్ ఖేరా చెప్పారు. 2013లో భారత దౌత్యాధికారి దేవయానికి సంకెళ్లు వేసి తనిఖీలు చేసి, అవమానించినప్పుడు నాటి యూపీఏ సర్కారు తీవ్రంగా స్పందించిందని గుర్తుచేశారు. ప్రధాని మన్మోహన్ కూడా అమెరికా చర్యను తీవ్రంగా ఖండించారన్నారు. అదేసమయంలో భారత పర్యటనకు వచ్చిన అమెరికా ప్రతినిధి బృందాన్ని కలిసేందుకు రాహుల్ గాంధీ, మీరా కుమార్‌లు నిరాకరించారని ఎక్స్‌లో పేర్కొన్నారు. చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసిన వలసదారుల ఫొటోలపై సోషల్‌మీడియాలో నెటిజన్లు మండిపడ్డారు. మోదీ సర్కారుపై విమర్శలు గుప్పించారు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటోలు భారతీయులవి కావని, నకిలీవని తేల్చారు. అవి జనవరి 30న అమెరికా నుంచి గ్వాటమాలాకు తరలించిన అక్రమ వలసదారుల ఫొటోలని ఫ్యాక్ట్‌చెక్‌లో తేల్చారు.


హెచ్ 1బీ వీసాదారులకు ఇక్కట్లు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: హెచ్1బీ, ఎల్ వర్క్ పర్మిట్లపై అమెరికాలో పనిచేస్తున్న విదేశీయులకు ట్రంప్ సర్కారు భారీ షాక్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి! ఆ వీసాల ఆటో రెన్యువల్ కాలపరిమితిని 180 రోజుల నుంచి 540 రోజులకు పెంచుతూ బైడెన్ సర్కారు కిందటి సంవత్సరం డిసెంబరులో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ రిపబ్లికన్ సెనెటర్లు జాన్ కెనెడీ, రిక్ స్కాట్ ఇటీవలే ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బైడెన్ హయాంలో సవరించిన ఈ నిబంధన జనవరి 13 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పుడా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే.. భారతీయులకే ఎక్కువ నష్టం కలుగుతుంది. ఎందుకంటే హెచ్ 1బీ, ఎల్ 1 వీసాలపై ఎక్కువగా వచ్చేది భారతీయులే. వర్క్ వీసాల ఆటోమేటిక్ రెన్యువల్ కాలావధిని 540 రోజులకు పెంచడం ప్రమాదకరమని.. వలస చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా అమెరికన్లను సురక్షితంగా ఉంచాలన్న ట్రంప్ సర్కారు ప్రయత్నాలకు అది విఘాతం కలిగిస్తుందని కెనెడీ పేర్కొన్నారు. మరోవైపు.. పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిషేధించే ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేయనున్నట్టు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. 'కీపింగ్ మెన్ అవుటాఫ్ వుమెన్స్ స్పోర్ట్స్' పేరుతో ఈ ఆర్డర్‌ను జారీ చేయనున్నారు.

ఆ పార్శిళ్లకు నో!

చైనాపై ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించిన మర్నాడే.. అమెరికా తపాలా శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. చైనా, హాంకాంగ్ నుంచి వచ్చే అన్ని పార్శిళ్లనూ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అయితే, మామూలు ఉత్తరాలు, ఉత్తరాలున్న కవర్లపై మాత్రం ఎలాంటి నిషేధమూ లేదని స్పష్టం చేసింది. 800 డాలర్ల కంటే తక్కువ విలువ ఉన్న ప్యాకేజీలను 'డి మినిమిస్' విధానం కింద అమెరికాలోకి సుంకాలు లేకుండా అనుమతించే విధానం ఇన్నాళ్లుగా అమల్లో ఉంది. అయితే, ఆ ప్యాకేజీల ద్వారా చైనా, మెక్సికో నుంచి డ్రగ్స్ అమెరికాలోకి దిగుమతి అవుతున్నాయని ఆరోపిస్తూ ట్రంప్ తాజాగా ఈ 'డి మినిమిస్' నిబంధనను రద్దు చేశారు.

ఆగాఖాన్ కన్నుమూత



పారిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు 'హిజ్ హైనెస్ ప్రిన్స్' కరీం అల్ హుస్సేనీ ఆగాఖాన్-4(88) పోర్చుగల్‌లోని లిస్బన్‌లో మంగళవారం మృతి చెందారు. స్విట్జర్లాండ్‌లో 1936 డిసెంబరు 13న జన్మించిన ఆగాఖాన్-4ని విద్యార్థిగా ఉండగా 20ఏళ్లకే ఆయన తాత(ఆగాఖాన్-3) తన వారసుడిగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింల 49వ ఆధ్యాత్మిక గురువుగా ప్రకటించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదివిన ఆగాఖాన్-4 పెద్ద వ్యాపారవేత్తగా, దాతగా పేరుంది. సుదీర్ఘకాలం ఫ్రాన్స్‌లో జీవించిన ఆయన గత కొన్నేళ్లుగా పోర్చుగల్‌లో ఉంటున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఆయన మృతికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింలు సంతాపం పాటించారు. నేటి ప్రపంచంలో ఆగాఖాన్ శాంతి, సహనం, కరుణకు ప్రతిరూపమని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మంచి స్నేహితుడు, కారుణ్యశీలి అని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కొనియాడారు. కాగా 1957 జూలైలో ఇంగ్లండు రాణి ఎలిజబెత్ ఆయనకు 'హిజ్ హైనెస్' గౌరవాన్ని ప్రకటించారు. మన దేశం 2015లో పద్మవిభూషణ్ అవార్డు ప్రదానం చేసింది. ఆయన స్థాపించిన 'ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్'అనే సేవా సంస్థ పేదల ఆరోగ్యం, గృహ నిర్మాణం, విద్య, గ్రామీణ ప్రాంతాల ప్రగతికి 30కి పైగా దేశాల్లో పనిచేస్తోంది. దీని వార్షిక బడ్జెట్ ఒక బిలియన్ అమెరికన్ డాలర్లు. ఆయన పేరిట బంగ్లాదేశ్, తజకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వంటి పలు దేశాల్లో పేదల కోసం ఆస్పత్రులు నిర్మించారు. ఇస్మాయిలీ ముస్లింలు భారత్‌తోపాటు తూర్పు ఆఫ్రికా, మధ్య, దక్షిణ ఆసియా, పశ్చిమాసియా దేశాల్లో ఉన్నారు. కాగా ఆయన మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. ఆయన చేసిన కృషి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ.. ఆగాఖాన్ మృతికి విచారం వ్యక్తం చేశారు. కాగా ఆగాఖాన్-4 హైదరాబాద్ నగరాన్ని పలుమార్లు సందర్శించారు. కుతుబ్ షాహీల సమాధుల పునరుద్ధరణకు ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ద్వారా 2013లో చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లో పలు వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ఆయన మృతికి సీఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు.

నూతన ఆగాఖాన్‌గా రహీం అల్-హుస్సేనీ

కొత్త ఆగాఖాన్‌గా రహీం అల్-హుస్సేనీని నియమించారు. ఆగాఖాన్-4 కోరిక మేరకు ఆయన కుమారుడు రహీంను ఆగాఖాన్-5గా నియమిస్తూ ప్రకటన వెలువడింది. షియా ఇస్మాయిలీ ముస్లిం ఇమామ్‌ల పరంపరలో 50వ వారసుడు రహీం హుస్సేనీ.

కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు..

మీ రాజకీయాల కోసం అపోహలు సృష్టించకండి

ప్రతిపక్ష నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు హితవు

'స్థానికం'లో బీసీలకు 42% సీట్లిస్తామని స్పష్టం



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపక్షాలను కోరారు. ఇది రాజకీయాలు చేసేందుకు సరైన సమయం కాదంటూ ప్రతిపక్షాలకు హితవు పలికారు. 'కులగణన సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాం. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఇంటింటికెళ్లి వివరాలు సేకరించాం. అయినా.. కొందరు పనిగట్టుకుని నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను అశాస్త్రీయంగా నిర్వహించింది. పారదర్శకతకు పాతరేసి తప్పుల తడకగా నివేదికను తయారు చేసింది. ఆ వివరాలను ప్రజల ముందు పెట్టలేదు. అయినా దాని ప్రస్తావన 9ఏళ్ల తర్వాత ఇప్పుడు తెస్తున్నారు. ఆ తప్పును మేం సరిదిద్దాం. అందుకు మమ్మల్ని అభినందించాల్సింది పోయి విమర్శించడం ఎంతవరకు సమంజసం' అంటూ ప్రశ్నించారు. 'ప్రతిపక్షాలు బీసీలపై ఇప్పుడు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయి. ఇప్పటికీ.. ఎప్పటికీ బీసీలకు అండగా నిలబడేది కాంగ్రెస్సే.. మాటల్లో కాదు.. చేతల్లో చేసి చూపిస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను కేటాయిస్తాం. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఈ మాట చెప్పగలవా..?' అని ప్రశ్నించారు.

ఎస్టీల స్థితిగతులపై నివేదిక ఇవ్వండి

- ఎస్టీ ఎమ్మెల్యేల సమావేశంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్టీల సామాజిక ఆర్థిక స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా బడ్జెట్‌లో ప్రత్యేక పథకాలు రూపొందిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమభవన్‌లో మంత్రి సీతక్క ఎస్టీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ సమాజానికి దూరంగా ఉన్న గిరిజన జాతుల అభివృద్ధికి ఐకమత్యంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను సీఎంకు నివేదిస్తామని అన్నారు. ఎస్టీ సంక్షేమశాఖ నిధులు ఇతర అవసరాలకు మళ్లించొద్దని, ఐటీడీఏ ప్రాంతాల్లో పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

వర్గీకరణలో కుట్ర జరిగింది

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్ రాలేదని అన్నారు. గ్రూపు-3లో మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలను అత్యంత వెనుకబడిన కులాలను ఉంచిన గ్రూపు-1లో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. కులాల కూర్పు, రిజర్వేషన్ల కేటాయింపుపై కొంత మంది నెరిపిన మంత్రాంగం వల్లే మాదిగ జాతికి 11శాతం రిజర్వేషన్ అందలేదని విమర్శించారు. మాదిగల రిజర్వేషన్‌ను కేవలం 9శాతానికే పరిమితం చేయడం.. అన్యాయమని అన్నారు. అసలు వర్గీకరణ ప్రక్రియను ఏ విధంగా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన, వెనుకబాటుతనం ప్రాతిపదికన చేసినా మాదిగలకే రిజర్వేషన్ ఎక్కువ రావాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణలో లోపాలున్నాయని.. దీన్ని ప్రభుత్వం వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో "ఎస్సీ వర్గీకరణ ఆమోదం.. మూడు గ్రూపుల్లో రిజర్వేషన్ల కేటాయింపు, గ్రూపుల్లో కులాల చేర్పులు" అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి మంద కృష్ణ మాట్లాడారు. వర్గీకరణకు అనుకూలంగా ఏకసభ్య కమిషన్ నివేదిక ఇవ్వడాన్ని, వర్గీకరణ అమలుకు ప్రభుత్వం అనుకూలంగా ఉండడాన్ని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే, 59 ఎస్సీ కులాల్లో మాదిగ వర్గంలోనే అధిక జనాభా ఉందని, తమ వాటా మేరకు



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

రిజర్వేషన్ కేటాయించాలని గతంలో కమిషన్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా.. ఆ మేరకు కేటాయింపులు జరగలేదన్నారు. జనాభాలో మాదిగలకంటే తక్కువగా ఉన్న 17,71,682 మంది మాలలకు 5శాతం రిజర్వేషన్ ఇచ్చినప్పుడు, వెనుకబడి ఉన్న 32,74,377 మంది మాదిగలకు 9శాతమే కేటాయించడమేంటని నిలదీశారు. ఉమ్మడి ఏపీలో వర్గీకరణ జరిగినప్పుడు ఏ, బీ, సీ, డీ కేటగిరీలు ప్రకటించారని, అప్పుడు ప్రయోజనం పొందిన వారి జాబితాలో ఉన్న పంబాల, కొలుపుల వాండ్లు, పంబాడ, పంబండ, మన్నె తదితర కులాలను ఇప్పుడు అత్యంత వెనుకబడిన కులాల్లోకి ఎలా చేర్చుతారని ప్రశ్నించారు. బాగా అభివృద్ధి చెందిన పంబాల కులాన్ని వెనుకబడిన జాబితాలో చేర్చడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు. పంబాల వర్గానికి చెందిన ఘంటా చక్రపాణి కుటుంబంలోనే ముగ్గురు ప్రొఫెసర్లు ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా వారి జనాభా వెయ్యి కూడా లేదని పేర్కొన్నారు. డక్కలి కులానికి చెందిన వారు 2500 మంది ఉన్నా.. వారిలో చాలా మందికి ఇప్పటికీ సరైన విద్యా అవకాశాలు రాలేదని చెప్పారు. గతంలో గ్రూపు-బీలో ఉన్న బేడ, బుడ్గ జంగాలను ఇప్పుడు వెనుకబడిన కులాల జాబితాలోకి మార్చి.. మాదిగ జనాభాను తగ్గించే ప్రయత్నం చేశారని చెప్పారు. దళితుల్లో అధిక జనాభా కలిగి, వెనుకబడి ఉన్న కులాల జాబితాలో ఉన్న నేతకాని వర్గాన్ని.. అభివృద్ధి చెందిన కులాల జాబితాలో పెట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. నేతకాని కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్.. అదే వర్గం వ్యక్తి ఎంపీగా పోటీ చేసినప్పుడు ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. వర్గీకరణలో నేతకాని వర్గానికి ఒక శాతం రిజర్వేషన్ కేటాయించాలని ఎందుకు కోరలేదని అడిగారు. వర్గీకరణను అడ్డుకోవడం సాధ్యం కాదని తెలిసీ.. ఇలా కులాల కూర్పులో మంత్రాంగాన్ని నడిపించారని ఆరోపించారు. కాగా, కమిషన్ ప్రతిపాదించిన క్రిమీలేయర్ సిఫారసును తిరస్కరించిన ప్రభుత్వం.. కులాల వారీ రిజర్వేషన్ల విషయంలో మూడు గ్రూపులనే ఎందుకు ఆమోదించిందని ప్రశ్నించారు. అందరికీ న్యాయం చేయడం కోసం మూడు గ్రూపులను నాలుగు గ్రూపులుగా చేయొచ్చని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదని ప్రభుత్వం స్పందించి అందరికీ న్యాయం చేయాలని సూచించారు.

దామోదరను మంత్రి వర్గం నుంచి తప్పించాలి

ఏకసభ్య కమిషన్ సిఫారసుల్లో మాదిగ జాతికి దక్కాల్సిన స్థాయిలో రిజర్వేషన్లు ప్రతిపాదించలేదన్న విషయం సీఎం రేవంత్‌రెడ్డికి ముందే తెలుసని మంద కృష్ణ అన్నారు. వర్గీకరణ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందుగానే సీఎం రేవంత్ ఇద్దరు మాదిగ ప్రతినిధులతో మాట్లాడారని.. ఆ సమయంలోనే మాదిగ జనాభా ప్రకారం రిజర్వేషన్ రాలేదని.. కొంచెం సర్దుబాటు చేసుకోవాలని కోరినట్లు తెలిసిందన్నారు. అప్పుడే తమకు రిజర్వేషన్ తగ్గిందన్న విషయం అర్థమైందన్నారు. ఈ విషయమై వెంటనే మాదిగ ఎమ్మెల్యేలతోపాటు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. బీఆర్ఎస్ వాళ్లతో మాట్లాడేందుకు ప్రయత్నించానని ఎవరూ అందుబాటులోకి రాకపోవడంతో.. ఆ పార్టీ ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు విషయం చెప్పానన్నారు. అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడే ప్రయత్నం చేసినా సమయం ఇవ్వలేదన్నారు. జనాభా దామాషా మేరకు మాదిగ జాతికి రిజర్వేషన్లను తీసుకురావడంలో మంత్రి దామోదర రాజనర్సింహ విఫలమయ్యారని విమర్శించారు. మంత్రి వర్గం నుంచి ఆయన్ను తప్పించి.. ఆయన స్థానంలో మరో ఇద్దరు మాదిగలను తీసుకోవాలని సీఎంకు సూచించారు. ఇక నుంచి దామోదరను మాదిగ జాతి బిడ్డగా, తమ సామాజిక వర్గం ప్రతినిధిగా పరిగణించబోమని చెప్పారు. ఆయనొక మౌన ముని అని, కుటుంబ లబ్ధి కోసం మాత్రమే మౌనంగా ఉండిపోయారని ఆరోపించారు. ఆయన కారణంగా మాదిగ జాతి బిడ్డలు మొత్తం నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల వారీగా కేటాయించిన వాటాను ఖండిస్తున్నట్టు తెలిపారు. కాగా, ఈ నెల 7న నిర్వహించ తలపెట్టిన "లక్ష డప్పులు.. వేల గొంతులు" కార్యక్రమాన్ని వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమం వాయిదా పడినప్పటికీ డప్పుల కొనుగోలు మాత్రం ఆగకూడదని మాదిగలకు పిలుపునిచ్చారు. తాము నిర్వహించబోయే కార్యక్రమాన్ని వర్గీకరణపై నిరసనగా కాకుండా.. ఒక సాంస్కృతిక కార్యక్రమంగా భావించి ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ నాయకులు

వర్గీకరణపై భగ్గుమన్న మాలలు

- సీఎం దిష్టిబొమ్మ దహనం.. బ్లాక్‌డేగా ఫిబ్రవరి 4: జేఏసీ
- మాలలు కాంగ్రెస్‌ను వీడాలి..మాల సంఘాల జేఏసీ నేతలు
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు

ఉస్మానియా యూనివర్సిటీ/కవాడిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఎస్సీ వర్గీకరణ నిర్ణయంపై మాలలు భగ్గుమన్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తీరు సరిగా లేదని తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ ఆరోపించింది. దీన్ని నిరసిస్తూ.. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేత మాదాసు రాహుల్ మాట్లాడుతూ.. వర్గీకరణ వల్ల మాలలు నష్టపోయారని, ఫిబ్రవరి 4ను బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తడి గుడ్డతో మాలల గొంతు కోశారని ఆరోపించారు. అసెంబ్లీ హౌస్‌కమిటీ వేయకుండా మాల-మాదిగ ప్రతినిధులను సంప్రదించకుండా వర్గీకరణ చేయడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని మాల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీని మాలలు వీడాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు జేఏసీ నేతలు-- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, తెలంగాణ మాల జేఏసీ ప్రతినిధి చెరకు రాంచందర్ తదితరులు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. కొంతసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయమేర్పడింది. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాలలను మోసం చేసిందని ఆరోపించారు. తక్కువ రిజర్వేషన్లతో మాలలకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లోని మాల ప్రజాప్రతినిధులు వెంటనే పార్టీని వీడి.. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ తీర్మానాన్ని ఉపసంహరించుకోకుంటే.. కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

జిల్లాల్లో నిరసనలు

వర్గీకరణను నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. ఆదిలాబాద్ కలెక్టరేట్ ముందు, వరంగల్ కాశీబుగ్గ కూడలిలో ఆందోళనకారులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. భైంసా, రాజన్న-సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో, ఖమ్మం అంబేడ్కర్ సెంటర్‌లో, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కేంద్రంలో, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి.

మాదిగలకు 10% రిజర్వేషన్లివ్వాలి

- వర్గీకరణపై రేవంత్ నిర్ణయం భేష్
- ఏటా ఫిబ్రవరి 5న విజయోత్సవం: నేతలు
- క్రీమీలేయర్ కోసం 18 నుంచి దీక్ష
- మాదిగ మహా కూటమి చైర్మన్ కిరణ్
- వర్గీకరణ సరికాదు: మాల విద్యార్థులు
- కాంగ్రెస్‌కు క్రెడిట్ రావడం మంద కృష్ణకు ఇష్టం లేదు: పిడమర్తి రవి
- వర్గీకరణతో రాజ్యాధికారం: మోత్కుపల్లి
- మార్చి 1న అమరుల సంస్మరణ: వంగపల్లి



సీఎం రేవంత్‌ను సన్మానిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

బర్కత్‌పుర/పంజాగుట్ట/కవాడిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): "మాదిగ జనాభాకు అనుగుణంగా 10% రిజర్వేషన్లు కల్పించాలి. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. అన్ని జిల్లా కేంద్రాల్లో విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నాం. ఏటా ఫిబ్రవరి 5ను వర్గీకరణ విజయోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించాం" అని పలు మాదిగ సంఘాల నేతలు వెల్లడించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడు జన్ను కనక రాజు, మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్, తెలంగాణ మాదిగ సంఘాల సమన్వయ కర్త లాయర్ మల్లన్న, మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారుకు మాదిగలు అండగా ఉంటారని ముక్తకంఠంతో చెప్పారు. కాగా.. జస్టిస్ సమీర్ అక్తర్ కమిషన్ ప్రతిపాదనకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణలో క్రీమీలేయర్‌ను అమలు చేయాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 18 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. బర్కత్‌పురలోని మహాకూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, గ్రూప్-1 అధికారులు, మేయర్లు, జడ్పీ చైర్మన్ల వారసులను రిజర్వేషన్ల నుంచి మినహాయించాలన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ చేయడం మందకృష్ణ మాదిగకు ఇష్టం లేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. బీజేపీ కోసమే మాదిగలకు 11% రిజర్వేషన్ డిమాండ్ చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. వర్గీకరణ నిర్ణయంపై అభినందనలు తెలుపుతూ.. పిడమర్తి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎంకు సన్మానం చేశారు. 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో ఏనాడూ 11% రిజర్వేషన్ కోరలేదని గుర్తుచేశారు. మూడు దశాబ్దాలుగా 7% రిజర్వేషన్ కోరి.. ఇప్పుడు 11% కావాలనడం అర్థరహితమన్నారు.

దళితులు ఐక్యంగా ఉద్యమించాలి: మోత్కుపల్లి

ఎస్సీ వర్గీకరణ ద్వారానే దళితులకు రాజ్యాధికారం దక్కుతుందని, ఆ దిశగా దళితులంతా ఐక్యంగా ఉద్యమించాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు. మాల సోదరులు కలిసి వస్తే సమష్టిగా అభివృద్ధి చెందవచ్చన్నారు. బుధవారం ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వర్గీకరణ విజయాన్ని అమరులకు అంకితం చేస్తూ.. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారంటూ.. ఆయనను అభినందించారు. వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు.

బీసీ సంఘాలు ప్రతిపక్షం ట్రాప్‌లో పడొద్దు!

- శాస్త్రీయంగా కులగణన: మహేశ్ గౌడ్
- లైన్ దాటితే చర్యలు తప్పవని స్పష్టం
- బీసీలకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా?: పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందని, ప్రతిపక్ష నేతల ట్రాప్‌లో పడొద్దని బీసీ సంఘాల నేతలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభా 56 శాతంగా ఉన్నట్లు కులగణన సర్వే చెబుతున్నా.. ప్రతిపక్ష నేతలు బీసీ సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలతో కలిసి ఆయన మాట్లాడారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలతో బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీ కులగణన జరిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణే అని అన్నారు. కులగణనపైన ప్రతిపక్షాలు విమర్శలు చేయడానికి బదులు మంచి సూచనలిస్తే బాగుంటుందని హితవు పలికారు. కులగణన నివేదికపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడంపై స్పందిస్తూ పార్టీ లైన్ దాటితే ఎవరైనా సరే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆ పని క్రమశిక్షణా చర్యల కమిటీదని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలకు ఏం చేశారో చార్మినార్, బల్కంపేట ఎల్లమ్మగుడి వద్ద చర్చకు సిద్ధమా అంటూ ఆ పార్టీ నేతలకు మంత్రి పొన్నం సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌లో హక్కులు అడిగినందుకు బీసీ నేత అయిన ఈటల రాజేందర్‌ను పార్టీ నుంచి గెంటేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో 3 కీలక పదవులు ఒకరికే ఉన్నా అడిగే దమ్ము ఆ పార్టీలో ఎవరికైనా ఉందా అని నిలదీశారు. అసలు కులగణనలో పాల్గొనని వారికి కులగణన గురించి మాట్లాడే నైతికత ఎక్కడిదన్నారు. పొరపాట్లు ఉంటే బాధ్యతగా సరిచేస్తామని.. కుట్రదారుల ట్రాప్‌లో పడొద్దని బీసీ సంఘాల నేతలను కోరారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ.. కులగణన సర్వే అనేది చారిత్రాత్మకమని, ఇది రెండు బీసీ కులాల ప్రతినిధిగా చెబుతున్నానన్నారు. కులగణన సర్వే అమలును అడ్డుకుంటే మనకే నష్టమని బీసీ సంఘాలకు విజ్ఞప్తి చేశారు. స్వాతంత్రం వచ్చిన 76 ఏళ్ల తర్వాత బీసీలకు న్యాయం జరగబోతోందని సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని చెప్పారు.

మా కులానికి తీవ్ర అన్యాయం

- హోలియ దాసరి సంక్షేమ సంఘం

పంజాగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో హోలియదాసరి కులాన్ని మూడో గ్రూపులో చేర్చి తమకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని హోలియ దాసరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జహంగీర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలకు పూనుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంచార జాతులమైన తమను మెరుగైన ప్రయోజనం పొందిన కులాలలో కలపడం శోచనీయమన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా పొందలేని తాము అధిక ప్రయోజనాలు ఎలా పొందామో ప్రభుత్వం తెలియజేయాలన్నారు. వాస్తవాలను వక్రీకరించారని, తమ జనాభా లక్షకు పైగా ఉంటుందని, కానీ ప్రభుత్వం 8,482గా చూపిందని ఆరోపించారు. ఈ అన్యాయంపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, ప్రభుత్వంపై పోరాడుతామని చెప్పారు.

మృత్యు వాగు.. మింగేసింది !

- ఏడాది క్రితం తండ్రి.. ఇప్పుడు కుమారుడు
- భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో ఘటన



సంతోష్ (ఫైల్)

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆ తండ్రీకొడుకును మృత్యువు వెంటాడింది. ఏడాది వ్యవధిలోనే అదే చలివాగు ఇద్దరినీ మింగేసింది. ఏడాది క్రితం చెరువులో మునిగిపోతున్న కొడుకును రక్షించబోయి తండ్రి చనిపోగా, అదే చెరువులో బుధవారం కొడుకు మృత్యువాత పడ్డాడు. ఈ ఇద్దరి మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వంగిడిపల్లికి చెందిన పురాణం స్వరూపకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సంతోష్(14) మొగుళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతిలో చదువుకుంటూ ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. బుధవారం ఉదయం హాస్టల్‌లో టిఫిన్ చేసి పాఠశాలకు వెళ్లకుండా స్నేహితులతో కలిసి అతడు చలివాగులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. పక్కనే ఉన్న పెద్దవాగు సమీపంలో విత్రుడు సాంబశివ బహిర్భూమికి వెళ్లగా సంతోష్ చలివాగులో దిగాడు. కొంత సమయం తర్వాత కాపాడండంటూ సంతోష్ వేసిన కేకలు సాంబశివకు వినిపించాయి. అతడు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే సంతోష్ వాగులో గల్లంతయ్యాడు. పోలీసులు మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టగా సంతోష్ మృతదేహం లభ్యమైంది. వార్డెన్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని మృతుడు సంతోష్ కుటుంబ సభ్యులు హాస్టల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చిట్యాల సీఐ మల్లేశ్, తహసీల్దార్ సునీత, మండల ప్రత్యేక అధికారి సునీత చెప్పడంతో ఆందోళనను విరమించారు.

మేడారంలో ఘనంగా గుడిశుద్ధి పండుగ

- మినీ జాతరకు అంకురార్పణ.. 40 వేల మంది రాక


తాడ్వాయి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మేడారంలో సమ్మక్క గుడి, కన్నెపల్లిలో సారలమ్మ గుడిలో గుడిశుద్ధి పండుగను పూజారులు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా తెల్లవారుజామున నిద్ర లేచి జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలో సమ్మక్క గుడి, కన్నెపల్లిలో సారలమ్మ గుడిని శుద్ధి చేశారు. దేవతల ప్రతిమలు, పూజా సామగ్రి బయటకు తీసి శుభ్రపరిచారు. గుడిలో పల దేవతల పీఠాలను పూజారుల కుటుంబాల ఆడపడుచులు అలుకు పూతలు చేసి రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. మినీ జాతర వేడుకలకు ముందు ఈ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. మరో ఆరు రోజుల్లో మేడారం మినీ జాతర ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నాలుగు రోజుల పాటు జరగనుంది. అయితే ఈ బుధవారం నుంచే మినీజాతర వేడుకలకు అంకురార్పణగా భావించి పూజలు చేస్తుంటారు. ఈసందర్భంగా వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. బుధవారం సుమారు 40వేల మంది అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా, తాడ్వాయి మండలంలోని బయక్కపేట గ్రామం సమ్మక్క గుడిలో గుడిమెలిగే పండుగ ఘనంగా జరిగింది. ఈ నేపథ్యంలో డోలి వాయిద్యాల నడుమ చంద వంశీయులు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. దీపధూప నైవేద్యాలను సమర్పించారు.

అది అసమగ్ర కులగణన

సర్వే పూర్తయినట్లు పార్లమెంటునే తప్పుదోవ పట్టిస్తారా.. రాహుల్ జీ?

- 51 శాతమున్నా బీసీ జనాభా పదేళ్లలో 46 శాతానికి పడిపోయిందా?
- అదే అగ్రవర్ణాల జనాభా ఎలా పెరిగింది?
- 'స్థానికం'లో 42% రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని తేలింది
- తెలంగాణ బీసీలకు క్షమాపణలు చెప్పండి
- కాంగ్రెస్ అగ్రనేతకు కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'లక్షలాది మంది వివరాలు సేకరించకుండానే కాంగ్రెస్ సర్కారు కులగణన సర్వే పూర్తి చేసింది. అలాంటి కులగణనపై మాట్లాడి పార్లమెంటును తప్పుదోవ పట్టిస్తారా.. రాహుల్ జీ' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గత దశాబ్ద కాలంలో బలహీన వర్గాల జనాభా తగ్గినట్లు చూపిన తప్పుడు లెక్కలను ఎవరూ నమ్మడం లేదని పేర్కొంటూ కాంగ్రెస్ అగ్ర నేతకు బుధవారం లేఖ రాశారు. 'అసమగ్రంగా జరిగిన సర్వే పూర్తయినట్టు సాక్షాత్తూ దేశ అత్యున్నత చట్టసభలో రాహుల్ పేర్కొనడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కిందట చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల సంఖ్య 1.85 కోట్లని తేలింది. రాష్ట్ర జనాభాలో ఇది 51 శాతం కాగా.. మైనారిటీల్లో ఉన్న బీసీలను కూడా కలిపితే మొత్తం బీసీల సంఖ్య 61 శాతం.. అలాంటిది పదేళ్ల తర్వాత కాంగ్రెస్ సర్కారు కులగణన సర్వేలో బీసీల జనాభా 1.64 కోట్లకు తగ్గింది.. ఇంకా పెరగాల్సిన బీసీ జనాభా 46 శాతానికి ఎలా పడిపోతుంది. ఇదే పదేళ్లలో అగ్రవర్ణాల జనాభా ఎలా పెరుగుతుంది. బీసీ సంఘాల నేతలు కులగణన నివేదికను చించి నిరసన తెలిపారు. సర్కారు కులగణన అంతా తప్పుల తడక అని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ ఇంకేం కావాలి' అని పేర్కొన్నారు. కులగణన సర్వేను కూడా ఇతర రాష్ట్రాల్లో వాడుకోవాలనే ఎత్తుగడలో భాగంగానే రాహుల్ పార్లమెంట్‌లో దీని ప్రస్తావన తెచ్చారని ఆరోపించారు. కులగణనలో దొర్లిన దారుణమైన తప్పులను సవరించాల్సిన బాధ్యతను మరిచి బంతిని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకోవాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని అసెంబ్లీ సాక్షిగా తేలిపోయిందన్నారు. చివరకు కాంగ్రెస్ పరంగా మాత్రమే సీట్లిస్తామని చేతులెత్తేయడం మోసం కాకపోతే ఏంటని నిలదీశారు.



రాహుల్ వ్యాఖ్యలు విడ్డూరం..

కులగణనలో తప్పుడు లెక్కలపై బీసీ బిడ్డలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే..వాస్తవాలు తెలుసుకోకుండా రాహుల్ మాట్లాడటం దారుణమని కేటీఆర్ ఆక్షేపించారు. 'తెలంగాణలో బీసీలకు తీవ్ర అన్యాయం చేసే ఈ ఫెయిల్యూర్ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరడం మరో విడ్డూరం. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ బూటకమని తేలిన నేపథ్యంలో తెలంగాణలోని బీసీలకు రాహుల్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. కాగా, నల్లవల్లి, ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న ప్రజలను కలిసేందుకు వెళ్లిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎవరికీ పట్టని బర్మా!

ఉక్రెయిన్, గాజా యుద్ధాల గురించి ఆ మాత్రమైనా పట్టించుకున్న మిగతా ప్రపంచం, పేదదేశం కావడంవల్లనేమో మయన్మార్‌లో సైనికపాలకులకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాపోరాటాన్ని పూర్తిగా విస్మరించింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి, దేశాన్ని సైనికపాలకులు హస్తగతం చేసుకొన్న ఈ నాలుగేళ్ళలో మయన్మార్‌లో పరిస్థితులు బాగా దిగజారాయి. సాగుతున్న అంతర్యుద్ధంలో సైనిక ప్రభుత్వం మరింత బలహీనపడిందన్న వార్తలు వినబడుతున్నా, ఎవరిదో ఒకరిది పైచేయిగా సమీపకాలంలో పోరు ముగిసే సూచనలైతే లేవు.

నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్ఎల్‌డి) నాయకురాలు ఆంగ్‌సాన్ సూచీ మరోమారు మరింత మెజారిటీ సాధించడం మయన్మార్ సైనికాధికారులు సహించలేకపోయారు. నామమాత్రపు ప్రజాస్వామ్యాన్నీ, పరిమిత అధికారాలనూ ఇచ్చినా ప్రజలు ఆమెకు తిరిగి ఘనంగా పట్టం కట్టడం వారికి నచ్చలేదు. ఆమె మాటకు అడ్డంకొట్టగల, ప్రతీ నిర్ణయాన్నీ సమీక్షించి, నిలిపివేయగల విశేషాధికారాలు వారివద్దనే ఉన్నా, ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకున్న ప్రేమాదరాలతో మలివిడతలోనూ ఆమె బలంగా నెగ్గుకురావడంతో సైనికాధికారులకు బెంగపట్టుకుంది. ఆమె కొనసాగితే తమ ఉనికికి ముప్పువస్తుందని భయపడ్డారు, అర్ధరాత్రి కుట్రతో అధికారంనుంచి దించేసి, తిరిగి నిర్బంధంలోకి నెట్టేశారు. పదవినైతే లాక్కున్నారు కానీ, ఆ తరువాత దేశవ్యాప్తంగా రేగిన పోరాటాలను వారు నియంత్రించలేకపోయారు. దేశం నలుమూలల్లోనూ వేర్వేరు ఆశలూ లక్ష్యాలతో వివిధ సంస్థలు సాగిస్తున్న పోరాటాలతో దేశం కల్లోలంలోకి జారిపోయింది. త్రీ బ్రదర్‌హుడ్ అలయెన్స్ గొడుగుకింద మూడు గ్రూపులు ప్రధానంగా సైన్యంతో పోరాడుతున్నాయి. భారత్–బంగ్లా సరిహద్దుల్లోని రఖైన్ ప్రాంతంమీద అరకన్ ఆర్మీ ఆధిపత్యం సాధించింది. దీనిసాయంతో చిన్ బ్రదర్‌హుడ్ అలయెన్స్ అనే సంస్థ చిన్ రాష్ట్రం మీద పట్టుసాధించింది. రఖైన్–చిన్ ప్రాంతాలు మిజోరం, మణిపూర్‌తో సరిహద్దులు పంచుకుంటున్నందున ఈ అంతర్యుద్ధం ప్రభావాన్ని మనం అనునిత్యం భరిస్తున్నాం. తిరుగుబాటుదారులతో సహా సామాన్యజనం నుంచి సైనికులవరకూ అంతా హద్దులు దాటివస్తున్నారు. వేలాదిమంది చిన్–కుకీలు ఆశ్రయం పొందుతూంటే, పోరాటంలో ఉన్నవారిని వెనక్కునెట్టడం నిత్యకృత్యంగా సాగుతోంది. చైనా సరిహద్దులోని షాన్ ప్రాంతం మరో రెండు సాయుధ సంస్థల చేతుల్లో ఉంది. సైనికపాలన తొలగి, సూచీ నాయకత్వంలో తిరిగి ప్రజాప్రభుత్వం ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నవారు సైతం ఆయుధాలు పట్టి ఈ పోరాటంలో భాగస్వాములుగా ఉన్నారు.

ప్రస్తుతం దేశంలోని అధికభాగం తిరుగుబాటుదారుల హస్తగతమైపోయిందని, సైనికపాలకుల చేతిలో ఐదోవంతు కూడా మిగల్లేదని వార్తలు వస్తున్నాయి. ఇది పూర్తిగా నిజమైనా కాకున్నా, చైనా ఆర్థిక, ఆయుధసాయంతో సైనిక ప్రభుత్వం ఆఖరువరకూ తన ఆధిపత్యం నిలబెట్టుకొనే ప్రయత్నంలో అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నది. తిరుగుబాటుదారులపక్షం వహిస్తున్నారన్న పేరిట గ్రామాలకు గ్రామాలు తగలబెడుతోంది. ఈ అంతర్యుద్ధం కారణంగా నలభైలక్షలమంది నిరాశ్రయులైనారని, సగం జనాభా దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నదని అంతర్జాతీయ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. రఖైన్ వంటి రాష్ట్రాలు ఆకలితో అల్లాడిపోతున్నాయని, రోహింగ్యాలు అటు సైన్యానికీ, ఇటు అరాకన్ ఆర్మీకీ మధ్య నలిగిపోతున్నారని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రధాన నగరాలు ఇంకా సైన్యం అధీనంలోనే ఉన్నందున, బలవంతపు నియామకాలతో బలాన్ని పెంచుకుంటున్నందునా సమీపకాలంలో యుద్ధం ఆగే సూచనలైతే లేవు. గద్దెదిగడం ఇష్టంలేక, ఓటమిని జీర్ణించుకోలేక ప్రతీకారవాంఛతో రగిలిపోతున్న సైన్యం మరింత అమానవీయంగా ప్రవర్తిస్తోంది. సైనికపాలకుల మధ్య లుకలుకలు ఆరంభమైనాయన్న వార్తల నేపథ్యంలో మిగతా ప్రపంచం మయన్మార్‌మీద దృష్టిసారించాల్సిన తరుణం ఇది. సైనికపాలకులకు కొన్ని రాయితీలు, రక్షణలకు హామీ పడుతూ త్వరితగతిన దారికి తీసుకురావడం అవసరం. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్టుగా సైనికపాలకులు ఒక కొత్తనాటకానికి ఈమధ్యనే తెరదీశారు. సామాన్యజనం, తిరుగుబాటుదారులు గత అనుభవాల దృష్ట్యా దీనిని పూర్తిగా తిరస్కరిస్తున్నారు. 82 శాతం సీట్లు గెలుచుకున్న ఆంగ్‌సాన్ సూచీని మూడునెలల్లోనే గద్దెదింపిన సైనికపాలకులు తిరిగి ఎన్నికల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఏ మాత్రం విశ్వసనీయతలేని ఈ ఎన్నికలు జరిగి కూడా ప్రజలకు కానీ, ప్రజాస్వామ్యానికి కానీ ప్రయోజనం ఉండదు.

అపర చాణుక్యుని తికమక రాజకీయం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి ఈ ముచ్చట. ఆయన గత సార్వత్రిక ఎన్నికల్లో 60 శాతం ఓట్లతో ఘన విజయం సాధించిన కూటమికి నాయకుడు. ఇంత విజయానికి కారణం, చంద్రబాబు ప్రతిభ గోరంత మాత్రమేననీ, దానికి అసలు కారణం కొండంత జగన్ ప్రతిభేననీ అంటారు కొందరు పరిశీలకులు. పరస్పర విరుద్ధంగా కనిపించే మరో మాట కూడా వారే చెబుతారు. ప్రధాని మోదీ ఢిల్లీ లడ్డు లాంటివాడట. హిందీలో ఓ సామెత ఉంది. ఢిల్లీ లడ్డూని తిన్నవాడు పశ్చాత్తాపపడతాడు; తిననివాడు కూడా పశ్చాత్తాపపడతాడట. మోదీతో మైత్రి వల్ల కూటమికి 65–70 శాతం రావాల్సిన ఓట్లు, 60 శాతానికి పడిపోయాయన్నది వారి అంచనా. అయితే, దీనికి అవతలి పార్శ్వం కూడా ఉంది. కేంద్రంలో పాతుకున్న మోదీతో శత్రుత్వం వహిస్తే, చంద్రబాబు గెలవడం అసాధ్యమని కూడా వారు అంచనా వేశారు. మోదీతో పొత్తువల్ల జరిగే నష్టం కంటే, శత్రుత్వం వల్ల జరిగే నష్టం ఎక్కువ అని సకాలంలో గ్రహించిన చంద్రబాబు, మోదీని కౌగిలించుకొన్నాడు, అంటారు.

ఈ తర్కం సరే. ఆయన సలాం కొట్టక తప్పని పరిస్థితుల్లో సలాం కొడుతున్నాడు. సరే. సాష్టాంగపడడం అవసరమా? సాష్టాంగం కూడా సరే. మోదీని ఎదిరిస్తున్న వ్యక్తులపై బురదచల్లడం అవసరమా? ఆయన్ని చాణుక్యుడు అంటారు గదా! ఢిల్లీ పోయి కేజ్రీవాల్‌ని తిట్టిపోయడంలో గల చాణక్యం ఏమిటో మనకి అర్థంకాదు. చంద్రబాబుగారూ, ఒక్క రూపాయి ఆధారం లేకుండా మిమ్మల్ని జైల్లో కుక్కినట్టే, ఒక్క పైసా ఆధారం చూపకుండా సిసోడియానూ, కేజ్రీవాల్‌నూ కూడా జైల్లో ఉంచారు గదా! ఢిల్లీలో మీ 'చాణక్యం' ఏ రకంగా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను, లేదా మీ పార్టీ ప్రయోజనాలను నెరవేరుస్తుంది? ఆంధ్రప్రదేశ్ పట్ల, ఎంతో కొంత సానుభూతి ఉన్న నాలాంటి పరిశీలకులకు మీ అపర 'చాణక్యం' అర్థమై చావడం లేదు. మీ కోసం ప్రాణాలిచ్చే మీ అనుయాయులకైనా అర్థమౌతోందా? మీకు తోడు, మీ ఉప చాణుక్యుడు పవన్ కళ్యాణ్ సనాతనవాదం కోసమూ, మోదీ కోసమూ తన ప్రాణాలు అర్పిస్తా అని శపథాలు చేస్తున్నాడు.

ఈ పాటికి జైలు ఊచలు లెక్కబెడుతూ ఉండాల్సిన ఓ ఘనుడు మరోసారి రాష్ట్రాన్ని చెరబట్టడానికి కాచుకొని ఉన్నాడు. రాష్ట్రంలో కనీసం ఒక్క శాతం ఓట్లు కూడా లేని మోదీ దాన్ని గుప్పిట్లో పెట్టుకొన్న తీరు చూసి కడుపు నిండిపోతోంది. ఈ మొత్తం దృశ్యం గజిబిజిగానూ ఉంది. తికమకగానూ ఉంది. ఆంధ్రప్రదేశ్ అదృష్టమే అదృష్టం!

– ఎ. గాంధి, సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్

కులాల సంగతులతోనే సర్వేకు సార్థకత!



షెడ్యూల్ కులాల (ఎస్సీలు) వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుని తెలంగాణ ప్రభుత్వం ఒక ముందడుగు వేసింది. నిస్సందేహంగా స్వాగతించాల్సిన పరిణామం ఇది. 30 ఏళ్లుగా వివిధ రూపాల్లో తెలుగునాట అనేక ఆందోళనలకు కారణమై ఎన్నో చిక్కుముడులున్న సమస్య పరిష్కారానికి ఒకదారి ఏర్పడింది. ఏ జటిల సమస్యకైనా నూటికి నూరుపాళ్లూ అందరికీ ఆమోదకరమైన పరిష్కారం ఉండదు. మొత్తం ఎస్సీలను మూడు సమూహాలుగా చేసి 1, 9, 6 శాతం చొప్పున రిజర్వేషన్లను కేటాయించటంపై అసంతృప్తులూ అసమ్మతులూ ఇప్పటికే కొన్ని వినిపిస్తున్నాయి. ఇవి రానున్న రోజుల్లో ఏ రూపం తీసుకుంటాయో ఇప్పుడే చెప్పలేం. కాలక్రమేణా సద్దుమణగనూ వచ్చు. కొత్త వాదనలతో కొంత కాలం కొనసాగనూ వచ్చు!

ఏ సామాజిక సమస్యా నిరంతరం వాద ప్రతివాదాలతో, సంఘర్షణాత్మకంగా కొనసాగాలని ఎవ్వరమూ కోరుకోం. సమస్యలను సాధ్యమైనంతమేరకు తక్కువ అసమ్మతితో పరిష్కరిస్తూ ముందుకు వెళ్లాలనే అనుకుంటాం. వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని చెబుతూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు కొన్ని హెచ్చరికలనూ షరతులనూ పెట్టింది. కుల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించకూడదన్నది అందులో ప్రధానమైంది. రిజర్వేషన్లు వర్తింపచేసే అన్ని రంగాల్లో ఒక కులం బాగా వెనుకబడి ఉందని గణాంకాల ఆధారంగా నిర్ధారించుకుని ఆ వెనుకబాటుని అధిగమించటానికి ఎంత శాతం రిజర్వేషన్లు అవసరమో అంత శాతం మాత్రమే ఉండేలా చూడాలనీ స్పష్టంచేసింది. జనాకర్షణ రాజకీయాల కోసం రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించకుండా ముందుగా కట్టడి చేసే ఉద్దేశంతో సుప్రీంకోర్టు దీన్ని నిర్దిష్టంగా పేర్కొంది. ఒకవేళ ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా దీనికి భిన్నంగా రిజర్వేషన్ల శాతాలను నిర్ణయిస్తే కోర్టుకు రావచ్చనీ స్పష్టంచేసింది. న్యాయ సమీక్ష ముందు రిజర్వేషన్ల శాతాలు నిగ్గుతేలాల్సి వస్తుందనీ హెచ్చరించింది.

ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడాల్లేకుండా జనాకర్షణ, ఓట్ల రాజకీయాల కోసం నిర్హేతుక నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు పెట్టిన షరతులూ చేసిన హెచ్చరికల్లో ఔచిత్యం లేదని అనుకోలేం. ఈ నేపథ్యంలో వర్గీకరణ సమస్యపై జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక మొత్తాన్ని ప్రజల ముందు పెట్టి ఉంటే సముచితంగా ఉండేది. నివేదికలో ప్రధాన అంశమైన రిజర్వేషన్ల శాతాన్ని ఆమోదించిన తర్వాత ఆలస్యం చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండకూడదు. రిజర్వేషన్ల శాతం నిర్ధారించటానికి ప్రాతిపదికగా ఉన్న సమస్త సమాచారాన్ని వెంటనే బయటపెట్టటం వలన అపోహలూ అపార్థాలూ తొలగిపోతాయి.

సరైన గణాంకాలు ఉండకపోవటం మన సమాజంలో పెద్ద సమస్య ప్రజాధనాన్ని ఎంతో ఖర్చుపెట్టి సేకరించిన గణాంకాలను ఆ ప్రజలకే వెల్లడించని సంఘటనలు మనకు చాలా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేనే దీనికి నిదర్శనం. ఎంతో ఆర్భాటంగా, దేశంలోనే కనీవినీ ఎరగని రీతిలో సర్వేని చేపడుతున్నామని చెప్పి దాని గురించి అధికారికంగా ఒక్కమాటైనా మాట్లాడకుండా ఏళ్లపాటు మౌనం వహించటాన్ని ప్రజాస్వామిక నైతికత దృష్ట్యా ఏ మాత్రం సమర్థించలేం. ఎన్నో వైపుల నుంచి ఎందరో ఆ సర్వే ఫలితాలు వెల్లడించాలని కోరినా ఏళ్లపాటు కిమ్మనలేదు. వర్గీకరణపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా దాన్ని చక్కటి రంగులతో, గ్రాఫ్‌లతో కూడిన సంక్షిప్త నివేదికను అనధికారికంగా అందరికీ అందుబాటులోకి తెచ్చారు. రాజకీయాల కోసం సర్వేలను సమయానుకూలంగా దాచిపెట్టటమూ వెల్లడిచేయటమూ చేస్తారనటానికి ఇంతకంటే నిదర్శనం ఉండదు.

విద్య, ఉద్యోగాలు, పదవుల్లో వివిధ కులాలకు దక్కిన ప్రాతినిధ్యంపై 1990ల నుంచి రాజకీయంగానూ ఇతరత్రానూ విపరీతంగా చర్చలు జరుగుతున్నాయి. వర్గీకరణ సమస్య కూడా ఆ చర్చల నుంచి ఊపిరిపోసుకుని ఆందోళనబాటను తీసుకుంది. వివిధ స్థాయి ఉద్యోగాల్లో మాల, మాదిగలతో పాటు ఇతర చిన్నకులాలకు దక్కిన ప్రాతినిధ్యం వెల్లడైతే మన సమాజంలో మార్పుల తీరుతెన్నులూ తెలుస్తాయి. వివిధ కులాలకు దక్కిన ఉద్యోగాల గురించి రాజకీయంగా చేసే వాదనలు, ప్రచారాలు స్థూలంగా నిజాలు కావచ్చు. కానీ స్థూల సమాచారం ఎప్పటికీ నిర్దిష్ట వివరాలకు సమానం కాదు. అందుకే ఉద్యోగాల్లోనూ, ప్రభుత్వం నుంచి సహాయం అందుకున్న పథకాల్లోనూ ఎవరు ఎక్కడున్నారో తెలియటం సామాజిక న్యాయం దృష్టితో చూస్తే చాలా అవసరం.

1931లో బ్రిటిష్ ప్రభుత్వం జనాభా లెక్కలతో పాటు చేసిన కులాల లెక్కింపును ఆధారం చేసుకునే ఇప్పటివరకూ ఎవరి సంఖ్య ఎంతో తెలుసుకుంటున్నామనీ, తాము తెలంగాణలో చేసిన సర్వేతో ఆ ఇబ్బంది తొలగిపోయిందనీ రేవంత్‌రెడ్డి అన్నదాంట్లో నిజముంది. కానీ బ్రిటిష్ ప్రభుత్వం ఆ కుల లెక్కలు అందరికీ అందుబాటులో ఉంచింది. ఇప్పుడు కావాల్సింది ఆ అందుబాటే! సామాజిక మాధ్యమాల విజృంభణ వల్ల కులాలకు సంబంధించి వెల్లడించని సమాచారంతో చేటు ఎక్కువ! ఫలితం తక్కువ!



■ రాహుల్ కుమార్

ఎస్సీల వర్గీకరణ సమస్య ఉమ్మడి రాష్ట్రంలో ఊపిరిపోసుకుంది. కులగణన సమస్య అలా కాదు. దేశవ్యాప్తంగా కులగణన అవసరంపై ఉధృతంగా ప్రచారం చేసి దాన్నొక రాజకీయ అజెండాగా పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతోంది. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ కులగణన గురించి మాట్లాడని రోజులేదు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిపోయిన ఉన్నతాధికార వర్గంలో గుప్పెడుమంది బీసీల తలరాత రాస్తున్నారనీ అనేక సందర్భాల్లో విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టి సామాజిక న్యాయానికి చరిత్రాత్మక రీతిలో స్వీకారం చుట్టి దేశగతినే మార్చివేస్తామనీ చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కులగణన విషయంలో ముందుండి మార్గదర్శకంగా నిలబడతాయని కూడా ప్రకటనలు చేశారు.

ఇందులో భాగంగానే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను పూర్తిచేసింది. కొంతమేరకు ఫలితాలను వెల్లడించింది. సమాచారం పాక్షికంగా వెల్లడించటంతో తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని ఇప్పటికీ పూర్తిగా తెలుసుకునే అవకాశం లేదు. ఒక్క కులాల వారీ జనాభాకే పరిమితం కాకుండా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయపరమైన వివరాలను సమగ్రంగా వెల్లడిస్తారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెప్పారు. గోప్యత దృష్ట్యా వ్యక్తిగత వివరాలు వెల్లడించలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పటాన్ని ఒకకోణం నుంచి విమర్శించలేం! ఫలానా వ్యక్తికి ఇన్ని ఆస్తులు ఉన్నాయి.. ఇన్ని వాహనాలు ఉన్నాయి.. ఇన్ని భూములు ఉన్నాయి. ఇన్ని భవనాలు ఉన్నాయి.. అని పేరుతో సహా వెల్లడిస్తే సమస్య వస్తుంది. గోప్యతకు భంగం కలుగుతుంది. కులాల వారీ జనాభా ఇవ్వటానికీ ఏ కులం వారు ఉద్యోగాల్లో ఎంత మంది ఉన్నారో చెప్పటానికీ వివిధ స్థాయిల్లో రాజకీయ పదవుల్లో ఎందరున్నారో తెలపటానికి అభ్యంతరం ఏమిటో అర్థం కాదు. కనీసం బిహార్ ప్రభుత్వం 2023లో వెల్లడించిన కులగణన వివరాల స్థాయిలో ఇవ్వటానికి వెనుకాముందు ఆడితే కాంగ్రెస్ సామాజిక న్యాయ అజెండాకు సార్థకత ఉండదు.

కాంగ్రెస్ పార్టీ తాను చేపట్టదలచిన సర్వే పేరులోనే ఏ విషయాలను సేకరిస్తామో స్పష్టంచేసింది. 'సామాజిక, ఆర్థిక, విద్యా ఉపాధి, రాజకీయ, కుల సర్వే' పేరిట ఇంటింటికి తిరిగి సేకరించిన సమాచారంలో రిజర్వేషన్, నాన్ రిజర్వేషన్ కేటగిరీలకు చెందిన ప్రజల శాతాన్ని మాత్రమే ప్రకటించారు. దీని వల్ల సర్వే లక్ష్యంగా పేర్కొన్న ఆరు అంశాల్లో ఏదీ స్పష్టంగా తెలియదు. అవసరమైన పక్షంలో మాత్రమే వ్యక్తిగతమైన సమాచారం మినహా మిగతా సమాచారాన్ని వెల్లడిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. సర్వే సమాచారాన్ని క్రోడీకరించి మొత్తం ఆరు అంశాలకు సంబంధించిన వివరాలను నిర్దిష్టంగా ఫలానా తేదీ లోపల వెల్లడిస్తామని స్పష్టం చేయలేదు. మంత్రులు కూడా ప్రభుత్వ పథకాల అమలులో సర్వే సమాచారాన్ని ఉపయోగించుకుంటామని మాత్రమే చెబుతున్నారు.

తెలంగాణ సమాజమే కాదు.. దక్షిణాది రాష్ట్రాలన్నీ 1990ల నుంచి వేగంగా అనేక సామాజిక మార్పులకు లోనవుతున్నాయి. బీసీలు రాజకీయ చైతన్యపరంగానే కాదు.. విద్యా ఉద్యోగ విషయాల్లో పోటీపడటంలో వెనుకంజ వేయటం లేదు. తమకు కేటాయించిన రిజర్వేషన్లకు మించి ఓపెన్ కేటగిరీలో ప్రతిభను ప్రదర్శించి విద్యారంగంలోనూ, ఉద్యోగాల్లోనూ స్థానాలను సంపాదించుకుంటున్నారు. గడిచిన నాలుగైదు సంవత్సరాల్లో వైద్య సీట్లను చూసినా ఇది అర్థం అవుతుంది. ఇటీవల గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హులైన వారి జాబితా చూసినా ఇది తెలుస్తుంది. ఉద్యోగాల విషయంలోనూ ఈ సామాజిక మార్పు కనపడుతుంది. పంచాయతీ సంస్థల్లోనూ రిజర్వేషన్లకు మించి కొన్నిచోట్ల రెట్టింపుగా పదవులను దక్కించుకుంటున్నారు.

పోటీపడి ఉద్యోగాలను దక్కించుకోవటం ఆహ్వానించే పరిణామమైనా దానికి సంబంధించి కూడా పరిశీలించాల్సిన అంశాలు ఉన్నాయి. బీసీలకు సంబంధించి కూడా మూడునాలుగు కులాలు మాత్రమే ముందున్నాయా అన్నది తెలుసుకోవటం కూడా కీలకం. బిహార్ సర్వే వల్ల వెల్లడైన నిజం అదే. ఓబీసీల్లోని నాలుగు కులాలే ఉద్యోగాలు, పదవుల్లో సింహభాగాన్ని అక్కడ దక్కించుకున్నాయి. సంఖ్యరీత్యా ఎక్కువున్న ఈబీసీలకు (ఎక్స్‌ట్రీమ్ బాక్‌వర్డ్ క్లాస్) అతి తక్కువ స్థాయిలో ప్రాతినిధ్యం ఉంది. ఇలాంటి అసమానతలను సరిదిద్దటానికి ప్రజల ముందు సర్వేకు సంబంధించిన సమగ్ర సమాచారం పెట్టటం చాలా అవసరం. నిజానికి బిహారు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచితే కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్త సామాజిక అజెండా ప్రచారానికి బాగా పనికి వస్తుంది.

వివిధ కులాలకు దక్కిన ఉద్యోగాల గురించి రాజకీయంగా చేసే వాదనలు, ప్రచారాలు స్థూలంగా నిజాలు కావచ్చు. కానీ స్థూల సమాచారం ఎప్పటికీ నిర్దిష్ట వివరాలకు సమానం కాదు. అందుకే ఉద్యోగాల్లోనూ, ప్రభుత్వం నుంచి సహాయం అందుకున్న పథకాల్లోనూ ఎవరు ఎక్కడున్నారో తెలియటం సామాజిక న్యాయం దృష్టితో చూస్తే చాలా అవసరం.

సామాజిక, ఆర్థిక, కుల సర్వేలకు సంబంధించి సమాచారం వెల్లడించటానికి రాజకీయ సమస్యలు ఉంటాయి. కాదనలేం. కర్ణాటకలో ఎప్పుడో సిద్ధమైన కుల సమాచారాన్ని ఇప్పటికీ అక్కడ వెల్లడి చేయలేకపోతున్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య ఈ విషయంలో ఏకాభిప్రాయంలేదు. నిజానికి తెలంగాణలో చేపట్టిన అంత సమగ్రంగానూ అక్కడ సర్వే చేపట్టలేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రెండో దఫా (2009) అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్త సామాజిక, ఆర్థిక, కులగణనను చేపట్టింది. కానీ ఆ ఫలితాలను వెల్లడించలేకపోయింది. 5 వేల కోట్లకు పైగా ఖర్చుపెట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. కులాలకు సంబంధించి ఆ సర్వే నిరుపయోగమని తదనంతరం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేవలం ఆర్థికపరమైన సమాచారం మాత్రమే ఉపయోగమని పేర్కొంటూ దాన్ని మోదీ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచింది.

1931లో బ్రిటిష్ ప్రభుత్వం జనాభా లెక్కలతో పాటు చేసిన కులాల లెక్కింపును ఆధారం చేసుకునే ఇప్పటివరకూ ఎవరి సంఖ్య ఎంతో తెలుసుకుంటున్నామనీ తాము తెలంగాణలో చేసిన సర్వేతో ఆ ఇబ్బంది తొలగిపోయిందనీ రేవంత్‌రెడ్డి అన్నదాంట్లో నిజముంది. కానీ బ్రిటిష్ ప్రభుత్వం ఆ కుల లెక్కలు అందరికీ అందుబాటులో ఉంచింది. ఇప్పుడు కావాల్సింది ఆ అందుబాటే! సామాజిక మాధ్యమాల విజృంభణ వల్ల కులాలకు సంబంధించి వెల్లడించని సమాచారంతో చేటు ఎక్కువ! ఫలితం తక్కువ!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

పంట పొలాల్లో పరిశ్రమలెందుకు?

తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో 30 వేల ఎకరాల భూమిని సేకరించి ఆ సిటీకి ఎందుకు అంత ప్రాధాన్యత ఇస్తున్నదో సామాన్యులకు అర్థం కావడం లేదు. ఫ్యూచర్ సిటీ మీద ఉన్న శ్రద్ధ వ్యవసాయం, ఫ్యూచర్ గ్రామాలపై ఎందుకు పెట్టడం లేదు? సాగు భూములను, వ్యవసాయానికి యోగ్యమైన భూములను రైతుల వద్ద నుంచి సేకరించి పరిశ్రమలు, సిటీలు, పారిశ్రామిక వాడలు, జోన్‌లు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ఆహారధాన్యాల కొరత ఏర్పడుతుంది. పర్యావరణ సమతౌల్యం క్షీణిస్తుంది. హైదరాబాద్‌ను రానున్న ఐదు సంవత్సరాల్లో ప్రపంచంలోనే ప్రథమ నగర ర్యాంక్‌కు తీసుకుపోవచ్చు కానీ, అంతకుమించి కాలుష్యం విజృంభిస్తే ప్రజలు ఎలా బతుకుతారు? హైదరాబాద్‌లో ఇప్పటికే ట్రాఫిక్ సమస్య వర్షాలు పడితే రోడ్లు జలమయం కావడం, తాగునీరు కలుషితం కావడం వంటి సమస్యలను ప్రజలు అనుభవిస్తున్నారు. దీనికి తోడుగా హైదరాబాద్ చుట్టూ పరిశ్రమలను, ఔటర్ రింగ్ రోడ్లను, రీజినల్ రింగ్ రోడ్లను.. నిర్మించి అక్కడి ప్రజలను కాలుష్య వలయంలో ప్రభుత్వాలు బంధిస్తున్నాయి. ఇది పేరుకు అధిభౌతికమైన అభివృద్ధే అయినా, ఆరోగ్యవంతమైన అభివృద్ధి కాదు. నిజాం ప్రభుత్వ పాలనకు ముందు 600కు పైగా చెరువులు, కుంటలు కలిసి జలవనరులు ఉండేవి. ప్రస్తుతం అవి అన్నీ కబ్జాకు గురై, భవనాలకు నిలమైనాయి.

దేశ రాజధాని ఢిల్లీని గత కొద్ది సంవత్సరాల నుంచి కాలుష్య సమస్య వేధిస్తోంది. భవిష్యత్‌లో అక్కడ ఆక్సిజన్ సిలిండర్లను పెట్టుకొని బతికే రోజులు వస్తాయని డాక్టర్లు, పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు అవసరమే, కానీ ఒకే ప్రాంతంలో పారిశ్రామిక కేంద్రీకరణ జరగకూడదు. మారుమూల మండలాలకు, జిల్లాలకు సైతం పరిశ్రమలు వెళ్లాలి. అప్పుడు వలసలు తగ్గుతాయి. ఏటా లక్షలాది ఎకరాల భూమి రైతుల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల చేతుల్లోకి మారుతోంది. ఇక ముందు కూడా ఇలాగే కొనసాగితే నిత్యావసర పదార్థాలు, కాయగూరలకు విదేశాలపై ఆధారపడాల్సి వస్తుంది.

– లింగబత్తిని మల్లేశ్
రీసెర్చ్ స్కాలర్, కాకతీయ యూనివర్శిటీ

దామెర్ల రామారావు సృజించిన తెలుగుశోభ

రాజమహేంద్రవరం పేరు తలచుకుంటే తెలుగు వారి మనస్సు ఆనందంతో పులకించిపోతుంది. వేదంలా ప్రవహించే గోదావరి, రాజరాజనరేంద్రుడు, నన్నయ్య, కందుకూరి, చిలకమర్తి, శ్రీపాద, మధునాపంతుల మొదలైన మహోదయుల మహోజ్వల వారసత్వం, సాంస్కృతిక వైభవం, చారిత్రక నేపథ్యంలో అంతర్జాతీయ యశస్సు నార్జించిన దామెర్ల రామారావు చిత్రకళా వైభవం మన మనస్సుల్లో తటిల్లమంటుంది.

ఆధునిక సంప్రదాయ చిత్రకళా రీతుల్ని సమన్వయించి, పాశ్చాత్య కళారీతుల్ని శోధించి ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన మహాకళాకారుడు దామెర్ల రామారావు. దేవతల సృష్టికర్త, ఆధునిక భారతీయ చిత్రకళా బ్రహ్మగా కీర్తి పొందిన రాజా రవివర్మ మోడల్‌ను ఎదురుగా పెట్టుకుని చిత్రాలు రచించినట్టే మన దామెర్ల స్త్రీని మోడల్‌గా పెట్టి నగ్నచిత్రాల్ని తొలిసారి సృజించిన ధీశాలి. రూప చిత్రాలనే కాదు, ప్రకృతి దృశ్యాలకు, పౌరాణిక కథలకు, సామాజిక జీవనానికి అందమైన ప్రతిరూపాలను ఆయన సృజించారు.

రామారావు తండ్రి ఆయుర్వేద వైద్యులు వెంకటరమణారావు, తల్లి లక్ష్మీదేవి గృహిణి. ఆ దంపతుల తొమ్మిది మంది సంతానంలో రామారావు రెండవవారు. మేనమామ గాడిచర్ల సత్యనారాయణ చిత్రకళోపాధ్యాయుడు. పసిప్రాయం నుండి రామారావును ఆయన ప్రోత్సహిస్తుండేవారు. ఆంధ్రావనిలో ప్రముఖ నాటక కళాకేంద్రంగా రాజమహేంద్రవరం వర్ధిల్లుతున్న కాలమది. హిందూ నాటక సమాజం నాటకాలకు అవసరమైన తెరలు రూపొందించేందుకు బెంగుళూరు నుండి ఎ.ఎస్.రాం అనే చిత్రకారుడ్ని తీసుకొచ్చారు. రాజమండ్రిలోని ఔత్సాహిక చిత్రకారులకు ఈ దృశ్యాత్మక తెరల రూపకల్పన కళ స్ఫూర్తి కలిగించింది. దామెర్ల కూడా చదువు సంధ్యలు మాని ఆ కళని నిశితంగా పరిశీలించేవాడు.

ఆ రోజుల్లోనే ఆంగ్లేయుడు ఆస్వాల్డ్ జెన్నింగ్ కూల్డ్రే రాజమండ్రి ప్రభుత్వ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఆయన గాయకుడు, నటుడు, రచయిత, చిత్రకారుడు కూడా. ఆ కళాశాలలో చదువుతున్న దామెర్ల సోదరుడు వెంకటరావు, తన తమ్ముడు రామారావును కూల్డ్రేకు పరిచయం చేశాడు. రామారావు చిత్రించిన చిత్రాలు చూసి ఆ కళాభిజ్ఞుడు ముగ్ధుడయ్యాడు. అర్జునుడికి ద్రోణుని వలె రామారావుకు కూల్డ్రే లభించాడు. రామారావుతో పాటు వరదా వెంకటరత్నం, కవికొండల వెంకటరావు, అడవి బాపిరాజు, అంకాల వెంకట సుబ్బారావులకు కూల్డ్రే చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చేవారు.

ఒకసారి కూల్డ్రే రామారావును వెంటబెట్టుకుని అజంతా, ఎల్లోరా గుహలకు వెళ్లారు. వర్షం వల్ల స్టేషన్‌లో సామాను ఉంచి, స్కెచ్ పుస్తకాలతో గుహలకు వెళ్లారు. చిన్న వయసులో ఉన్న రామారావు, కూల్డ్రేతో నడవలేకపోయారు. కూల్డ్రే ఆప్యాయంగా రామారావును తన భుజాలపై ఎత్తుకొని అజంతా గుహలను చూపించారు. బ్రిటిష్ దొరతనం వ్యక్తి, ప్రభుత్వోద్యోగి అయినప్పటికీ కూల్డ్రే ఎలాంటి భేషజం చూపించకపోవడం అసామాన్య విషయం. ఈ గురుశిష్యుల గాఢమైత్రికి, అనురాగానికి ప్రతీక వారి అజంతా సందర్శన. ఈ ఇరువురి అనుబంధం చరిత్రలో అరుదైన సంఘటన.

రామారావులోని విద్యా నిష్ఠ, చిత్రకళా కృషిని మరింతగా ప్రోత్సహించేందుకై కూల్డ్రే మహాశయుడు అతని కుటుంబ సభ్యుల్ని ఒప్పించి 1916 జూలైలో ముంబైలోని సుప్రసిద్ధ సర్ జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు పంపారు. కళాశాల డీన్ సిసిల్ బర్న్స్‌కు ఒక లేఖ రాశారు. కూల్డ్రే లేఖతో పాటు తన వెంట తీసుకెళ్లిన చిత్రాలను రామారావు బర్న్స్‌కు చూపించాడు. ఆ చిత్రాలను చూసిన డీన్ రామారావుకు సరాసరి 3వ సంవత్సరంలో ప్రవేశం కల్పించారు. నేరుగా మూడవ సంవత్సరంలో ప్రవేశం కల్పించడం అసాధారణ విషయం.

ఆధునిక, సంప్రదాయ చిత్రకళా రీతుల్ని సమన్వయించి, పాశ్చాత్య కళారీతుల్ని శోధించి ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన మహాకళాకారుడు దామెర్ల రామారావు. రాజమండ్రి పరిసరప్రాంత ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కళ్లకు కట్టినట్లు ఆయన తన చిత్రాలలో చూపించారు. ఆ చిత్రాలలో మానవ రూపాలు లయబద్ధంగా, సహజ సుందరంగా ఉంటాయి. తెలుగువారి ఔన్నత్యమైన రామారావు చిత్రాలను జాతీయ సంపదగా ప్రభుత్వం ప్రకటించాలి.

తదనంతర కాలంలో ప్రముఖ చిత్రకారుడు అయిన పద్మశ్రీ రవిశంకర్ రావెల్‌తో ఆ కళాశాలలో రామారావుకు పరిచయమేర్పడింది. సెలవు దినాల్లో రామారావు నాసిక్, లొనావాలా, కళ్యాణ్, కర్జా తదితర ప్రాంతాలకు వెళ్ళి స్కెచ్‌లు చిత్రించేవారు. తర్వాత మరో మిత్రుడు బదెకాతో కలిసి గుజరాత్‌లో రామారావు పర్యటించారు. కథియవాడ్‌లో గొల్ల పడుచులు, గిర్నాడ్ అడవుల సుందర దృశ్యాల్ని నీటి రంగుల్లో చిత్రించాడు గుజరాత్ పర్యటనలో ఆయన చిత్రించిన 'కుంజవనం' లండన్‌లో ప్రదర్శింపబడి, ఘనమైన ప్రశంసల నందుకున్నది.

ఆ రోజుల్లోనే విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్ గుజరాత్‌లోని దక్షిణామూర్తి విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తుండగా, రామారావు సాధారణ తెల్ల కాగితంపై రవీంద్రుని రూపచిత్రం పెన్సిల్ స్కెచ్ గీసి చూపించి, ఆయన ఆశీస్సులు పొందాడు. గురుదేవ్ ఆహ్వానం మేరకు రామారావు శాంతినికేతన్ సందర్శించాడు.

1919 జూన్‌లో రామారావుకు సత్యవాణితో వివాహమయింది. అప్పటికి ఆమె వయస్సు 12 సంవత్సరాలే. భార్యను నమూనాగా తీసుకొని రామారావు 'పెళ్ళికూతురు', 'సీమంతం' తదితర చిత్రాల్ని చిత్రించాడు. తర్వాత సంవత్సరం జరిగిన తుది పరీక్షల్లో రామారావు కళాశాలలో సర్వ ప్రథముడిగా ఉత్తీర్ణుడయ్యాడు.

తర్వాత దేశమంతటా పర్యటించి, వివిధ ప్రాంతాలలోని చిత్రకళా రీతులను అధ్యయనం చేశాడు. వెళ్లిన ప్రతిచోట తన చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశాడు. కలకత్తాకు చెందిన ఓరియంటల్ సొసైటీ నిర్వహిస్తున్న కళాప్రదర్శనకు తన 'ఋష్య శృంగబంధనం', 'తూర్పు కనుముల్లో గోదావరి' చిత్రాలు ఇచ్చారు. 'ఋష్యశృంగ బంధనం'కు వైస్రాయ్ నగదు బహుమతి లభించింది. ప్రదర్శనకు స్వయంగా వచ్చిన వైస్రాయ్ లార్డ్ రీడింగ్ రామారావు చిత్రాల్ని ఆసక్తితో చూసి 'గోదావరి' చిత్రాన్ని కొనుగోలు చేశాడు.



1922లో దేశం అంతా పర్యటించి వచ్చిన రామారావు రాజమండ్రిలో స్థిరపడ్డారు. మిత్రులు వరదా వెంకటరత్నం, భగీరధి, చేమకూర, బుచ్చి కృష్ణమ్మ తదితరులతో కలసి 'ఆంధ్ర సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్'ను స్థాపించారు. ఈ కాలంలోనే రామారావు 'సిద్ధార్థ రాగోదయం' చిత్రించారు. ఆయన చిత్రించిన 'భారతి' దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన మాసపత్రిక 'భారతి'కి ముఖచిత్రమయింది.

తను స్థాపించిన 'ఇండియన్ ఆర్ట్' సంస్థ ద్వారా రామారావు 1923, 1924 సంవత్సరాలలో రాజమండ్రిలో జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించారు. ఆ కాలంలోనే ఆయన 'కృష్ణలీలలు', 'అజంతా విహార్', 'కపోతాలు' చిత్రించాడు. కృష్ణలీలలు ఢిల్లీలో ప్రదర్శింపబడి, అక్కడ నుండి లండన్‌కు చెందిన ఇంపీరియల్ గేలరీ ఆఫ్ ఆర్ట్స్‌లో కూడా ప్రదర్శితమైంది. భారతదేశం ఎన్నుకున్న పన్నెండు చిత్రాల్లో ఇది ఒకటి. ఈ చిత్రం గురించి 'ది బ్రిటీష్ ఎంపైర్ రివ్యూ' ప్రత్యేకంగా ప్రశంసించింది.

పాశ్చాత్య శైలికి, భారతీయ సంప్రదాయాన్ని జోడించి కొత్త శైలిని రామారావు సృష్టించారు. ఆయన తన చిత్రాల్లో రాజమండ్రి పరిసరప్రాంత ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కళ్లకు కట్టినట్లు చూపించారు. దేశీయ పద్ధతిలో ప్రాథమిక రంగుల్ని చదునుగా, సుకుమారంగా వేసేవాడు. ఆయన చిత్రాల్లో మానవ రూపాలు లయబద్ధంగా, సహజ సుందరంగా ఉంటాయి. ఆయన నీటి, నూనె రంగులు, పేస్టిల్స్‌ను కూడా చిత్రీకరణకు వాడేవారు.

రామారావు జీవించింది కేవలం 28 సంవత్సరాలు మాత్రమే. ఈ స్వల్ప కాలంలో ఆయన చిత్రించిన కళాఖండాలు ఎన్నో. వీటిలో కొన్ని అమ్మగా, మరికొన్ని బహుమతులకు ఇవ్వగా, మరికొన్ని మాయంకాగా 34 నూనె, 129 నీటి రంగుల చిత్రాలు, 250 పెన్సిల్ స్కెచ్‌లు, 28 స్కెచ్ పుస్తకాలు మిగిలాయి. ఇవన్నీ ప్రస్తుతం రాజమండ్రిలోని గోదావరి రైల్వేస్టేషన్ వద్ద గల దామెర్ల రామారావు స్మారక ప్రభుత్వ చిత్రకళా మందిరంలో ఉన్నాయి. 1954లో ఈ మందిరాన్ని వరదా వెంకటరత్నం నేతృత్వంలో దామెర్ల అభిమానులు నిర్మించారు. తెలుగు వారి తొలి చిత్రకళా మందిరం కూడా ఇదే. ప్రముఖ చిత్రకళాభిమాని కల్యాణవతారం లలితకళా అకాడమీ సహకారంతో గ్యాలరీలోని చిత్రాలన్నిటినీ ఒక సి.డి.గా రూపొందించారు. ప్రఖ్యాత దర్శకులు సంజీవరెడ్డి పాతికేళ్ల క్రితం 'రిథమ్ ఆఫ్ లైఫ్' లఘు చిత్రాన్ని నిర్మించగా అది ఉత్తమ డాక్యుమెంటరీ పురస్కారం పొందింది. నీటి రంగుల్లో వందేళ్ల క్రితం రామారావు చిత్రించిన చిత్రాలు ఇంకా అలాగే ఉండాలనుకోవడం అత్యాశ అవుతుంది. వాటిని పరిరక్షించడానికి అవసరమైన కృషి కళాకారులు, కళాభిమానులు, ప్రభుత్వం కలిసికట్టుగా చేయాలి. ఆయన మరణించి వందేళ్ళు అవుతున్నా ఆయన చిత్రాల్ని గురించి మాట్లాడుకుంటున్నామంటేనే వాటి గొప్పతనం అర్థం అవుతుంది.

1925లో సతీమణి సత్యవాణితో కలిసి తిరుపతి వెళ్లి, ఆలయం, పరిసరాలకు సంబంధించిన అందాల్ని తన స్కెచ్ పుస్తకంలో ప్రతిరూపించారు. తిరుగు ప్రయాణంలో అనారోగ్యానికి గురై, మశూచి కారణంగా కన్నుమూశారు. తెలుగువారి ఔన్నత్యమైన రామారావు చిత్రాలను జాతీయ సంపదగా ప్రభుత్వం ప్రకటించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

■ **సుంకర చలపతిరావు**
(నేడు దామెర్ల రామారావు శత వర్ధంతి)

పెద్దాస్పత్రిలో ఇష్టారాజ్యం

- ఆ అధికారి కనుసన్నల్లోనే ఎంజీఎం పరిపాలన
- ఉద్యోగుల ఐటీలో భారీ వసూళ్లకు తెర
- ఉన్నతాధికారులకు సైతం కొరకరాని కొయ్య
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, ఉద్యోగులు



7



గద్దెల విస్తరణ లేనట్టేనా?

7

- 32 గుంటల స్థలంలోనే మేడారం గద్దెల సాలారం
- తల్లులను దర్శించుకునేందుకు ప్రతీ జాతరలో భక్తులకు ఇబ్బందులు
- 4 ఎకరాల్లో విస్తరించాలన్న ప్రతిపాదన అటకెక్కిన వైనం
- 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ జాప్యం
- ప్రపంచం అబ్బుర పడేలా జాతర నిర్వహిస్తామని దాటవేసిన గత ప్రభుత్వం
- ప్రశాంత దర్శనం కోసం కాంగ్రెస్ సర్కారైనా దృష్టి పెట్టాలని భక్తుల విజ్ఞప్తి

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర.. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందింది. రెండేళ్లకోసారి ఫిబ్రవరిలో జరిగే ఈ వనదేవతల మహా సంరంభానికి కోటిన్నరకు పైగా భక్తులు తరలొస్తారు. అంతేకాదు కొన్నేళ్లుగా మామూలు రోజుల్లోనూ దర్శనానికి వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా మహాజాతర జరిగే ఆ నాలుగు రోజుల్లో సుదూర ప్రాంతాల నుంచి తరలొచ్చే కోట్లాది భక్తులు తల్లులను తనివితీరా దర్శించుకోలేని పరిస్థితి ఉంది. అందుకు కేవలం 32 గుంటల స్థలంలో నిర్మించిన సమ్మక్క-సారలమ్మల గద్దెల ప్రాంగణం (సాలారం) ఇరుకుగా ఉండడమే కారణం. ఈ క్రమంలో ఈ ప్రాంగణానికి పక్కనే ఉన్న దేవాదాయ శాఖకు చెందిన నాలుగెకరాల్లో విస్తరించాలనే ప్రతిపాదన 2012 నుంచే ఉన్నా.. అది కార్యరూపం దాల్చలేదు. ఇక పక్కనే ఉన్న 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించడంపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా ఓ కారణమేనన్న అభిప్రాయాలున్నాయి. కనీసం వచ్చే ఏడాది జరగబోయే మహాజాతర నాటికైనా ఇది కార్యరూపం దాల్చాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

'సిలిండర్ల'తో చెలగాటం



- గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల అక్రమ వాడకం
- హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిరు వ్యాపారుల్లో వినియోగం
- వాణిజ్య సిలిండర్లనే వాడాలని నిబంధనలు
- ఆ మేరకు ప్రమాణాలతో విభజిస్తూ తయారీ
- ఇష్టారీతిన వాడుతున్న వ్యాపారులు
- డబ్బులకు ఆశపడి అప్పజెపుతున్న లబ్ధిదారులు
- సివిల్ సప్లయిస్ అధికారుల తనిఖీలు కరువు
- పేలితే ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా వ్యాపార రంగానికి వినియోగమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధమైనా యథేచ్ఛగా ఈ దందా సాగుతోంది. గృహ వినియోగ సిలిండర్ల లబ్ధిదారులు డబ్బులకు ఆశపడి హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఇతర చిరు వ్యాపారులకు తరలిస్తున్నారు. అరికట్టాల్సిన సివిల్ సప్లయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం తనిఖీలు కూడా చేపట్టడం లేదు. ఈ అక్రమ దందా ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చేదిలా పరిణవింంచినా.. సివిల్ సప్లయి అధికారులు మామూళ్లకు ఆశపడి కిమ్మనడం లేదు. ఫలితంగా వరంగల్ నగరంలో ఎప్పుడు అగ్ని ప్రమాదం రూపంలో ఏ విపత్తు సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో ఎంతో బాధ్యతాయుతంగా ఉండాల్సిన వ్యాపారులు, సివిల్ సప్లయి అధికారులతో పాటు డొమెస్టిక్ సిలిండర్ లబ్ధిదారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారు.

హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో..

నగరంలోని స్టార్ హోటళ్లతో పాటు కింది స్థాయి నుంచి గల్లీలో ఉండే హోటళ్లలో కూడా డొమెస్టిక్ సిలిండర్లను అక్రమంగా వాడుతున్నారు. హోటళ్లతో పాటు టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర తిను బండారాల వ్యాపారులు అత్యధికం అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లనే వినియోగిస్తున్నారు. వాస్తవానికి వ్యాపార సంస్థలు కమర్షియల్ సిలిండర్లను వాడాల్సి ఉంది. కమర్షియల్ సిలిండర్లు నీలిరంగులో ఉంటాయి. వీటి బరువు 19 కిలోలు. ఇక గృహ వినియోగ సిలిండర్లు రెడ్ ఎరుపు రంగుతో ఉండి 14.2 కిలోల బరువుతో ఉంటాయి. ఇలా ఏ విభాగంలో విభజించిన సిలిండర్లు ఆ రంగానికే వాడాల్సి ఉంది. ఈ నిబంధన అతిక్రమిస్తే సిలిండర్లు పేలి అగ్ని ప్రమాదం సంభవిస్తాయి. ఫలితంగా ఆస్తి నష్టమే కాదు ప్రజల ప్రాణాలకే ముప్పు కలుగుతుంది.

పెను ప్రమాదమే..

డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్‌కు వాడడం అత్యంత ప్రమాదకరం. ఈ వినియోగం పేలుడుకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. గ్యాస్ కంపెనీలు ఆయా నిబంధనలు, సురక్షిత ప్రమాణాల మేరకే డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ల వినియోగాన్ని నిర్ధారిస్తున్నాయి. ఈ నిబంధనలు అతిక్రవిస్తే పేలుడు సంభవిస్తాయని స్పష్టం చేస్తున్నాయి.

మామూళ్ల మత్తులో..

వరంగల్ నగరంలో హోటళ్లు, టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్లు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిలో 90 శాతం డొమెస్టిక్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. ఈ వ్యవహారం బహిరంగానే మారింది. అయినప్పటికీ సివిల్ సప్లయి అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం తనిఖీలు కూడా చేయడం లేదు. దీనికి కారణం మామూళ్లు దండుకోవడమే. కొందరు డీటీల నుంచి ఉన్నతాధికారుల వరకు మామూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యాపార రంగాలకు వినియోగిం చే కమర్షియల్ సిలిండర్లకు వాటి రెగ్యులేటర్, పైప్ ఇతర సురక్షిత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ఆ మేరకు స్టౌవ్‌లు పెద్దవిగా రూపకల్పన జరుగుతాయి. అయితే హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఇతర చిరు వ్యాపారాల్లోని పెద్ద స్టౌవ్‌లకు డొమెస్టిక్ సిలిండర్లను బిగించి వాడకం ప్రమాదమే అంటున్నారు నిపుణులు. ఈ తరుణంలో అవి ఎప్పుడైనా పేలవచ్చంటున్నారు. కమర్షియల్ సిలిండర్లకు వాడే రెగ్యులేటర్ డొమెస్టిక్ సిలిండర్లకు కచ్చితంగా సరిపడదు. మరోవైపు కొందరు వ్యాపారులు డొమెస్టిక్ సిలిండర్‌లోని గ్యాస్‌ను వారి వారి పద్ధతుల్లో పైపుల ద్వారా కమర్షియల్ సిలిండర్లకు పంపింగ్ చేస్తున్నారు. ఈ రెండు పద్ధతులు అత్యంత ప్రమాదమే. ఏ క్షణంలో అయినా పేలడానికి ఆస్కారం ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఇలాంటి సంఘటనలు తరుచూ జరుగుతున్నాయంటున్నారు. ఫలితంగా ఆస్తి నష్టమే కాదు.. పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందంటున్నారు. హోటల్ లేదా టిఫిన్ సెంటర్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఇతర వ్యాపార సంస్థలో పేలుడు జరిగితే సమీప ప్రాంతాలకు కూడా ప్రమాదమే అంటున్నారు.

డబ్బులకు ఆశపడుతున్న లబ్ధిదారులు

ఇక డొమెస్టిక్ వినియోగ లబ్ధిదారులు కూడా డబ్బులకు ఆశపడి సిలిండర్లను హోటళ్లు, ఇతర తినుబండారాల వ్యాపారాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతానికి కమర్షియల్ సిలిండర్ ధర రూ.1990 ఉండగా, డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.874 ఉంది. మార్కెట్లో ఎప్పటికప్పుడు ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. డొమెస్టిక్ సిలిండర్ లబ్ధిదారులు ఒక సిలిండర్ ఇస్తే రూ.400 నుంచి 500 వరకు వ్యాపారుల నుంచి పొందుతున్నారు. ఇలా యేడాదిలో ఆరు సిలిండర్లు అయినా ఇచ్చే అవకాశం ఉండడంతో రూ.3వేల వరకు దక్కుతున్నాయనే ఆశతో డొమెస్టిక్ సిలిండర్లను తరలిస్తున్నారు. ఇక వేరు వేరు కుటుంబాల పేరుతో అధిక కనెక్షన్లను కూడా తీసుకొని సిలిండర్లను హోటళ్లకు తరలిస్తున్నారు. ఇందులో గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసే వారిలో కొందరి ప్రమేయం కూడా ఉంది. ఈ కోణంలో అటు వ్యాపారులు, ఇటు డొమెస్టిక్ లబ్ధిదారులు, కొన్ని గ్యాస్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లకు కూడా లాభసాటిగా పరిణమించింది. ఎవరికి వారు ధనం ఆశతో వ్యవహరిస్తున్నారనే తప్ప ప్రజల ప్రాణాలకే ముప్పు అనే సంగతిని విస్మరిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులకు పరిహారం అందించాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పరకాల డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల మీదుగా వెళ్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే భూములకు సంబంధించిన పలువురు రైతులకు పరిహారం ఇచ్చామని, రాని రైతుల నుంచి డాక్యుమెంట్లు సేకరించి పరిహారం త్వరగా ఇచ్చేవిధంగా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. హ నుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం పరకాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం సంబంధిత భూముల రైతులకు పరిహారం చెల్లింపు అంశంపై నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులతో సమా వేశం నిర్వహించారు. పరకాల ని యోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, దామెర, ఆత్మకూరు, పరకాల, శాయంపేట మండలాల్లోని సంబంధిత రైతుల్లో ఎంతమందికి పరిహారం చెల్లించాలనే వివరాలతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను తహసీల్దార్లు ఈసందర్భంగా కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములు ఇచ్చిన రైతులలో పరిహారం అందని రైతుల నుంచి డాక్యుమెంట్స్ సేకరించి పరిహారం అందించి త్వరగా భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రైతులతో సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలి

జిల్లాలో ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ(నట్టల నివారణ) కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్యశాఖతో పాటు సంబంధిత శాఖలన్ని సమష్టిగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నులిపురుగుల దినోత్సవంపై బుధవారం జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ 100శాతం పూర్తి చేయాలని, 1 - 19 ఏళ్లలోపు వయసు పిల్లలు 2,36,488 మంది ఉన్నారని, వీరందరికి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో భోజనం అనంతరం మాత్రలు పంపిణీ చేయాలన్నారు. నులి పురుగుల వలన పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి జరగకపోవడం, నీరసంగా ఉండటం, రక్తహీనతతో చదువుపై శ్రద్ధచూపలేరన్నారు. ఒకవేళ 10వ తేదీన ఏదైనా కారణాలతో వేయలేకపోయిన పిల్లలకు 17వ తేదీన అల్బెండజోల్ మాత్రలు ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, జడ్పీసీఈఓ విద్యాలత, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాంరెడ్డి, డీపీఓ లక్ష్మీరమాకాంత్, మెప్మా డీఎంసీ రజితారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలి

- 10న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి
- అధికారుల సమీక్షలో వరంగల్ కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. ఈ నెల 10వ తేదీన జాతీయ పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో ఆమె జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యశారద మాట్లాడుతూ.. 1-19 ఏళ్ల లోపు వయసువారందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆ రోజు వేయని వారికి ఈ నెల 17న వేయాలని ఆదేశించారు. ఈ మాత్రలు వేయడం వల్ల పిల్లల్లో నులి పురుగుల సమస్య, రక్తహీనత, బుద్ధి మాంద్యం సమస్య నుంచి ఉపశమనం కలిగి పిల్లల్లో చదువుపట్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం చేయడం కోసం గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. అన్ని మండలాల్లో ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా సభ్యులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, జడ్పీ సీఈవో జి.రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టర్‌లో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీఎంశ్రీ పథకం కింద పాఠశాలల అభివృద్ధి నిమిత్తం రూ.1 కోటి 38 లక్షల వ్యయంతో మంజూరైన 14 పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అదే విధంగా సర్వశిక్ష అభియాన్ పథకం కింద రూ.3 కోట్ల వ్యయంతో 12 ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ లాబరేటరీల ఏర్పాటుకు కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, సెక్టోరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ జాతరకు అంకురార్పణ

- మేడారంలో ఘనంగా గుడిశుద్ధి పండుగ
- తల్లుల దర్శనానికి 40వేల మందికి పైగా భక్తుల రాక
- సందడిగా మారిన సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం



మేడారంలో గుడి శుద్ధి పండుగలో పూజారులు

7

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- బీసీ కుల గణనకు చట్టబద్ధత, ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందనేది మరోమారు స్పష్టమైందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీ కుల గణనకు చట్టబద్ధత, ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై జిల్లా కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరిపారు. బుధవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణన జరపాలని ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పట్టుబట్టారన్నారు. అదే విధంగా అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ తొలుత రాష్ట్రంలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన సంగతిని గుర్తు చేశారు. ఈ క్రమంలో ఈ రెండు ముఖ్య ఘట్టాలను ఆచరణలోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించి కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్ అనవసర విమర్శలు చేస్తూ బీసీల సంఖ్య తగ్గిందంటూ తప్పుడు ప్రచారం చేయడం అనైతికమన్నారు. అధికారంలో ఉండగా ఏం చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, టీపీసీసీ నాయకులు ఈవీ శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణతో పాటు పల్లంకొండ సతీశ్, బంక సరళా, బంక సంపత్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న పోలీసు అధికారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూజ

మామునూరు పీటీసీకి రెండు బహుమతులు

మామునూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ (మామునూరు)పీటీసీకి చెందిన పోలీస్ అధికారులు రెండు బహుమతులను గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ పూజ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఆర్మీ రెజ్లింగ్ పోటీలో కాశీ రామ్(ఆర్ఐ) ద్వితీయ బహుమతి, యోగాలో ఎం.దేవేందర్(హెచ్‌సీ) ద్వితీయ బహుమతి అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించి భవిష్యత్తులో మరిన్ని బహుమతులు అందుకోవాలని సూచించారు.

కుంభమేళాకు వరంగల్ మీదుగా ప్రత్యేక రైళ్లు

గిర్మాజీపేట, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8, 10, 16, 18 తేదీలలో మచిలీపట్నం - దానాపూర్ మధ్య వరంగల్ మీదుగా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రత్యేక కుంభమేళా రైళ్లు 3వ ఏసీ క్లాస్ కోచ్‌లతో నడుస్తాయని, మచిలీపట్నం- దానాపూర్ (07113) ప్రత్యేక రైలు 8, 16వ తేదీలలో ఉదయం 11 గంటలకు మచిలీపట్నంలో బయలుదేరి వరంగల్ మీదుగా మరుసటి రోజు అర్ధరాత్రి 12గంటలకు దానాపూర్ చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా దానాపూర్-మచిలీపట్నం(07114) ప్రత్యేక రైలు 10, 18 తేదీలలో మధ్యాహ్నం 3.15 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి వరంగల్ మీదుగా తరువాతి రెండో రోజు తెల్లవారుజామున 3 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు తెలంగాణకు సంబంధించి ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిరిపూర్‌కాగజ్‌నగర్, స్టేషన్‌లలో ఆగుతాయని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీధర్ కోరారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



మొగిలి (ఫైల్)

పరకాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హనుమకొండ జిల్లా పరకాల మండలంలో చోటు చేసుకుంది. పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని పైడిపల్లి గ్రామానికి చెందిన పసుల మొగిలి (50)కి గ్రామ శివారులో ఎక రం 20 గుంటల భూమి ఉంది. రూ. 2 లక్షలు అప్పు చేసి మిర్చి పంట సాగుకోసం పెట్టుబడి పెట్టాడు. మిర్చి పంట ఏపుగా పెరగక పోవడంతోపాటు పూత, కాత రాలే దు. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో మనస్థాపానికి గురైన మొగిలి ఈ నెల 1న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యు లు, బంధువులు పలు ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఎక్కడా ఆచూకీ లభించలే దు. బుధవారం వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందుతాగి మృతి చెందగా చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య దేవమ్మ పరకాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి



సదానందం (ఫైల్)

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ముస్త్యాలపల్లికి చెందిన సిద్దోజు సదానందం (55) బైక్‌పై కాశిబుగ్గకు వెళుతుండగా గొర్రెకుంట నుంచి కొత్తపేట వైపు వెళుతున్న లారీ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో సదానందం తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. భార్య సిద్దోజు రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీ విద్యార్థులు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూ సెనెట్ హాల్‌లో ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులతో టీహబ్ ప్రతినిధులు ఇంట్రాక్టు సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కేయూ రూసా నోడల్ అధికారి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగాలతో పాటు ఉద్యోగ కల్పన ముఖ్యమన్నారు. వర్సిటీ విద్యార్థులు నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. టీహబ్ విద్యార్థులతో నైపుణ్యాలను పెంచేందుకు కృషిచేస్తోందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠాలతోపాటు మార్కెట్, ఇండస్ట్రీ పోకడల ను గమనించి జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమం టీహబ్ ప్రతినిధులు త్రివిక్రమ్, సాయి అభినయ్, స్వరూపలు పాయింట్ పాయింట్ ద్వారా వివిధ అంశాలు నైపుణ్యాభివృద్ధిలో నూతన ఆవిష్కరణలను వివరించారు. అంకుర సంస్థల స్థాపనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరటి ప్రసాద్, డాక్టర్ కె.భిక్షాలు, డాక్టర్ ఎస్.రమణతో పాటు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



టీహబ్ సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి పక్కన రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం తదితరులు

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా సెలబస్‌లో మార్పులు

నూతన జాతీయ విద్యా విధానాలకు అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థుల సిలబస్‌లో మార్పులు చేస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ కరీంనగర్ ఎక్స్టన్షన్ సెంటర్ సంయుక్తంగా స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు 6వారాల శిక్షణ ప్రారంభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమణ అధ్యక్షత జరిగిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 18 వరకు 'ఎంటపెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ ఇన్ డేటా స్టాటిసిక్స్ అండ్ అనాలిటిక్స్ (పైథాన్) అండ్ ఆటోకాడ్ అనే అంశంపై సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సిలబస్ లో మార్పులు తీసుకువస్తామన్నారు. ప్రాక్టికల్, ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్‌లు భాగం కానున్నట్లు వెల్లడించారు. ఆలోచనలు, నవీకరణతో స్టార్టప్‌ల దిశగా ఆలోచించాలని అన్నారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించే నూతన ఆవిష్కరణలు చేస్తారని చెప్పారు. పాఠాలను ప్రాక్టికల్‌గా మార్చుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు. స్కిల్స్ పెంచుకోవాలని ఉద్బోధించారు. సీఐటీడీ డైరెక్టర్ ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాక్టికల్ నాలెజ్డ్ ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ.. శిక్షణకు 100 మంది ఇంజనీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరికి ఉదయం, మధ్యాహ్నం పైథాన్, ఆటో క్యాడ్‌లపై శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.మహేందర్, అధ్యాపకులు సీఐటీడీ అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి

విధులు బహిష్కరించి నిరసన తెలిపిన న్యాయవాదులు



హనుమకొండలో కోర్టు గేటు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అకారణంగా న్యాయవాది శివపై దాడి చేసిన హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిని, బాధ్యులైన పోలీసు సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యాయవాది గంధం శివపై పోలీసుల దాడిని ఖండిస్తూ వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం న్యాయవాదులంతా పెద్ద సంఖ్యలో కోర్టు ఎదుట బైఠాయించి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. దాడి చేసిన పోలీసులపై ఫిర్యాదు చేసి 72 గంటలైనా చట్టపరంగా చర్య తీసుకోక పోవడం, కేసు రిజిస్టర్ చేయకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహా స్యం చేసినట్లేనని వారు పేర్కొన్నారు. పోలీసులు ప్రజా స్వామిక హక్కులు కాలరాస్తున్నారని, అదే విధంగా పేదలు, ఆపదలో ఉన్న వారి కోసం పనిచేస్తున్న న్యాయ వాదుల పట్ల పోలీసులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గర్హనీయమని న్యాయవాదులు పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా లబార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. న్యాయవాదిపై జరిగిన దాడిపై తమ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. సంబంధిత పోలీసులను సస్పెండ్ చేసేంత వరకు ఉద్యమం ఆగదని తీర్మానించారు. దానిలో భాగంగా గురువారం కూడా తమ విధులు బహిష్కరించి పెద్దఎత్తున నిరసనలు తెలపాలని తీర్మానించినట్లు బార్ అసోసియేషన్ల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు ముదసిర్ అహ్మద్, లాడె రమేష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్ధన్, బైరపాక జయాకర్, ఎం.సహోదర్‌రెడ్డి, కె.అంబరీష్‌రావు, పులి సత్యనారాయణ, గుడిమళ్ల రవికుమార్, అల్లం నాగరాజు, విజేందర్, సాంబశివరాజు, ఆర్.నర్సింగరావు, పాము రమేష్, ఇతర కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లి గ్రామశివారులోని ప్రధాన రహదారి పక్కన గల పాడుబడిన వ్యవసాయ బావిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఏనుమాముల సీఐ రాఘవేందర్ తెలిపారు. అతడు చనిపోయి సుమారు 15 రోజులు అవుతోందని, ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని, ఒంటిపై నల్ల రంగు ప్యాంటు, పసుపు రంగు అడ్డగీతల టీషర్టు ఉన్నాయని, సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉంటుందని, ఎవరైనా గుర్తుపడితే 8812685120, 8712685288 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాఘవేందర్, ఎస్ఐ రాజు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిలుపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన 100 మంది విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకుని సంతోషంలో మునిగితేలారు. అప్పటి హెచ్‌ఎంతోపాటు, ఉపాధ్యాయులను వేదికపై శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోత్తమ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హరిశంకర్, మోహన్, సుధాకర్‌రెడ్డి, శాంతమణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అలీకి అంతరాష్ట్ర పోలీసుల ప్రశంసలు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ డివిజన్‌లోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్ క్రైంవిభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మీర్ మహ్మద్ అలీని అంతరాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు ప్రశంసిం చారు. ఈ మేరకు ఆయా ఉన్నతాధికారులు పంపించిన ప్రశంస పత్రాలను బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా అలీ అందుకున్నారు. జాతీయస్థాయి క్రైమ్ విభాగానికి అనుబంధంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో అలీ సభ్యుడిగా కొనుసాగుతున్నాడు. అంతరాష్ట్ర పోలీసులతో సంబంధాలను కొనసాగిస్తూ నేరపరిశోధనకు అవసరనమైన సలహాలు ఇస్తుంటాడు. ఈ క్రమంలో ఇటీవల కొచ్చి ప్రాంతంలో దృష్టి మరల్చిబంగారం షాపుల్లో చోరీకి పాల్పడిన మహారాష్ట్రకు చెందిన మహిళా ముఠాను గుర్తించి కొచ్చి పోలీసులకు సమాచారం అందించారు. తిరువనంతపురం, వికారాబాద్‌లో జరిగిన దొంగతనాల్లో నిందితులను గుర్తించి సంబంధించిన అధికారులకు సమాచారం అందజేశాడు. అలీ సమాచారం మేరకు నిందితులను పట్టుకొని పెద్ద మొత్తంలో చోరీ సొమ్మును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన అలీని తిరువనంతపురం పోలీస్ కమిషనర్ కిరణ్ నారాయణ్, కొచ్చి పోలీస్ కమిషనర్ సుదర్శన్, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డిలు అభినందిస్తూ ప్రశంస పత్రాలను పంపించారు.




సీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న అలీ

కష్టాల్లో మెప్మా ఆర్పీలు

- నాలుగు నెలలుగా జీతాల కోసం ఎదురు చూపులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పది మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి
- ఉన్నతాధికారులు స్పందించి చెల్లించాలని వేడుకోలు





వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆర్పీలకు సక్రమంగా వేతనాలు అందడం లేదు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో పది మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఆర్పీ (రిసోర్స్ పర్సన్స్)లకు నాలుగు నెలలుగా జీతాలు అందక అష్టకష్టాలు పడుతున్నారు. వచ్చేది నెలకు రూ.6వేలే అయినా సమయానికి రావడం లేదని మండిపడుతున్నారు. గతంలో నెలకు రూ.4వేల వరకు జీతం ఉండగా, ప్రస్తుతం రూ.6వేలు ఇస్తున్నారు. అవి కూడా సమయానికి రావడం లేదని, జీతాలు సరిగా రాకపోవడం వల్ల పిల్లల చదువులు, ఇండ్ల అద్దెకు తలకు మించిన భారంగా మారుతతోందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.10వేలు ఇస్తామని చెప్పి మాట మరిచిందని అంటున్నారు. కలెక్టర్లు స్పందించిన తమకు క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

విధులు

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళుతున్న రిసోర్స్ పర్సన్లకు సరైన గుర్తింపు లేదు. ఇటీవల ప్రభుత్వం నిర్వహిం చిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగనణ సర్వేలో కీలక పాత్ర పోషించా రు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఓటరు నమోదు, తొలగింపు నుంచి ప్రభుత్వ, పబ్లిక్ మీటింగ్‌ల వరకు వీరినే ఉపయోగిస్తారు. అలాగే ఆయా మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న మహిళా సంఘాలు, మహిళా సమాఖ్యలకు సంబంధించిన పొదుపు లెక్కలను సరి చేసేందుకు ప్రభుత్వం నియమించింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పది మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో 712 మంది పని చేస్తున్నారు. 475 మంది గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తుండగా, వర్ధన్నపేటలో 14, పరకాలలో 22, నర్సంపేటలో 38, తొర్రూరులో 16, మరిపెడలో 11, డోర్నకల్ 10, మహబూబాబాద్‌లో 55, భూపాలపల్లిలో 33, జనగామ మున్సిపాలిటీలో 38 మంది పని చేస్తున్నారు. వీరికి నాలుగు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్పీల డిమాండ్లు

- రాష్ట్రం మొత్తం ఒకటే యూనిఫామ్ ఉండాలి.
- 164 జీవోను రద్దు చేస్తూ కొత్త జీవోను విడుదల చేయాలి.
- ప్రతీ ఆర్పీకి గుర్తింపు కార్డులు అందించాలి.
- ప్రమాద బీమా కింద రూ.10లక్షలు చెల్లించాలి.
- సాధారణ మరణం పొందితే రూ.5లక్షలు ఇవ్వాలి.
- ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- రూ.20 వేల జీతం చెల్లించాలి.
- సర్వేలో పాల్గొన్న ఆర్పీలకు అదనపు అలవెన్స్ ప్రకటించాలి.
- ఆర్పీల సెల్‌ఫోన్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి.

సమయానికి జీతాలు అందించాలి

వచ్చేదే తక్కువ జీతం. అది కూడా సమయానికి అందక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ప్రభుత్వం నెలకు రూ.10వేల జీతం ఇస్తామని హామి ఇచ్చింది. కానీ పెండింగ్‌లో ఉన్న జీతాలు కూడా ఇవ్వడం లేదు. జిల్లా అధికారులు స్పందించి జీతాలు అందించాలి.

- డి.సునిత, ఆర్పీల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2310	2100
పల్లికాయ (సూక)	6280	4600
పల్లికాయ (పచ్చిది)	4000	3100
కందులు	6752	5540
పెసళ్లు	6685	5133
పత్తి	6980	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13700	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	16500	13500
యూఎస్ 341 కొత్తది	14200	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కాజీపేట రైల్వే డివిజన్‌పై చిగురిస్తున్న ఆశలు

విశాఖ జోన్ ఏర్పాటుతో జోరుగా ఊహాగానాలు

కాజీపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నూతనంగా విశాఖ జోన్ ఏర్పాటు ఖరారు కావడంతో కాజీపేట డివిజన్ ఏర్పాటుపై ఆశలు రేకెత్తిస్తున్నాయి.. విశాఖ జోన్ ఏర్పాటు అంశం తెరమీదికి వచ్చిన ప్రతీసారి కాజీపేట డివిజన్ ఏర్పాటు ఖాయమనే చర్చ జరుగుతోంది. గతంలో దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్‌లను దక్షిణ కోస్తాలో కలుపుతూ విశాఖ జోన్ సరిహద్దులు పూర్తి చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సైతం డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధమైనట్లేనని చర్చ జరుగుతోంది. సికింద్రాబాద్ వైపు నుంచి భువనగిరి రైల్వే స్టేషన్, బల్లార్షా వైపు మాణిగర్, గట్ చందూర్, పండర్‌పాణి మణుగూరు, వరంగల్ వైపు మోటమర్రి, విష్ణుపురం, కరీంనగర్ సెక్షన్‌లో నిజామాబాద్ బార్డర్‌తో కలుపుకుని కాజీపేట డివిజన్ ఏర్పాటుకు అనుకూల అంశాలుగా ఊహాగానాలు వస్తున్నాయి. సికింద్రాబాద్ డివిజన్‌లోనే కాజీపేట నుంచి అత్యధిక లాభాలు రావడం, ఎన్నో ఏళ్లుగా కాజీపేట డివిజన్ ఏర్పాటు డిమాండ్ ఉండడం, ప్రస్తుతం కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ, పీవోహెచ్ ఏర్పాటు, రైల్వే కార్మికుల సంఖ్య రెట్టింపు కావడం అన్ని అనుకూల అంశాలతో డివిజన్ ఏర్పాటు లాంఛనమే అనే చర్చ మొదలైంది. ఒక వేళ కాజీపేట డివిజన్ ప్రకటన చేయకుంటే మరోసారి ఉద్యమించక తప్పదని స్థానికులు, టీరైల్వే ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు చర్చించుకుంటున్నట్లు సమాచారం.


గతేడాది ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతరలో సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుంటున్న భక్తులు

గద్దెల విస్తరణ లేనట్టేనా?

32 గుంటల స్థలంలోనే మేడారం గద్దెల సాలారం

- తల్లులను దర్శించుకునేందుకు ప్రతీ జాతరలో భక్తులకు ఇబ్బందులు
- 4 ఎకరాల్లో విస్తరించాలనే ప్రతిపాదన అటకెక్కిన వైనం
- 19ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ జాప్యం
- ప్రపంచం అబ్బుర పడేలా జాతర నిర్వహిస్తామని దాటవేసిన గత ప్రభుత్వం
- ప్రశాంత దర్శనం కోసం కాంగ్రెస్ సర్కారైనా దృష్టిసారించాలని భక్తుల విజ్ఞప్తి

వరంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతర మేడారం. ప్రతీ రెండేళ్లకొకసారి జరిగే జాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తుంటారు. నాలుగు రోజుల్లో ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు తల్లుల దర్శనానికి రావటంతో తనివీతీరా దర్శనం లభించటం లేదు. కేవలం 32గుంటల స్థలంలో నిర్మించిన సమ్మక్క- సారలమ్మల గద్దెల ప్రాంగణం (సాలారం) ఇరుకుగా ఉండటమే దీనికి కారణం. 2012లో ఈ ప్రాంగాణాన్ని పక్కనే ఉన్న దేవాదాయ శాఖకు చెందిన 4ఎకరాల భూమిలోకి విస్తరించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చటం లేదు. గద్దెల ప్రాంగణం పక్కనే ఉన్న 19 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించటంలో రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా ప్రతీ జాతరకు ఇరుకు ప్రాంగణంలో తల్లుల దర్శనం దక్కటం లేదని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

మహాజాతర స్థల విస్తరణకు విఫలయత్నాలు..

2018 ఫిబ్రవరిలో జరిగిన మహాజాతరకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ జాతర జరిగే స్థలాన్ని 200 ఎకరాలకు విస్తరించడంతో పాటు రూ.200 కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినప్పటికీ రూ.200 కోట్లు నిధులు రాలేదు. అయితే 2019లో అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి కొంత చొరవ చూపినప్పటికీ భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమేరా అన్నారు. మేడారం జాతర అభివృద్ధికి మొదటి విడతలో 62 ఎకరాల ప్రభుత్వ భూమి, 39 ఎకరాలు పట్టా భూమి కలిపి మొత్తం 101 ఎకరాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. 62 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కువగా రెడ్డిగూడెం, జంపన్నవాగు ఏరియాలో ఉంది. ఈ భూమిలో 58 మంది రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. వీరందరు భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు ససేమేరా అన్నారు. ఇక 39 ఎకరాల పట్టా భూమిలో 32 మంది రైతులు ఉన్నారు. వీరిని కూడా వారి భూములను ప్రభుత్వానికి ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో భూసేకరణకు బ్రేక్ పడింది. కనీసం ఆ నిధులతో మేడారం ప్రాంగణం విస్తరించేందుకు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇరుకైన సాలారంలో తల్లుల గద్దెలు

పెద్ద ఎత్తున తమ ఇలువేల్పులను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు తల్లుల దర్శన భాగ్యం కష్టమవుతుంది. గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడితే ఏ తెల్లవారు జామునో.. అర్ధరాత్రినో.. తల్లుల దర్శన భాగ్యం లభించదు. గంటల తరబడి తల్లుల దర్శన భాగ్యం కోసం భక్తులు క్యూ కడితే ఐదారు నిమిషాలు కూడా తల్లులను మనసార మొక్కుకునే అవకాశం కలగటం లేదని భక్తులు వాపోతున్నారు. దీనికి ప్రధానం కారణం లక్షల సంఖ్యలో క్యూలో ఉన్న భక్తులైతే.. చాలా ఇరుకుగా ఉన్న గద్దెల ప్రాంగణం (సాలారం)మరో కారణంగా చెప్పుతున్నారు. సుమారుగా 32 గుంటల స్థలంలోనే తల్లుల గద్దెల ప్రాంగణం ఉంది. సమ్మక్క, సాలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల కొలువై ఉండే ఈ ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో భక్తులకు ప్రతీ జాతరకు ఇబ్బందికరంగా మారుతుంది. గద్దెల వద్ద ఐదారు వేల మంది భక్తులకంటే ఎక్కువ మంది భక్తులు నిలబడి మొక్కులు చెల్లించే పరిస్థితి లేదు. కనీసం దూరం నుంచి క్యూ లైన్‌లో నిలబడి మొక్కుకుందామన్న చుట్టు గోడలే అడ్డుగా ఉండటంతో అదికూడా సాధ్య పడటం లేదు. గంటల తరబడి గద్దెల ప్రాంగణం బయటే ఎండ, చలి అనే తేడా లేకుండా క్యూలో ఉండాల్సి వస్తుంది. దీనికి తోడు జాతర సమయంలో ఈ ప్రాంగణంలోనే పదుల సంఖ్యలో హుండీలు, బెల్లం బుట్టలను తొలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ప్రాంగణం మొత్తం ఇరుకుగా మారుతుంది. ఈ నేపథ్యంలో మేడారం గద్దెల వద్ద ఉన్న సాలారం స్థలాన్ని విస్తరించాలని గత దశాబ్దం కాలంగా భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గద్దెల ప్రాంగణం విస్తరణకు నోచుకోవటం లేదు. దీంతో ప్రతి మహాజాతరకు తల్లుల దర్శన బాధలు తప్పెట్టు లేదని ఆందోళన భక్తుల్లో వ్యక్తం అవుతుంది.

దేవాదాయ భూముల్లో విస్తరిస్తేనే...

మహాజాతరను సక్సెస్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లపై దృష్టిసారించారు. దేవాదాయశాఖ మంత్రి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖనే ఉన్నారు. అయినప్పటికీ గిరిజన జాతరలో తల్లుల గద్దెల విస్తరణలో దేవాదాయశాఖ ప్రత్యేకంగా దృష్టిసారించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గద్దెలు ఉన్న సాలారం కేవలం 32 గుంటల్లోనే ఉంది. దీన్ని మరో రెండు, మూడు ఎకరాల్లో విస్తరించాలని భక్తులు కోరుతున్నారు. గద్దెల పక్కనే దేవాదాయశాఖకు సంబంధించిన సుమారుగా 4 ఎకరాల భూమి ఉంది. దేవాదాయశాఖకు ఉన్న భూమిలో రెండు, మూడు ఎకరాల వరకు గద్దెల ప్రాంగణం విస్తరిస్తే తల్లులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సులభంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. నాలుగు వైపుల క్యూ లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు తల్లుల దర్శనం కలిగే విధంగా కొత్తగా ప్రాంగణం నిర్మిస్తే బాగుంటుందని భక్తులు పేర్కొంటున్నారు.

19ఎకరాల ప్రభుత్వ భూమి సేకరణలో జాప్యం

మేడారం తల్లుల గద్దెల సమీపంలోనే మరో 19 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని సేకరించేందుకు స్వాధీనంలో ఉన్న రైతులను ఒప్పించటంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2019లోనే గద్దెల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా, రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. 2022 జాతరలో మరోసారి భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2023లో ములుగు జిల్లా కలెక్టర్ ఖాతాకు రూ.2.73కోట్ల నిధులను జమ చేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు 19ఎకరాల్లో ఉన్న రైతులతో సంప్రదింపులు జరపటం లేదనే ప్రచారం జరుగుతోంది. ఈ 19 ఎకరాలతో పాటు దేవాదాయశాఖకు చెందిన 4 ఎకరాలు కలిపి మొత్తం 24 ఎకరాల భూమిని సేకరించి గద్దెల ప్రాంగణంతో పాటు అతిధి గృహలు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. గిరిజనులు తమ ఆధీనంలో ఉన్న భూములను ఇచ్చేందుకు ససేమేరా అంటే.. కనీసం దేవాదాయ శాఖకు చెందిన నాలుగు ఎకరాల్లో గద్దెల విస్తరణ చేపట్టి తల్లుల దర్శనం భాగ్యం ప్రశాంతంగా కల్పించాలని భక్తులు కోరుతున్నారు. దేశనలుమూలల నుంచి వచ్చే భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శనం ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం దృష్టిపెట్టాలని భక్తులు కోరుతున్నారు. వచ్చే ఏడాది జరుగనున్న మహాజాతరకు ఇప్పటి నుంచే ఏర్పాట్లపై కసరత్తు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మినీ జాతరకు అంకురార్పణ


ఎత్తు బంగారం (బెల్లం)తో గద్దెలకు వస్తున్న భక్తులు

- మేడారంలో ఘనంగా గుడిశుద్ధి పండుగ
- తల్లుల దర్శనానికి 40వేలమందికి పైగా భక్తుల రాక
- సందడిగా మారిన సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం మినీజాతరకు అంకురార్పణ జరిగింది. ఈనెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే చిన్నజాతరకు అంకురార్పణగా.. మేడారం, కన్నెపల్లి గ్రామాల్లోని సమ్మక్క- సారలమ్మ అంతర్గత గుడుల్లో శుద్ధి పండుగను పూజారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా తెల్లవారుజామున నిద్రలేచి జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం పూజారులు మేడారంలో సమ్మక్క గుడి, కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడిని శుద్ధి చేశారు. దేవతల ప్రతిమలు, పూజా సామగ్రి బయటకు తీసి శుభ్రపరిచారు. గుడిలోపల దేవతల పీఠాలను పూజారుల కుటుంబాల ఆడపడుచులు అలుకుపూతలు చేసి ముగ్గులతో అలంకరించారు. ఈ క్రమంలో పూజారులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి పూజాసామగ్రిని రహస్య పూజలకు సిద్ధం చేశారు. మినీ జాతర వేడుకలకు ముందు ఈ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. మరో ఆరు రోజుల్లో మేడారం మినీ జాతర ప్రారంభం కానుండగా.. మినీ జాతర ముగిసి.. తిరుగువారం పండుగ జరిగేరోజు వరకు నిష్ఠతో ఉపవాసాలు పాటిస్తూ గుడుల్లో రహస్య పూజలు చేసి మినీ జాతరను నిర్వహిస్తారు. అయితే ఈ బుధవారం జరిగిన గుడిశుద్ధి పండుగతో మినీజాతర వేడుకలకు అంకురార్పణగా భావిస్తారు.


జంపన్నవాగులోని బావుల్లో ఇసుక పూడిక తీస్తున్న కూలీలు


బయక్కపేటలో గుడిమెలుగు పండుగ చేస్తున్న చంద వంశీయులు

భారీగా తరల్వొన భక్తులు... ఎండ తీవ్రతకు ఇబ్బందులు

గుడిశుద్ధి పండుగతో బుధవారం మినీజాతరకు అంకురార్పణ జరగ్గా.. తల్లులను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం సుమారు 40వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఇక మేడారం వనదేవతలను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క- సారలమ్మలకు ఆయన ఎత్తు బంగారం సమర్పించారు. తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అయితే వనదేవతలను దర్శించుకోవడానికి మేడారం తరలివచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత కారణంగా దేవస్థానం ప్రాంగణంలో బండలు కాలాయని పలువురు వాపోయారు. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడికి ఇబ్బంది పడ్డారు. కొంతమంది గొడుగులు వాడటం కనిపించింది.

మినీజాతరకు చురుగ్గా ఏర్పాట్లు..

మేడారం మినీ జాతరకు తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జంపన్నవాగులోని స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో వాగులోని ఊటబావుల్లో ఇసుక పూడికతీత పనులను ప్రారంభించారు. మినీ జాతర సుమారు 40లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు బావుల్లో పుడికతీసి ఆరు మోటార్ల ద్వారా ఎనిమిది బీవోటీలకు నీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సమ్మక్క- సారలమ్మల గద్దెల పరిసరాల్లో పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడి ఆవరణలో కూడా ఈ పనులు ప్రారంభమయ్యాయి.

సమ్మక్క పుట్టింట గుడిమెలుగు పండుగ

సమ్మక్క దేవతను తమ ఆడబిడ్డగా భావించి చంద వంశీయులు తాడ్వాయి మండలంలోని బయక్కపేట గ్రామంలో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ జాతర నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆ గ్రామంలో గుడిమెలుగు పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పురాతన కాలం నుంచి ఉన్న సమ్మక్క మందిరం పైకప్పును తొలగించి కొత్తగా నిర్మించారు. అంతేకాకుండా సమ్మక్క దేవతకు సంబంధించిన పూజా సామగ్రి, ప్రతిమలను శుభ్రం చేసి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళలు గుడిని అలుకుపూతలు చేసి రంగురంగుల ముగ్గులు వేశారు. డోలి వాయిద్యాల నడుమ చంద వంశీయులు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అదేవిధంగా తిరుగువారం వరకు నియమ నిష్ఠలతో దేవతకు పూజలు చేస్తూ వచ్చే బుధవారం జాతర నిర్వహిస్తారు.



జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


ఎదురు కోడి మొక్కుతున్న భక్తురాలు

ప్రైవేట్ వ్యక్తులకు ఐటీ అప్పగింత

- ఆ అధికారి కనుసన్నల్లోనే పరిపాలన
- ఉద్యోగుల ఐటీలో భారీ వసూళ్లకు తెర
- ఉన్నతాధికారులకు సైతం కొరకరాని కొయ్య
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, ఉద్యోగులు

ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వందలాది మంది రెగ్యులర్ ఉద్యోగుల ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్‌కు సంబంధించిన వ్యవహారాలను ఎంజీఎం మినిస్టీరియల్ సిబ్బంది గతంలో చూసేవారు. కానీ ఈ అధికారి ఓ ప్రైవేట్ ఆడిటర్ దగ్గరికి వెళ్లండి.. అంటూ మొబైల్ నెంబరు ఇస్తూ పంపుతున్నట్లు వైద్యులు, నర్సింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా ఆ ప్రైవేట్ ఆడిటర్ దగ్గరికి వెళ్లాక డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పెద్దాస్పత్రిలో ఇష్టారాజ్యం

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే పేదల ఆస్పత్రిగా పేరున్న మహాత్మాగాంధీ స్మారక ఆస్పత్రి (ఎంజీఎం) పరిపాలనలో ఓ అధికారి తన హవా నడిపిస్తున్నాడు. పెద్దాస్పత్రిలో ఆయన ఏం అనుకుంటే అది చేయగలడు. ఎంత న్యాయబద్ధమైన పనైనా తన పరపతితో పక్కన పెట్టగలడు. అమ్యామ్యాలు సమర్పిస్తే ఏ పనైనా క్షణాల్లోనే జరిగిపోతుంది.

అమ్యామ్యాల కోసమే కొనుగోళ్లు

పేద రోగులకు అవసరమయ్యే మందుల కొనుగోలు విస్మరించి.. తమకు లాభం చేకూర్చే మందులను మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిత్యం ఉపయోగపడే డ్రగ్స్ ఎంజీఎంలో అందుబాటులో లేకపోవడం ఇందుకు నిలువెత్తు సాక్ష్యం. ఇక రోగ నిర్ధారణ పరీక్షల కోసం ఉపయోగపడే కెమికల్స్‌ను కూడా తెప్పించకపోవడంతో సీబీపీ లాంటి సామాన్య పరీక్షలు కూడా ప్రయివేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని రకాల కాంట్రాక్టులు, కొనుగోళ్లు ఆ అధికారి కనుసన్నల్లో జరగాల్సిందే మరీ. ఆ అధికారి అన్నీ తానై వ్యవహరిస్తుండటంపై ఎంజీఎం గత సూపరింటెండెంట్ తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుత సూపరింటెండెంట్ కూడా ఈ వ్యవహారంలో జంకుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఎంవోకు వేతనం చెల్లింపు

ఎంజీఎం ఆస్పత్రిలో ఫారిన్ సర్వీస్ విధానంపై పని చేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో కాల పరిమితి ముగిసింది. ఆయన మాతృ సంస్థ అయిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు వెళ్లాల్సి ఉంది. లేదంటే కొనసాగింపు ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేయాలి. ఈ రెండు జరగకుండానే అధికారికి కొన్ని నెలలుగా జీతాలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జీతాలు ఇవ్వడం లేదు. ఎంజీఎం ఆస్పత్రిలో అభ్యుదయ సొసైటీ ద్వారా 38 మందికి కొనసాగింపు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జీతాలు చెల్లించకుండా సదరు పరిపాలన అధికారి వేధింపులకు గురిచేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంట్రాక్టు ఉద్యోగులు వెళ్లి జీతాల గురించి ఆరాతీస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు కాంట్రాక్టు ఉద్యోగులు వాపోతున్నారు.

బయోమెట్రిక్ కవర్లు లేని దుస్థితి

పేదల ఆస్పత్రిలో చెత్త వేసేందుకు బయోమెట్రిక్ కవర్లు కూడా అందుబాటులో లేవని నాలుగో తరగతి సిబ్బంది వాపోతున్నారు. స్టేషనరీ టెండర్లను ఖరారు చేయకుండా దాటవేస్తూ ఎక్కువ రేట్‌తో స్టేషనరీ కొనుగోలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక చాలీచాలని జీతాలతో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ జీతాల చెల్లింపుల కోసం కూడా ఆయనకు ముడుపులు సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడింది.

పదోన్నతులలోనూ అదే తంతు

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, కారుణ్య నియామకాల విషయంలో న్యాయం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఇదే విషయంపై టీఎన్‌జీవో నాయకులు కూడా ఇటీవల సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. అయినా అమ్యామ్యాలు ఇస్తేనే ఫైలు ముందుకు కదులుతుందని సదరు అధికారి తేల్చి చెప్పినట్లు సమాచారం.

ఉద్యోగాల ఎరతో వసూళ్లు

ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సీటీ టెక్నీషియన్‌లతోపాటు కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను 300 సీఎస్‌లో ఉద్యోగాలు ఇస్తామంటూ భారీ ఎత్తున వసూలు చేసినట్లు తెలిసింది.



ఆకాశాన్నంటుతున్న పసిడి ధర

రూ.85,800కు చేరిన పది గ్రాముల బంగారం

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ బంగారం ధర ఆకాశాన్నంటుతోంది. వివాహాలు, శుభకార్యాలు ప్రారంభమవుతున్న వేళ పసిడి ధర పెరగడంతో సామాన్య ప్రజలు లబోదిబోమంటున్నారు. గతంలో తులం బంగారం రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఉన్న సమయంలో అడ్వాన్స్ ఇచ్చి నగలు కావాలని దుకాణాలలో ఆర్డర్లు ఇవ్వగా ఇపుడు తులానికి రూ.20 నుంచి రూ.25 వేల వరకు ధర పెరగడంతో వ్యాపారులు తల పట్టుకుంటున్నారు. బుధవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 85,800లకు చేరుకుంది. కిలో వెండి ధర రూ. 96,500లకు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 79,450 పలికింది. ఉగాది పండుగ తర్వాత తెలుగు నూతన సంవత్సరంలో అధిక సంఖ్యలో వివాహాలు ఉండడంతో అప్పటివరకు ధర రూ.లక్షకు చేరుకుంటుందని వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయడం సామాన్యులకు తలకు మించిన భారం అవుతోంది.


పట్టు తప్పితే పరిస్థితేంటి?





కొందరు ఆటోవాలాలు పైసల కోసం బడి పిల్లల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. పరిమితికి మించి చిన్నారులను ఎక్కించి బడులకు తరలిస్తున్నారు. అందుకు ఇదిగో ఫొటోలే నిదర్శనం. ఓ ఆటోలో పిల్లలను ఒకరిమీద ఒకరిని కూర్చోబెట్టుకుని.. ఆటోకు రెండువైపులా బరువైన బ్యాగులు తగిలించి.. తీసుకెళుతున్న ఈ దృశ్యం హనుమకొండ బాలసముద్రం వద్ద కనిపించింది. ఆటోవాలాలు పైసల కోసం ఇలా నిబంధనలకు విరుద్ధంగా బడి పిల్లలను తరలిస్తున్న క్రమంలో ఏ చిన్నారి పట్టు తప్పినా.. ఏదైనా ప్రమాదం జరిగినా పరిస్థితేంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పిల్లలకు జరగరానిది జరిగితే ఆ తల్లిదండ్రుల బాధ ఎవరు తీరుస్తారన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి విషయాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాటిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



అంగన్‌వాడీ నిర్వహణలో సూపర్‌వైజర్లే కీలకం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లదే కీలకపాత్ర అని స్టేట్ టీం మెంబర్లు కల్పన, స్వరూప అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి సెక్టార్ హరిజనవాడ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ పనితీరును తల్లులను అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌కు వచ్చిన పిల్లల బరువులతో పాటు రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో అందుబాటులో ఉన్న బాలామృతం వంటి పోషక విలువల నిల్వలను పరిశీలించారు. కాలం చెల్లిన పోషకాలపై కేంద్ర నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్రంలో అందిస్తున్న పోషక విలువల నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడమే కాకుండా వారం ముందే నిల్వలు అందుబాటులో ఉండే విధంగా సూపర్‌వైజర్లు చూడాలని సూచించారు. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ బాధ్యత, వారికి కావాల్సిన పోషక విలువలు సకాలంలో అందేవిధంగా చూసే బాధ్యత సూపర్‌వైజర్లు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారి వెంట ఐసీడీఎస్ సీడీపీవో స్వరూప, సూపర్‌వైజర్లు శిరీష, పద్మతో పాటు అంగన్‌వాడీ టీచర్ మేకల భాగ్యలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పిల్లలున్నారు.

కేసీఆర్‌ను కలిసిన చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును గజ్వేల్ జిల్లా ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి, స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించినట్లు ధర్మారెడ్డి తెలిపారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌కు బొకే ఇస్తున్న ధర్మారెడ్డి

'లక్ష డప్పులు.. వేల గొంతుకలు'

మహా ప్రదర్శన వాయిదా

ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

బాలసముద్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీల వర్గీకరణ అమలు చేయకుండా జాప్యం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన 'లక్ష డప్పులు - వేల గొంతుకల' కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ ప్రకటించారు. బుధవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. సమావేశంలో మందకుమార్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీల జనాభాలో అధిక భాగం ఉన్న మాదిగలకు కేటాయించిన రిజర్వేషన్ శాతాన్ని పెంచి 11 శాతం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మాలలకు లాభం చేకూర్చేలా వర్గీకరణ చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎస్సీల ఏబీసీ గ్రూపుల రిజర్వేషన్ శాతాన్ని ఏ కేటగిరికి 1 శాతం మాదిగ ఉపకులాలకు 11 శాతం, సి కేటగిరిలో ఉన్న మాల ఉప కులాలకు 3శాతం ఇవ్వాలని, లేకుంటే త్వరలో మరో పోరాటానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. మాదిగల మహా ప్రదర్శనకు సంఘీభావం తెలిపిన సమస్త సమాజానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంఎస్‌పీ జాతీయ నేత వేల్పుల సూరన్న కాపు, జాతీయ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు మంద రాజు మాదిగ, జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మ గౌరవాన్ని కాపాడాలి



డప్పులను పంపిణీ చేస్తున్న సెక్రటరీ డాక్టర్ ఎస్. సుజాత

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాదిగల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్. సుజాత పిలుపునిచ్చారు. బుధవారం కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదిగ ఉద్యోగులకు డాక్టర్ సుజాత ఉచిత డప్పుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు డప్పులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ వెంటనే అమలుచేసి మాదిగల విద్య, ఉద్యోగ అవకాశాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగలు ఆత్మ గౌరవంతో బతికేందుకు వర్గీకరణే ప్రాధాన్యతమన్నారు. ఏబీసీడీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవంతో అందరూ బతకాలని అన్నారు. లక్ష డప్పులు-వేల గొంతుకలు మహాసభ, సాంస్కృతిక సంబురాలకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగులు డప్పులు వాయించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో కేయూ ఇంజనీరింగ్ కళాశాల సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, మంద శ్యామ్, ఇంద విజయరావు, సుధీర్, పూర్ణం, నాగరాజు, శోభన్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడిన సీఎం రేవంత్



అంబేద్కర్ విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న కాంగ్రెస్, దండోరా నేతలు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలోనే మొదటిసారిగా అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని డీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మాదిగ హక్కుల దండోరా నేతలతో కలిసి హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ నివేదికకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన నేపథ్యంలో బుధవారం సంబురాలను నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వడ్డేపల్లి మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్



వడ్డేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లి మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కటకం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తోట నవీన్, కోశాధికారిగా అనుమాల సారంగపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అడప కృష్ణంరాజు, మిడిదొడ్డి రమేష్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా బత్తుల చంద్రకళ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎనుకొంటి పున్నం చందర్, ముఖ్య సలహాదారులుగా అల్లం లక్ష్మణరావు, మిడిదొడ్డి భిక్షపతి ఎన్నికయ్యారు. సభ్యులుగా అనుమాల నాగరాజు, అల్లం బుచ్చిబాబు, అప్పాల రవీందర్, సూర రవి, అల్లం విద్యాసాగర్, మిడిదొడ్డి సురేష్ కుమార్, ఎనుకొంటి కుమారస్వామిలను ఎన్నుకున్నారు.

పార్కుల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- హార్టికల్చర్ అధికారులకు ఆదేశం

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా ఉన్న వివిధ పార్కులలో దెబ్బతిన్న జిమ్ పరికరాలు, పిల్లలు ఆడుకునే ఆట వస్తువులకు మరమ్మతు చేయాలన్నారు. ఇంకా లైటింగ్ ఏర్పాటు, నీటి సరఫరా పునరుద్ధరణ చేయాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకం చేపట్టాలని ఆదేశించారు. వరంగల్ నగరంలో 18 పార్కులలో లైటింగ్ సమస్య ఉందని, అక్కడి సమస్యపై వెంటనే సంబంధిత అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు.

ప్రధాన రహదారుల వెంట ఉన్న మొక్కలపై దుమ్ము, ధూళి పేరుకుపోయి ఉన్నాయని, వారిపై గ్యాంగ్ వర్క్ చేయించాలన్నారు. రాంపూర్ నుంచి కాజీపేట వరకు ఈ సమస్య ఉందని అధికారులకు వెల్లడించారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ అధికారులు పలాస రమేష్, లక్ష్మారెడ్డి, ఈఈ మహేందర్, డీఈలు రవికిరణ్, రంగారావు, హార్టికల్చర్ అసిస్టెంట్లు అశ్విని, ప్రవళిక, అనూహ్య తదితరులు పాల్గొన్నారు.



ఈ- సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

వరంగల్ నగర పరిధిలో ఉన్న దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం వరంగల్ గిర్మాజీపేటలోని మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో కాకతీయ టౌన్ వికలాంగుల సమాఖ్య ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కమిషనర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానన్నారు. దివ్యాంగులు తప్పకుండా వారి వారి కొత్త సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని, వారికి ప్రభుత్వం నుంచి రావలసిన సబ్సిడీలు కార్పొరేషన్ తరుపున అందేలా సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరెడ్డి, రాజేశ్వర్, మెప్మా టీఎంసీ కంజర్ల రమేష్, సీవో రాజ్‌కుమార్, ఆర్పీ రాజేందర్‌తో పాటు దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈ- సేవా కేంద్రం తనిఖీ

బల్దియా పరిధిలోని కాశిబుగ్గ సమీపంలో గల ఈ- సేవా కేంద్రాన్ని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారిగా వాసూళ్లకు సంబంధించిన రిజిస్టార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వరంగల్ నగర ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరెడ్డి, ఆర్ఐలు సోహైల్‌తో పాటు ఈ-సేవా సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, రైతుల సంఘాల నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, వెంటనే కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు, కార్మికులు

మల్లికాంబ మనోవికాస కేంద్రంలో అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రమదేశ్‌పాండే

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో బుధవారం దివ్యాంగుల చిన్నారుల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ సెక్రటరీ శ్రమదేశ్‌పాండే పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రమదేశ్‌పాండే మాట్లాడుతూ.. దివ్యాంగుల తల్లిదండ్రులు పిల్లల యొక్క ప్రవర్తన, మాడిఫికేషన్, ఫిజియోథెరపీ ద్వారా ఉపయోగాలపై సూచనలు ఇచ్చారు. అదేవిధంగా ఈ సంస్థ నిర్వాహకురాలు బండ రామలీలను అభినందించారు. మానసిక దివ్యాంగులైన తల్లిదండ్రులు ఎప్పుడు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, సాధారణ పిల్లలాగా వీరిని కూడా బయటకు తీసుకువచ్చి వారికి కావాల్సిన శిక్షణను స్వచ్ఛంద సంస్థల ద్వారా అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వసుధ, పద్మ, విశాలి, బండ సదానందం, కోడెం కల్యాణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులు ప్రొఫెషనల్‌గా రాణించాలి

జిల్లా జడ్జి సీహెచ్ రమేశ్‌బాబు

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రొఫెషనల్‌గా రాణించి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని జిల్లా జడ్జి సీహెచ్ రమేశ్‌బాబు ఆకాంక్షించారు. బుధవారం కేయూ న్యాయ కళాశాల విద్యార్థుల ఉపయోగార్థం కంప్యూటర్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వర్సిటీ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా జడ్జి రమేశ్ బాబు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ శ్రమదేశ్‌పాండే, వరంగల్ డిస్ట్రిక్టు జడ్జి నిర్మల గీతాంబ, డీఎల్ఎస్ఏ సెక్రటరీ సాయికుమార్‌లు హాజరయ్యారు. న్యాయ కళాశాల విద్యార్థుల ఉపయోగార్థం తమ తరపున కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. న్యాయ విద్యార్థులు వృత్తిలో రాణించేందుకు సబ్జెక్టుపై పట్టు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీఎల్ఎస్ సెక్రటరీ శ్రీకాంత్ ఇతర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన సెక్రటేరియేట్ ముట్టడిని చేపట్టారు. ఈ క్రమంలో హసన్‌పర్తి పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు మండల పరిధిలోని మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకొన్నారు. ఈ సందర్భంగా పోలీసుల ఆదుపులో మాజీ సర్పంచ్‌లు జనగాం శరత్‌కుమార్, బొల్లవేణి రాణిరాజుకుమార్‌తో పాటు పలువురు మాజీ సర్పంచ్‌లున్నారు. వీరికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్, నాయకులు నాగరాజు, వేణుగోపాల్ సంఘీభావం తెలిపారు.



పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచ్‌లు

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కులస్థులపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ రెడ్డి సంఘం నాయకులు బుధవారం సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పెద్దల సభలో రాజ్యాంగంపై ప్రమాణం చేసి అన్ని సామాజిక వర్గాలను సమానంగా చూస్తామని చెప్పి హనుమకొండ వేదికగా జరిగిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. తీన్మార్ మల్లన్నపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రెడ్డి సంఘం నాయకులు గోపు జైపాల్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డి, రావుల నర్సింహరెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, చాడా జైహింద్ రెడ్డి, తాటిపెల్లి గణపతిరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు చేసినట్లు ముచ్చర్ల రెడ్డి సంఘం ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఈ నెల 2న వరంగల్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన బీసీ రాజకీయ యుద్ధ భేరి సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రెడ్డి కులాన్ని కించపరుస్తూ మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని, రెడ్డి కులానికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. లేని పక్షంలో అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముచ్చర్ల రెడ్డి కుల సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో రెడ్డి కుల సంఘం ప్రతినిధులు పెద్ది ఇంద్ర సేనారెడ్డి, చల్ల వెంకటేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులున్నారు.



సుబేదారిలో మల్లన్నపై ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

శేషగిరిబాబుకు డాక్టరేట్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జిమ్మిడి శేషగిరిబాబుకు హైదరాబాద్ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి శేషగిరిబాబుకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. శేషగిరిబాబు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఈసీఈ విభాగపు రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి.వి.ఆర్.ప్రసాద్ పర్యవేక్షణలో జేఎన్ టీయూ హైదరాబాద్ పరీక్షల విభాగానికి థీసిస్‌ను సమర్పించినట్లు తెలిపారు. డాక్టరేట్ పొందిన శేషగిరిబాబును కళాశాల యాజమాన్యం, పీఆర్‌వో డాక్టర్ డి.ప్రభాకరాచారి, రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి, ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, అసోసియేట్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

కేయూ ఓఎస్డీ మల్లారెడ్డిని తొలగించాలి



మీడియాతో మాట్లాడుతున్న నరేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేయూలో గతంలో లేని ఓఎస్డీ పోస్టును సృష్టించి దళిత రిజిస్ట్రార్‌ను అవమాన పరిచేలా ప్రొఫెసర్ మల్లారెడ్డిని నియమించారని, వెంటనే ఓఎస్డీ పోస్టు నుంచి మల్లారెడ్డిని తొలగించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ హెచ్చరించారు. బుధవారం కేయూ క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో మంద నరేశ్ పాల్గొని మాట్లాడారు. ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్, గణేశ్, కిరణ్, భరత్, సాయి, వెంకటేశ్, సూర్య, అన్వేష్ పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి

సోలార్ రూఫ్‌టాప్స్ అందజేత



సోలార్ రూఫ్‌టాప్‌ల వద్ద విద్యుత్ అధికారులు

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సర్కిల్ పరిధిలోని విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ అధికారులు తలోచేయి వేసుకొని హనుమకొండ పూరిగుట్టలోని సాయిసేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమానికి రూ.2లక్షల విలువచేసే 5 కిలోవాట్స్ సోలార్ రూఫ్‌టాప్స్ అందజేశారు. బుధవారం ఈ సోలార్ రూఫ్‌టాప్‌లను ఎస్ఈ వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల

పరీక్షల కంట్రోలర్‌గా సుధీర్‌కుమార్

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కాలేజీ ఎగ్జామ్స్ కంట్రోలర్‌గా కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ సుధీర్ కుమార్‌ను నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు ఫిరోజ్, గిరిప్రసాద్, నహిదాపర్వీన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

భీమారంలో స్వచ్ఛ సర్వేక్షణ్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-2025 కార్యక్రమంలో భాగంగా 1, 55, 56, 65, 66 డివిజన్‌ల కార్మికులకు తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జవాన్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొని తడి, పొడి, ప్రమాదకర చెత్త సేకరణపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ

చిత్రపటానికి క్షీరాభిషేకం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో బుధవారం బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు మారం తిరుపతియాదవ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి కుటుంబాల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రాష్ట్ర కిసాన్ మోర్చ నాయకులు పెద్ది మహేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు మెంబర్లు దాసరి రాజు, మేకల హరిశంకర్, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, మధు, సత్యం, సుమన్, నరేష్, భిక్షపతి, సాంబయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. హనుమకొండలోని పీహెచ్‌సీ, సిద్ధాపూర్‌లోని వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న నాగారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించి పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటరులోని ల్యాబ్, ఫార్మసీ, ఫిజియోథెరపీ, డెంటల్‌లను సందర్శించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, రమేశ్, వైసర్ శేతల్, భార్గవ్, విజయరెడ్డి, డాక్టర్ సన్ని, డాక్టర్ సుస్మిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

పల్లె దవాఖాన డాక్టర్ల క్యాలెండర్ ఆవిష్కరణ

రాష్ట్ర పల్లె దవాఖాన డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను హనుమ కొండ డీఎంహెచ్‌వో అప్పయ్య బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. వైద్య అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరుణ్ కుమార్, సెక్రటరీ నవీన్ కుమార్, డాక్టర్లు విజయ, జోస్న, నిఖిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ బిల్‌ని ఇలా తగ్గించుకోండి..!

వేసవికాలం వస్తోంది అనగానే అందరిలో కరెంట్ బిల్‌కు సంబంధించిన ఆందోళన ప్రారంభమౌతుంది. ఇంట్లో విద్యుత్ వినియోగానికి సంబంధించి చిన్న జాగ్రత్తలు పాటిస్తే... కరెంట్ బిల్ భారీగా పెరగకుండా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- ఎల్‌ఈడీ బల్బుల వల్ల విద్యుత్ వినియోగం తగ్గుతుంది. ఇంట్లోని ప్రతిగదిలో ట్యూబ్‌లైట్‌తో పాటు ఎల్‌ఈడీ బల్బును కూడా ఏర్పాటు చేసుకోవడం మంచిది. పిల్లలు చదువుకునేటప్పుడు ట్యూబ్‌లైట్‌ను మిగిలిన అన్ని సందర్భాల్లో ఎక్కువగా ఎల్‌ఈడీ బల్బులను ఉపయోగించడం వల్ల కొంతమేర కరెంట్ బిల్లు తగ్గించుకోవచ్చు.
- వేసవికాలంలో చాలామంది ఇళ్లలో ఏసీని ఉపయోగిస్తూ ఉంటారు. ఏసీ వేసేముందు కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఏసీని 26 డిగ్రీల వద్ద ఉంచి గది మొత్తం చల్లగా అయిన తరవాత ఆపివేయాలి. నాన్ ఇన్వర్టర్ ఏసీకి బదులు ఇన్వర్టర్ ఏసీని ఎంచుకోవడం మంచిది. ఇన్వర్టర్ ఏసీ.....అవసరం మేరకు కంప్రెసర్ వేగాన్ని నియంత్రిస్తుంది. దీనివల్ల ఎక్కువగా విద్యుత్ వినియోగం కాదు. కరెంట్ బిల్ కూడా తగ్గుతుంది. సాధ్యమైనంత వరకు ఏసీకి బదులు కూలర్ వాడుకోవడం మేలు.
- హాల్, లివింగ్ రూమ్, స్టడీరూమ్ ఇలా ప్రతి గదిలో అవసరమైనప్పుడు మాత్రమే ఫ్యాన్ వేసుకోవాలి. గది నుంచి బయటికి వస్తూ ఫ్యాన్‌ని ఆపివేయడం మర్చిపోవద్దు. ఈ అంశానికి సంబంధించి పిల్లలకు అర్థమయ్యేలా వివరించడం మంచిది. దుమ్ము, ధూళి పేరుకుంటే ఫ్యాన్ ఎక్కువ విద్యుత్‌ని వినియోగించుకుంటుంది. వారానికి ఒకసారి ఇంట్లోని ఫ్యాన్లను తప్పనిసరిగా శుభ్రం చేయాలి.



- మైక్రోవేవ్ ఎక్కువగా విద్యుత్‌ను వినియోగించుకుంటుంది. దీనిని ఉపయోగించుకున్న తరవాత వెంటనే పవర్ బటన్‌ను ఆపివేయాలి. అలాగే స్టాండ్‌బై మోడ్‌లో ఉంచకూడదు.
- ఫ్రిజ్ వాడకంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్రీజర్లో ఎక్కువగా ఐస్ గడ్డకడితే విద్యుత్ ఎక్కువగా వినియోగమవుతుంది. మూడు రోజులకు ఒకసారి ఫ్రిజ్‌ను పరిశీలించి డీఫ్రాస్ట్ చేయాలి. ఫ్రిజ్ కొనేటప్పుడు ఎక్కువ స్టార్లు ఉన్నది తీసుకోవాలి. ఐదు స్టార్లు ఉంటే... విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది.
- గీజర్‌లో నీటిని వేడిచేసిన వెంటనే స్నానాదికాలు ముగించాలి. ఇంట్లో పెద్ద గీజర్ ఉంటే అందులో నీటిని ఒకేసారి వేడిచేసి కుటుంబసభ్యులంతా ఒకరి తరవాత ఒకరు స్నానం ముగించేలా చూసుకోవాలి.
- వాషింగ్ మెషీన్‌లో సూచించిన లోడ్‌కు తగ్గట్టు దుస్తులు వేయాలి. అంతకు మించి వేస్తే విద్యుత్ వినియోగం పెరుగుతుంది.

కొత్తవాటిలా మెరవాలంటే..!

బాత్‌రూమ్‌లో ఉపయోగించే బకెట్లు, మగ్గులపై తెల్లని నీటి మరకలు ఏర్పడుతుంటాయి. రోజూ ఉపయోగిస్తున్నప్పటికీ వాటిపై మురికి చేరి నల్లగా మారుతుంటాయి. ఇలాంటి మరకలను ఇంటి చిట్కాలతో సులువుగా వదిలించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- ఒక గిన్నెలో మూడు చెంచాల బేకింగ్ సోడా, రెండు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల పాత్రలు శుభ్రం చేసే లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాత టూత్ బ్రష్‌తో తీసుకుంటూ బకెట్లు, మగ్గులకు మరకలు ఉన్న చోట పట్టించాలి. అరగంట ఆరిన తరవాత స్టీల్ స్క్రబ్బర్‌తో రుద్ది కడిగితే మరకలన్నీ పోయి కొత్తవాటిలా మెరుస్తాయి.
- ఒక గిన్నెలో మూడు చెంచాల బేకింగ్ సోడా లేదా ఉప్పు, నాలుగు చెంచాల వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని టూత్ బ్రష్ సహాయంతో మరకలపై రాయాలి. పావుగంట తరవాత మంచినీళ్లతో కడిగితే అన్ని రకాల మరకలు పోతాయి.
- ఒక గ్లాసు నీటిలో మూడు చెంచాల బ్లీచింగ్ పౌడర్ వేసి కలపాలి. చేతులకు తొడుగులు వేసుకోవాలి. ఒక పలుచని గుడ్డని గుండ్రంగా మడిచి ఈ నీళ్లలో ముంచి దానితో బకెట్లను మగ్గులను తోమాలి. పావు గంట తరవాత వాటిని మంచి నీళ్లతో శుభ్రం చేస్తే మరకలన్నీ వదిలిపోతాయి.
- ఒక గిన్నెలో రెండు ప్యాకెట్ల ఈనో పొడి, నాలుగు చెంచాల నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమంలో స్క్రబ్బర్‌ని అద్ది దానితో బకెట్లను, మగ్గులను గట్టిగా రుద్దుతూ తోమాలి. అయిదు నిమిషాలు ఆరనివ్వాలి. తరవాత మంచి నీళ్లతో కడిగేస్తే మరకలు పోతాయి.
- రసం పిండిన తరవాత నిమ్మచెక్కలను పారేసే ముందు వాటితో ఇంట్లోని బకెట్లు, మగ్గులు రుద్ది కడుగుతూ ఉంటే అవి ఎప్పుడూ కొత్తవాటిలాగే ఉంటాయి.



వి



నచ్చినట్టు దుస్తులు కుట్టించుకోవాలంటే టైలర్, డిజైనర్, బొటిక్ ఒకే చోట అందుబాటులో ఉండాలి. అవసరమైతే వాళ్లు ఇంటికే వచ్చి సేవలు అందించగలగాలి. ఇలా దర్జీ రంగాన్ని వినియోగదారుల దగ్గరకు చేర్చడం కోసం 'రన్ టైలర్' అనే సంస్థను స్థాపించి, అందరికీ దర్జీ సేవలను అందిస్తున్నారు హైదరాబాద్‌కు చెందిన **అనసూయారెడ్డి**.
ఆమె 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి...

ఇంటి ముందుకే దర్జాగా..!

దర్జీ పరిశ్రమ వెనకపడిపోతూ, ఫ్యాషన్ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి కారణం దర్జీలు సంఘటితంగా లేకపోవడమే! స్వతహాగా దుస్తుల డిజైనింగ్ పట్ల ఆసక్తి కలిగిన నేను, ఈ ధోరణిని లోతుగా అర్థం చేసుకుని 2017లో అను డిజైన్స్ అనే ఒక బ్రాండ్ మొదలుపెట్టాను. స్వయంగా వస్త్రాలు కొనుగోలు చేసి, టైలర్లు, మాస్టర్ల దగ్గర డిజైన్ చేయించి, కుట్టించి హైలైఫ్ ఎగ్జిబిషన్లో విక్రయించేదాన్ని. ఒక సందర్భంలో కుట్టడం కోసం దుస్తులు తీసుకున్న దర్జీ, సమయానికి నా ఫోన్‌కు స్పందించడం మానేశాడు. నాకేమో ఎగ్జిబిషన్‌లో స్టాల్ పెట్టుకునే సమయం దగ్గరపడిపోతోంది. దాంతో అడ్రస్ వెతికి, నేరుగా అతని ఇంటికి వెళ్లిపోయాను. అక్కడ అతని ఇరుగు పొరుగు మొత్తం నా మీదకు గొడవకు దిగారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోకుండా, వృత్తి ధర్మానికి కట్టుబడని వాళ్ల స్వభావం చూసి, అప్పటికి నా అభిరుచికి ఫుల్‌స్టాప్ పెట్టేశాను. ఆ అనుభవంతో టైలరింగ్ పరిశ్రమలో ఉన్న లోపాలు నాకు స్పష్టంగా అవగతమైపోయాయి. ఆ తర్వాత జరిగిన ఇంకొక సంఘటన నాలో కొత్త ఆలోచనకు బీజం పడేలా చేసింది.

ఆలోచన అలా మొదలైంది

మా ఇంట్లో పని చేసే అమ్మాయి, రోజూ రెండు, మూడు కవర్లు తీసుకొస్తూ ఉండేది. వాటిలో బ్లౌజ్‌లను గమనించి అవెక్కడివని అడిగినప్పుడు, ఆ కమ్యూనిటీలో ఉండే మహిళల దగ్గరి నుంచి మెటీరియల్ తీసుకుని, ఇంట్లోనే బ్లౌజులు కుట్టి తిరిగి అందిస్తూ ఉంటానని ఆ అమ్మాయి చెప్పింది. అలా నెలకు 50 నుంచి 60 వేలు సంపాదించుకుంటున్నట్టు విని, నేను విస్తుపోయాను. ఏమీ చదువుకోని ఒకమ్మాయి అంత ఆదాయం ఆర్జిస్తున్నప్పుడు, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు చదివిన అమ్మాయిలు ఎందుకు విజయం సాధించలేకపోతున్నారు? అని ఆలోచించడం మొదలుపెట్టాను. ఫ్యాషన్ డిజైనర్ల వెనకబాటుతనానికి కారణాలను తెలుసుకోవడం కోసం వేర్వేరు నగరాలు తిరిగాను. పరిశ్రమలోని లోపాలను తెలుసుకున్నాను. వినియోగదారులకు దుస్తులను చేరువ చేయడం కోసం ఒక దర్జీ, ఒక డిజైనర్‌ను వెంట బెట్టుకుని కారవాన్‌లో వివిధ ప్రాంతాల్లోని కమ్యూనిటీలకు వెళ్లిపోయేదాన్ని. అలా ఏడాదిన్నర పాటు కష్టపడిన తర్వాత అంతిమంగా 2022లో 'రన్ టైలర్' స్థాపించాను.

మూడు విభాగాల ద్వారా...

వ్యాపారం, వినియోగదారులు, ఉద్యోగాలు... ఇలా రన్ టైలర్‌లో మూడు విభాగాలున్నాయి. చాలామంది బొటిక్స్ లేబుల్స్ పెట్టుకుంటూ ఉంటారు. వీళ్ల డాటా ట్రాక్ చేసుకోరు. బిల్లులన్నీ కాగితాల రూపంలోనే ఉంటాయి. వాళ్లను ప్రమోట్ చేసే కంపెనీలు ఉండవు. బ్రాండింగ్ లేదు. వీళ్లకు రన్ టైలర్, ఒక డిజిటల్ అగ్రిగేటర్‌గా ఉపయోగపడుతుంది. మాతో అనుసంధానమైన బొటిక్స్ అన్నిటికీ అవసరమైన సాఫ్ట్‌వేర్, మ్యాన్‌పవర్‌ను మేం సమకూరుస్తాం. ఇక వినియోగదారుల సేవల విషయానికొస్తే, టైలర్లు, డిజైనర్ల దగ్గరకు వెళ్లలేని వాళ్లుంటారు. అలాంటి వాళ్లకు ఇంటి దగ్గరే సేవలందిస్తాం. పోర్టబుల్ కుట్టుమిషన్‌తో సహా ఒక దర్జీని ఇంటికి పంపిస్తాం. వీలును బట్టి ఆన్‌లైన్‌లో కూడా సేవలందిస్తాం. ఇందుకోసం రన్ టైలర్ యాప్‌ను వాడుకోవచ్చు. దీని ద్వారా డిజైనర్, టైలర్ సేవలను అందుకోవడంతో పాటు కుట్టించుకునే దుస్తులను కూడా ట్రాక్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో ప్రముఖ బ్రాండ్ల దుస్తులు కూడా అందుబాటులో ఉంటాయి. ఇక జీవనభృతిలో భాగంగా, ఫ్రాంచైజీలను ప్రారంభించే అవకాశాలను మహిళలకు కల్పిస్తున్నాం. ఇప్పటివరకూ ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 25 ఫ్రాంచేజీలు ఏర్పడ్డాయి. ఇమేజ్ కన్సల్టేషన్ కోర్సు అందిస్తూ, ప్రతిభ కనబరిచిన వారికి రన్ టైలర్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం.

రన్ టైలర్ పేరు వెనక...
నేనెప్పుడూ పరిగెత్తే వ్యక్తిని. ఒకే చోట కుదురుగా ఉండడం నాకు అలవాటు లేదు. టైలర్ల జీవితాలను గమనించిన తర్వాత, పరుగులు పెట్టే నా స్వభావాన్నీ, టైలరింగ్ రంగాన్నీ కలుపుతూ, ఈ సంస్థకు 'రన్ టైలర్' అని పేరు పెట్టుకున్నాను.



మాది కడప. నాన్న కాంట్రాక్టర్ అవడం వల్ల వేర్వేరు ఊళ్లు తిరుగుతూ చివరకు హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. మా వారు చంద్రహాస్ రెడ్డి కూడా కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లోనే ఉన్నారు. నాకొక బాబు. పేరు మౌనిష్ రెడ్డి. ఐదో తరగతి చదువుతున్నాడు. త్వరలో హైదరాబాద్, దుబాయ్‌లో, రెండు పెద్ద బ్రాండ్లను లాంచ్ చేయబోతున్నాను. ఈ బ్రాండ్ల ద్వారా అందరూ సౌకర్యంగా ధరించగలిగే, రాజసం ఉట్టిపడే దుస్తులను అందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నాను. కొత్తదనం కోసం పరితపించే క్రమంలో తయారవుతున్న తాజా ఫ్యాషన్ల దుస్తులు ధరించడానికి వీల్లేకుండా ఉంటున్నాయి. నేను డిజైన్ చేయబోతున్న దుస్తులు ఇందుకు పూర్తి భిన్నం.

ఇమేజ్ కన్సల్టేషన్...

ప్రతి వ్యక్తికీ ఒక ఇమేజ్ ఉంటుంది. వాళ్ల వృత్తి, ప్రవృత్తి, ఆహార్యం. వీటికి తగ్గట్టు దుస్తులను డిజైన్ చేసినప్పుడే హుందాగా కనిపిస్తారు. ఇందుకోసం ఇమేజ్ కన్సల్టేషన్ ప్రోగ్రాం అనే కోర్సు నేర్చుకున్నాను. ప్రస్తుతం ఆసక్తి ఉన్న డిజైనర్లకు కూడా ఈ కోర్సు నేర్పిస్తున్నాను. ఎవరికి ఎలాంటి రంగులు, ఎలాంటి దుస్తులు నప్పుతాయన్నది అంచనా వేయడంతో పాటు ఏ రంగులను మ్యాచ్ చేయాలో, ఏ దుస్తులను ఎలా కుట్టించాలో వినియోగదారులకు అవగాహన కల్పించడమే ఈ కోర్సు లక్ష్యం. ఇలా మా దగ్గర ఈ కోర్సు పూర్తి చేసిన కన్సల్టెంట్స్, వినియోగదారులను సంప్రతించి, నెలలో నాలుగు వారాలకు సరిపడా దుస్తులను డిజైన్ చేసి, సమకూర్చి పెడతారు. ఈ సౌలభ్యం వల్ల ప్రతి రోజూ వేసుకోబోయే దుస్తుల గురించిన ఆందోళన తప్పుతుంది.

ఉదాహరణకు రియల్ ఎస్టేట్ రంగాన్ని తీసుకుంటే, దాన్లో పురుషులందరూ తెల్లని దుస్తులే వేసుకుంటూ ఉంటారు. అలాంటప్పుడు ఎవరికంటూ వారు ప్రత్యేక స్టైల్‌ను చాటుకోవాలంటే, తెల్ల దుస్తుల్లోనే భిన్నంగా కనిపించాలి. అందుకోసం మేం ఒక కస్టమర్‌కు బంగారు జరీ, బంగారం, వజ్రాల గుండీలు డిజైన్ చేశాం. కొద్దిగా డై చేసి తెలుపు రంగును లేత రంగులోకి మార్చగలిగాం. ఇలా వినియోగదారుల ఆహార్యాన్ని మెరుగు పరచగలుగుతున్నాం.

- గోగుమళ్ల కవిత



అంధ విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో మొదలై, వారికి అన్నీ తానై నిలిచే వరకూ... **మీరా బద్వే**ది సుదీర్ఘమైన ప్రయాణం. దాదాపు ముప్ఫయ్యేళ్లుగా... వేలమంది అంధులకు విద్య, ఆశ్రయం, ఉపాధి కల్పన ద్వారా వారి సర్వతోముఖాభివృద్ధికి ఆమె దోహదం చేస్తున్నారు. "ఎవరో వస్తారని ఎదురుచూడడం కన్నా మనమే ముందడుగు వెయ్యాలి" అంటున్న మీరా బద్వే కథ ఆమె మాటల్లోనే...

చూపు లేని వారికి చుక్కానిలా

"ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో 'నా జీవితానికి అర్థమేమిటి?' అనే ప్రశ్న ఎదురవుతుంది. జీవితాన్ని అర్థవంతంగా చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నాల్లో... ఎంతో ఆలోచించి అమలు చేసినవి విఫలమవుతాయి. కానీ ఎలాంటి ప్రణాళిక లేకుండా చేసిన కొన్ని పనులు మన జీవితానికి వినూత్నమైన నిర్వచనాన్ని ఇస్తాయి. అలాంటి మార్పు తెచ్చిన సంఘటన ముప్ఫయ్యేళ్ళ క్రితం జరిగింది. నేను పుట్టింది మహారాష్ట్రలోని పుణేలో. చదువు పూర్తయ్యాక పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల బోధకురాలుగా పని చేశాను. వివాహమై, మా అమ్మాయి ఉమ పుట్టిన తరువాత ఉద్యోగం వదిలి, పూర్తిగా ఇంటి బాధ్యతలకే పరిమితం అయిపోయాను. అయితే ఏదో వెలితిగా ఉండేది. అందుకే మా అమ్మాయి కాస్త పెద్దది కాగానే... ఒక కాలేజీ నుంచి వచ్చిన అవకాశాన్ని అంగీకరించాను. కానీ అక్కడ చేరేలోగా... స్థానికంగా ఉన్న అంధుల పాఠశాల సందర్శన నన్ను కొత్త దారిలో నడిపించింది.

వారి భరోసాతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి...

నా భర్తకు చాలా సంవత్సరాలుగా ఒక అంధుల పాఠశాలకు విరాళాలు ఇవ్వడం ఆనవాయితీ. ఒకసారి ఆయనతోపాటు ఆ పాఠశాలకు వెళ్ళాను. అప్పుడు అక్కడ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఎంతోమంది పిల్లలు క్యూలో నిలబడి ఉన్నారు. 'అపరిచితమైన కొత్త ప్రదేశంలో ఎలా ఉండాలా?' అనే బాధ, దిగులు వారిలో కనిపిస్తున్నాయి. ఇంతలో ఒక పిల్లాడు ఆ క్యూ మధ్యలోనుంచి పరిగెత్తుతూ వచ్చాడు. దారిలో ఉన్న నన్ను గట్టిగా పట్టుకున్నాడు. నేను అతని తల్లిని అనుకున్నాడు. ఇంటికి తీసుకువెళ్ళాలంటూ ఏడుస్తున్నాడు. ఈలోగా తల్లితండ్రులు వచ్చి అతన్ని తీసుకుపోయారు. నేను, నా భర్త తిరిగి వెళ్తున్నప్పుడు "ఈ పిల్లల కోసం ఏదైనా చెయ్యాలని ఉంది. ఇక్కడే టీచర్‌గా చేరాలనుకుంటున్నాను" అని చెప్పాను. నాకు గతంలో అనుభవం ఉంది కాబట్టి అక్కడ బోధకురాలుగా చేరడం కష్టం కాలేదు. అయితే చేరిన తరవాత మాత్రం ఎన్నో సవాళ్ళు ఎదురయ్యాయి. అప్పటికి నాకు బ్రెయిలీ రాకపోవడంతో బోధించడానికి తడబడ్డాను. కానీ క్రమంగా పిల్లలతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నేను ఇబ్బంది పడుతున్నానని గ్రహించిన ఆ పిల్లలు "మీకు బ్రెయిలీ రాదని మమ్మల్ని వదిలేసి వెళ్ళొద్దు టీచర్! మీకు మేము నేర్పిస్తాం" అని భరోసా ఇచ్చినప్పుడు నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ తరువాత బ్రెయిలీ నేర్చుకున్నాను. వారితో మమేకమైన నేను మూడేళ్ళ తరువాత ఆ ఉద్యోగం మానెయ్యాల్సి వచ్చింది.

ఆ ధోరణి భరించలేక...

పిల్లలకు వారి వైకల్యాన్ని పదేపదే గుర్తు చేసేలా వ్యవహరించకూడదనేది నా ఉద్దేశం. "వారూ అందరు పిల్లల్లాంటివారే. అల్లరి చేస్తారు. ఆటలు ఆడతారు. కొత్త విషయాలు తెలుసుకోవాలని ఉత్సాహపడతారు. వారికీ ఇష్టాయిష్టాలుంటాయి. ఇవేవీ పట్టించుకోకుండా... వారు కుంగిపోయేలా ప్రవర్తించకూడదు" అని నేను చాలా సందర్భాల్లో స్కూల్ నిర్వాహకులకు చెప్పాను. కానీ పట్టించుకోలేదు. ఆ ధోరణి భరించలేక... రాజీనామా చేశాను. తరువాత ఒక రోజు ఆ స్కూల్ విద్యార్థి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. అతను చదువుతున్నది తొమ్మిదోతరగతి. కానీ వయసు పద్దెనిమిదేళ్ళు ప్రభుత్వ నిబంధనల ప్రకారం... అతను వయోజనుడయ్యాడు కాబట్టి బ్లయిండ్ స్కూల్‌లో అతను ఉండడం కుదరదు. అతని చదువు, వసతి, భోజన ఖర్చులను అతనే సంపాదించుకోవాలి. అందుకని అతణ్ణి స్కూల్‌లోంచి బయటకు పంపేశారు. అతణ్ణి తల్లితండ్రులు ఎప్పుడో వదిలేశారు. ఎక్కడికి వెళ్ళాలో తెలియక... మూడు వారాలపాటు సరైన తిండి లేకుండా రోడ్ల మీద తిరిగాడు. చివరకు మా ఇంటికి వచ్చాడు. ఆ పిల్లవాడికి ఆశ్రయం కల్పించి, అతని చదువుకు సాయం చేశాను. ఎంతో కష్టపడి చదివిన అతను పదోతరగతిలో నూరు శాతం మార్కులు తెచ్చుకునప్పుడు... తీవ్రమైన ఉద్వేగానికి గురయ్యాను. మానవీయత కరువైన విధానాల వల్ల ఇలాంటి ఎందరో పిల్లల జీవితాలు నాశనమైపోతున్నాయనే ఆవేదన కలిగింది. సమాజం వారికి సాయం చెయ్యడానికి ముందుకురాదు. ఆర్థిక స్తోమత లేని కుటుంబాలు వారిని భారంగా చూస్తాయి. ఈ పరిస్థితిలో... ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడడం కన్నా... నేనే వారికో దారి చూపాలనుకున్నాను. 1996లో... 'నివంత్ అంధ్ ముక్త వికాసాలయ్' పేరుతో ఒక సంస్థను ప్రారంభించాను.



ఆ నమ్మకం ఉంది...

ఇరవై తొమ్మిది ఏళ్ళ క్రితం... ఒకే ఒక విద్యార్థితో మొదలైన మా 'నివంత్' ఇప్పుడు విద్య, జీవన నైపుణ్యాలను నేర్పిస్తూ, భావోద్వేగమైన మద్దతును అందించే కేంద్రంగా అభివృద్ధి చెందింది. అప్పట్లో మాకు వనరులు, నిధులు తక్కువగా ఉండేవి. బ్రెయిలీ వచ్చిన విద్యార్థులు తక్కువ. బ్రెయిలీలో పుస్తకాలను చేతుల్తో రాసుకోవలసి వచ్చేది. అలా దాదాపు 300కు పైగా పుస్తకాలను మా విద్యార్థులు ఎంతో శ్రమ పడి రాశారు. 2007లో బ్రెయిలీ ప్రింటర్ సమకూర్చుకోవడంతో... ఈ పని సులభం అయింది. ఆ తరువాత 'విజన్ అన్‌లిమిటెడ్' అనే లైబ్రరీని ఏర్పాటు చేశాం. మూడువేలకు పైగా పుస్తకాలు అందులో ఉన్నాయి. రోటరీ క్లబ్ లాంటి సంస్థల సహాయంతో... పాఠ్య, పాఠ్యేతర అంశాలతో మేము ఏడాదికి లక్షన్నర పేజీలకు పైగా బ్రెయిలీ పుస్తకాలను ముద్రిస్తున్నాం. మహారాష్ట్ర వ్యాప్తంగా పదిహేడు కేంద్రాల్లో ఈ లైబ్రరీ అంధులకు సేవలు అందిస్తోంది. మా సంస్థలో ఇప్పటివరకూ 3,500 మందికి పైగా అంధ బాలలు ఆశ్రయం పొందారు. అందరూ స్వతంత్రంగా జీవించే నైపుణ్యాలను సాధించారు. ఈ ప్రయత్నంలో. నా భర్త, కుమార్తె కూడా నాకు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారు. వారి సహకారంతోనే 'స్వలేఖన్ టైపింగ్ ట్యూటర్' అనే యాప్‌ను ఆరేళ్ళ కిందట ఆవిష్కరించాం. అనేక భాషల్లో టైపింగ్‌ను నేర్పే ఈ యాప్ ద్వారా... అంధులైన విద్యార్థులు ఎవరి సాయం లేకుండా పరీక్షలు రాయవచ్చు. పుణేలో కొన్ని అంధ బాలల పాఠశాలల్లో పిల్లలకు ఈ యాప్ వినియోగంలో శిక్షణ ఇస్తున్నాం. 2,000 మందికి పైగా పిల్లలు దీన్ని ఉపయోగిస్తున్నారు. అలాగే... మేము సొంతంగా 'టెక్ విజన్' అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకున్నాం. దీనిలో వ్యాపార అవకాశాలు ఉన్నాయనే విషయం గ్రహించి... ఇరవైమంది అంధ విద్యార్థుల బృందంతో ఒక కంపెనీని ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఈ కంపెనీ ద్వారా ఏడాదికి నాలుగైదు కోట్ల రూపాయల లాభం వస్తోంది. అలాగే మా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తోంది. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని నాకు తెలుసు. కానీ నా తరువాత ఈ బాధ్యతను మా విద్యార్థులు ఇంకా సమర్థవంతంగా నిర్వర్తిస్తారనే నమ్మకం నాకుంది."

కౌన్సెలింగ్

కీళ్ల నొప్పులు తగ్గేదెలా?

Q A

డాక్టర్! నా వయసు 50. గత కొన్ని నెలలుగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. ఇందుకు కారణం కీళ్ల అరుగుదలగా భావించాలా? ఈ సమస్య మరింత పెరగకుండా ఎలా నియంత్రించుకోవాలి?

ఓ సోదరి, హైదరాబాద్

వ్యక్తిగత, వైద్యచరిత్రల ఆధారంగా అరిగిన, అరుగుతున్న కీళ్లకు ఎలాంటి చికిత్సను అందించాలో వైద్యులు నిర్ణయించుకుంటూ ఉంటారు. ఒకే ఒక పరీక్షతో కీళ్ల అరుగుదలను నిర్ధారించే పరిస్థితి ఇప్పటివరకూ లేదు. లక్షణాలు, ఎక్స్ రే, ఎమ్మారైల ద్వారా సమస్యను నిర్ధారించే విధానమే మనుగడలో ఉంది. ఫలితాలను బట్టి అంచెల వారీగా అందించవలసిన చికిత్సను వైద్యులు అంచనా వేస్తూ ఉంటారు.

ప్రధాన కారణాలు ఇవే!

- పెరిగే వయసు
- స్థూలకాయం
- ప్రమాదాల్లో కీళ్లు దెబ్బతినడం
- ప్రధానంగా వంశపారంపర్యం లేదా జన్యుపరమైన అంశాలు

నియంత్రణ ఇలా...

- **బరువు అదుపులో:** అధిక బరువు మోకీళ్ల మీద భారాన్ని పెంచుతుంది. అధిక బరువుతో మోకీళ్లు, తుంటి, పాదాల్లోని కీళ్లు త్వరగా అరిగే కీళ్ల శ్రమకు లోనవుతాయి. అలాగే అదనపు కొవ్వు మృదులాస్థిలో మార్పులకు కారణమవుతుంది. కాబట్టి బరువు పెరగకుండా చూసుకోవాలి. అధిక బరువును ఆహార, జీవనశైలి మార్పులతో తగ్గించుకోవాలి.
- **మధుమేహం:** రక్తంలో పెరిగే చక్కెర స్థాయిలు కీళ్ల అరుగుదలకు కారణమవుతాయి. కాబట్టి మధుమేహులు క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయిని పరీక్షించుకుంటూ ఉండాలి. అవసరం మేరకు మందులు వాడుకుంటూ ఉండాలి.



మోకీళ్ల ఆర్థ్రైటిస్‌కు 5 వ్యాయామాలు!
- క్వాడ్రాసెప్స్ స్ట్రెచ్
- కాఫ్ స్ట్రెచ్
- సీటెడ్ లెగ్ రైజ్

- **చురుగ్గా ఉండాలి:** కీళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే శరీరం చురుగ్గా ఉండాలి. వ్యాయామంతో కీళ్లు బిగుసుకుపోయే సమస్య తప్పుతుంది. కాబట్టి రోజూ కనీసం 30 నిమిషాల పాటైనా నడవాలి. కీళ్ల అరుగుదలను నియంత్రించే వ్యాయామాల గురించి వైద్యులను అడిగి తెలుసుకోవాలి.
- **వ్యాయామాలు సురక్షితంగా:** గాయాలు కీళ్ల అరుగుదలను పెంచుతాయి. కాబట్టి వ్యాయామం మొదలుపెట్టే వాళ్లు తక్కువ వేగంతో, తక్కువ తీవ్రతతో వ్యాయామాలు మొదలుపెట్టి, క్రమేపీ వేగం, తీవ్రతలను పెంచాలి. వ్యాయామానికి ముందు 10 నిమిషాల పాటు వార్మప్ చేయడం వల్ల, కీళ్లు, టెండాన్లు, కండరాలు, లిగమెంట్లు గాయాల బారిన పడకుండా ఉంటాయి.
- **కీళ్ల మీద కన్ను:** వ్యాయామం చేసిన ఒకటి రెండు గంటల తర్వాత కూడా కీళ్ల నొప్పి పెడుతూ ఉంటే అవసరానికి మించి కీళ్లను శ్రమకు లోను చేశామని అర్థం. అలాంటప్పుడు నొప్పి తగ్గడం కోసం ఐస్ ప్యాక్ పెట్టుకోవాలి.
- **తీపి, ఉప్పు:** ఆహారంలో ఈ రెండింటి వాడకం వీలైనంత తగ్గించాలి.

డాక్టర్. కృష్ణ సుబ్రమణ్యం,
ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, హైదరాబాద్.

వంట నూనె నిల్వ చేయాలంటే..!

బజారు నుంచి వంట నూనె కొని తేగానే సరిపోదు... దాన్ని సరైన పద్ధతిలో జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలి. లేదంటే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయంటున్నారు నిపుణులు. అందుకు వారు ఇస్తున్న సూచనలివే...

- వంటనూనె ప్యాకెట్ లేదా బాటిల్‌ని చల్లని ప్రదేశంలో ఉంచాలి. వీటికి వెలుతురు ఎక్కువగా సోకకూడదు. ప్యాకెట్‌ని కత్తిరించినా, బాటిల్ మూత తీసినా ఆర్నెల్లలోపు నూనెని ఉపయోగించుకోవాలి.



- ప్యాకెట్ లేదా బాటిల్‌ని ఎక్కువసేపు తెరచి ఉంచితే నూనెలోని కొవ్వు పదార్థాలు క్షీణిస్తాయి. నూనె రుచి మారుతుంది. దీనిని వాడడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి. నూనె ప్యాకెట్‌ని కత్తిరించిన తరవాత గాలి చొరబడని డబ్బాలో భద్రపరచాలి. అదే బాటిల్ అయితే నూనెని తీసుకున్న తరవాత మూతని గట్టిగా బిగించాలి.
- సాధారణంగా మహిళలు వంట చేసేటప్పుడు అందుబాటులో ఉండాలని కొద్దిగా నూనెని చిన్న స్టీల్ లేదా ప్లాస్టిక్ డబ్బాలో పోసి స్టవ్ పక్కన పెట్టుకుంటూ ఉంటారు. స్టవ్ నుంచి వచ్చే వేడి వల్ల ఈ నూనెలో ఆక్సీకరణ ప్రక్రియ వేగవంతమవుతుంది. దీనిని ఆహారంలో ఉపయోగిస్తే ఊబకాయం, అల్జీమర్స్, అధిక కొలెస్ట్రాల్ లాంటి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. వంటనూనెని వేడి తగిలే ప్రదేశాల్లో ఉంచకూడదు.
- నెయ్యితోపాటు వెజిటబుల్, వేరుశనగ, ఆవ, కొబ్బరి, నువ్వుల నూనెలను గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేసుకోవచ్చు.
- నూనెలను జాడీ, గాజు లేదా లోహపు పాత్రల్లో ఉంచడం మంచిది.

రూ.1.60 కోట్ల విలువైన డ్రగ్స్ స్మగ్లింగ్

- హైదరాబాద్‌లో నైజీరియా దేశస్థుడి అరెస్టు
- 1300 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం
- మరో స్మగ్లర్ రోమియో కూడా అరెస్టు


స్మగ్లర్ రోమియో

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సరఫరా చేసేందుకు ఢిల్లీ నుంచి డ్రగ్స్ తీసుకొచ్చిన ఓ నైజీరియా దేశస్థుడిని హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద రూ.1.60 కోట్ల విలువైన 1300 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను హెచ్‌న్యూ డీసీపీ వైవీ సుదీంద్ర బుధవారం విలేకరులకు వెల్లడించారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేసేందుకు పెడ్లర్లు వచ్చారనే సమాచారం మేరకు రంగంలోకి దిగిన హెచ్ న్యూ ఇన్‌స్పెక్టర్ డానియల్, లంగర్‌హౌస్ డీఐ రాజేంద్రప్రసాద్ బృందాలు.. లంగర్‌హౌస్ బాపు ఘాట్ వద్ద ఓ నైజీరియా దేశస్థుడిని అదుపులోకి తీసుకున్నాయి. అతని వద్ద 1300 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఒలీవర్ ఒగోచుకువ్ అలియాస్ జాన్సన్ అలియాస్ జాన్ అలియాస్ ఎంజీగా గుర్తించారు. ఢిల్లీలో ఉండే మరో స్మగ్లర్, నైజీరియా దేశస్థుడైన ఒయిబో ఆదేశాల మేరకు ఒలీవర్ డ్రగ్స్ తీసుకుని హైదరాబాద్ వచ్చాడు. నైజీరియా నుంచి పెద్ద మొత్తంలో డ్రగ్స్ దిగుమతి చేసుకునే ఒయిబో.. ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో స్థిరపడిన నైజీరియన్లకు మాత్రమే వాటిని అధిక మొత్తాల్లో సరఫరా చేస్తుంటాడు. ఇలా ఢిల్లీ నుంచి డ్రగ్స్ తీసుకుని హైదరాబాద్ వచ్చిన ఒలీవర్.. వాటిని ఎవరికి అందజేయాలనే విషయంలో ఒయిబో ఆదేశాల కోసం ఎదురుచూస్తుండగా పోలీసులకు చిక్కాడు. కాగా, 2009లో బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చిన ఒలీవర్ తొలుత వస్త్ర వ్యాపారం చేసి ఆ తర్వాత డ్రగ్స్ స్మగ్లర్‌గా మారాడు. హెరాయిన్ స్మగ్లింగ్ చేస్తూ ఢిల్లీ పోలీసులకు చిక్కి, ఆరేళ్ల జైలు శిక్ష కూడా అనుభవించాడు. 2013లోనే వీసా గడువు ముగిసినా ఒలీవర్ భారత్‌లో అక్రమంగా ఉంటున్నాడు. ఒలీవర్ సెల్‌ఫోన్ డేటా ఆధారంగా ప్రధాన స్మగ్లర్‌ను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

వ్యాపార విస్తరణ కోసం వచ్చి...

హైదరాబాద్ సహా దేశంలోని వివిధ నగరాల్లో నమోదైన పలు డ్రగ్స్ కేసుల్లో ప్రధాన నిందితుడైన మౌస్సా కమారా అలియాస్ రోమియో హెచ్‌న్యూ పోలీసులకు చిక్కాడు. హైదరాబాద్‌లో ఆగిపోయిన తన వ్యాపారాన్ని మళ్లీ విస్తరించేందుకు ఓ ఏజెంట్‌ను నియమించుకునేందుకు నగరానికి వచ్చి టోలీచౌకి పారామౌంట్ వద్ద పోలీసులకు దొరికిపోయాడు. సౌత్‌వెస్టు జోన్ డీసీపీ చంద్రమోహన్, హెచ్‌న్యూ డీసీపీ సుదీంద్ర ఈ వివరాలు వెల్లడించారు. ఆఫ్రికాలోని గినియా దేశానికి చెందిన రోమియో నాలుగేళ్ల క్రితం మెడికల్ వీసాపై ముంబై వచ్చాడు. ముంబై విమానాశ్రయంలో కొకైన్‌తో పట్టుబడి ఆరు నెలలు జైలులో ఉన్నాడు. జైలు నుంచి విడుదలయ్యాక బెంగళూరులో మకాం ఏర్పాటు చేసుకుని హైదరాబాద్ సహా దేశంలోని పలు నగరాలకు డ్రగ్స్ సరఫరా మొదలుపెట్టాడు. సూడాన్‌కు చెందిన హనీస్ ద్వారా రోమియో హైదరాబాద్‌కు డ్రగ్స్ పంపేవాడు. అయితే, గత అక్టోబరులో హనీస్ పోలీసులకు దొరకడంతో రోమియో వ్యవహారం బయటికొచ్చింది. నాటి నుంచి రోమియో పరారీలో ఉండగా అతని కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. అయితే, నెలలుగా వ్యాపారం నిలిచిపోవడంతో హనీస్ స్థానంలో మరొక ఏజెంట్‌ను నియమించుకునేందుకు రోమియో సోమవారం హైదరాబాద్ వచ్చాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నిఘా పెట్టి రోమియోను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మస్తాన్‌కు డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్!

అతని స్నేహితుడు ఖాజాకు కూడా.. ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు

- వారాంతాల్లో మస్తాన్ ఇంట్లో డ్రగ్స్ పార్టీలు.. మహిళలపై లైంగిక దాడి.. నగ్న వీడియోలు
- లావణ్య వీడియోలను డిలీట్ చేయించిన రాజ్‌తరుణ్
- ఆమెను హతమార్చేందుకు మస్తాన్ యత్నం
- రిమాండు రిపోర్టులో కీలక సమాచారం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మస్తాన్ సాయి కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. విస్తుగొలిపే విషయాలు బయటపడుతున్నాయి. మహిళల వ్యక్తిగత వీడియోలు సేకరించి, బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో మస్తాన్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మస్తాన్‌తో పాటు అరెస్టయిన ఖాజాకు పోలీసులు డ్రగ్స్ పరీక్షలు చేశారు. ఇద్దరికీ పాజిటివ్ రావడంతో వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. రిమాండు రిపోర్టులో పలు విషయాలను వెల్లడించారు. మస్తాన్ సాయితో పాటు ఆర్‌జే శేఖర్ బాషాపై లావణ్య బుధవారం నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అసలు లావణ్యకు, మస్తాన్ సాయికి ఎలా పరిచయం ఏర్పడింది? లావణ్యను కేసులో ఇరికించేందుకు మస్తాన్ సాయి, ఆర్‌జే శేఖర్ బాషా ఎందుకు యత్నించారు? అన్న విషయాలపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టారు.

ఫంక్షన్‌కు వెళ్లిన లావణ్య వీడియోలు తీసి..

మస్తాన్ రిమాండు రిపోర్టులో పోలీసులు కీలక విషయాలను ప్రస్తావించారు. ఉనీత్‌రెడ్డి అనే స్నేహితుడి ద్వారా మస్తాన్ సాయితో లావణ్యకు పరిచయమైంది. ఓ ఫంక్షన్‌కు మస్తాన్ ఇంటికి వెళ్లిన లావణ్య.. దుస్తులు మార్చుకుంటున్న సమయంలో వీడియో తీశాడు. వాటిని మస్తాన్ తన స్నేహితులకు కూడా పంపినట్లు రిపోర్టులో తెలిపారు. విషయం తెలిసిన లావణ్య.. అతనితో గొడవకు దిగింది. అప్పట్లో రాజ్‌తరుణ్ ఈ విషయంలో రాజీ చేసినట్లు పేర్కొన్నారు. మస్తాన్ వద్ద ఉన్న వీడియోలను రాజ్‌తరుణ్ డిలీట్ చేయించారు. కానీ, అప్పటికే ఆ వీడియోలను మస్తాన్ మరో హార్డ్ డిస్క్‌లో భద్రపర్చాడు. ఆ డిస్క్‌ను 2024 నవంబరులో లావణ్య తన ఇంటికి తీసుకొచ్చింది. అప్పటి నుంచి మస్తాన్.. లావణ్యను చంపించేందుకు ప్రయత్నిస్తున్నాడని పోలీసులు తెలిపారు. మస్తాన్‌ని కస్టడీలోకి తీసుకునేందుకు పిటిషన్ దాఖలు చేయనున్నారు.

హార్డ్ డిస్క్‌లో నగ్న వీడియోలు..

మస్తాన్ తన ఇంట్లో ప్రతి శని, ఆది వారాల్లో డ్రగ్స్ పార్టీలు నిర్వహించేవాడని పోలీసులు చెబుతున్నారు. ఆ పార్టీల్లో డ్రగ్స్ తీసుకున్న వారిలో కొందరిని టార్గెట్ చేసుకొని, రహస్యంగా నగ్న వీడియోలను రికార్డు చేసి హార్డ్‌డిస్క్‌లో భద్రపర్చుకున్నట్లు గుర్తించారు. మత్తులోకి జారుకున్న తర్వాత అమ్మాయిలపై లైంగిక దాడికి పాల్పడేవాడని, అప్పుడు తీసిన వీడియోలతో బెదిరించి.. వారిని లోబర్చుకునేవాడని లావణ్య ఇచ్చిన ఫిర్యాదులోనూ పేర్కొంది.

సోషల్ మీడియాలో ఆడియో టేపులు వైరల్

లావణ్య, మస్తాన్‌కు సంబంధించిన ఆడియో టేపులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక ఆడియో టేపులో మస్తాన్, ఆర్‌జే శేఖర్‌బాషాలు కలిసి లావణ్యను డ్రగ్స్ కేసులో ఇరికించాలని పథకం వేసిన సంభాషణలుండగా, దీన్ని లావణ్య పోలీసులకు ఇచ్చింది. అలాగే లావణ్య, చింటూ, మరో యువతి కలిసి శేఖర్‌బాషాపై కక్ష తీర్చుకోవాలంటూ మాట్లాడిన సంభాషణలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

చిత్రజ్యోతి
SINCE 1965

కొత్తవారికి సౌదీ సహకారం

● సౌదీ అరేబియా ఫిల్మ్ కమిషన్ ప్రతినిధులు



అంతర్జాతీయంగా సినిమా ఔత్సాహికులకు సౌదీ అరేబియా ఫిల్మ్ కమిషన్ సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. తమ కవిటీకి స్క్రిప్ట్ నచ్చితే, సినిమా నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించడంతో పాటు సౌదీ లో చిత్రీకరణకు లొకేషన్స్‌కు అనుమతించడం వంటి విషయాల్లో అండగా నిలుస్తామని చెప్పారు. అయితే, అది తమ దేశ నిబంధనలకు లోబడి ఉంటుందని అన్నారు. సౌదీ ఫిల్మ్ కమిషన్ నుంచి సహాయం పొందాలనుకొనే ఔత్సాహికులు ఫిల్మ్ డాట్ ఎస్ ఏ వెబ్ సైట్ లో ఇన్ సెంటివ్ ప్రోగ్రాం విభాగంలో దరఖాస్తు చేసుకోవచ్చు అని సౌదీ ఫిల్మ్ కమిషన్ ప్రతినిధి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా వివరించారు. సౌదీ ఫిల్మ్ నైట్స్ కార్యక్రమంలో భాగంగా ఆ దేశ ఫిల్మ్ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం బంజారాహిల్స్ లోని పీవీఆర్ ఆర్కే లో 'ది స్లేమ్' ఫీచర్ ఫిల్మ్‌తో పాటు 'మాష్నియాస్ లైఫ్' లఘు చిత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఆ దేశ యువ దర్శకుడు సాద్ తహైద్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... షారూఖ్‌ఖాన్ 'జవాన్' సినిమా తనతో పాటు సౌదీ లో చాలా మందికి నచ్చిందని తెలిపారు.

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

నన్ను మరోస్థాయికి తీసుకెళ్లే చిత్రం

నాగచైతన్య



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందు మొండేటి దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు నాగచైతన్య. "తండేల్ సినిమా నా కెరీర్‌లో బిగ్గెస్ట్ చిత్రం. దర్శకుడు చందుతో నాకిది మూడో సినిమా. నన్ను కొత్తగా చూపించడానికి ప్రయత్నిస్తుంటాడు. ఈ సినిమా కథను మొదట చందు చెప్పినప్పుడు అది డాక్యుమెంటరీలాగా అనిపించింది. సినిమాటిక్‌గా తయారు చేయమని చెప్పా. కొన్ని మార్పులు చేసి అద్భుతంగా మార్చారు. ఈ కథ వినే సమయంలో ఎంతో స్ఫూర్తినిచ్చింది. వెంటనే ఓకే చేశాను. ఇందులో నా పాత్ర తండేల్ రాజు కోసం చాలా శ్రమపడ్డాను. శ్రీకాకుళం వెళ్లి అక్కడ ఉండే మత్స్యకారుల జీవితాలను, వారి వేషభాషలను గమనించాను. ఒక నటుడిగా ఈ సినిమాతో నేనో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాను. ఈ సినిమా నేపథ్యం కొత్తగా ఉండడం వల్ల చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమా అంతా ఒక లెవెల్‌లో ఉంటే.. సెకండ్ ఆఫ్ మరో వీర లెవెల్‌లో ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. కథే ఈ సినిమాకు హీరో. వాస్తవిక సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని చూసి ప్రేక్షకులు భావోద్వేగానికి లోనవుతారు. ఈ సినిమా చివరి 30 నిమిషాలు చాలా బాగా నచ్చేసింది. క్లైమాక్స్ చాలా సంతృప్తిని ఇచ్చింది. ఈ చిత్రం ఓ నటుడిగా నన్ను మరోస్థాయికి తీసుకెళ్తుందనే నమ్మకం ఉంది. పాటలు అద్భుతంగా వచ్చాయి. తండేల్‌రాజు-సత్య ప్రేమ కథ తప్పకుండా అందరి హృదయాలను గెలుచుకుంటుంది" అని చెప్పారు.

నాకేం అసూయ లేదు




తన జీవితంలో అసూయకు స్థానం లేదన్నారు కథానాయిక సమంత. తన మాజీ భర్త నాగచైతన్య రెండో వివాహంపై సమంత తొలిసారి స్పందించారు. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'జీవితంలో అన్ని అనర్థాలకు మూలం అసూయే. దానికి నా జీవితంలో స్థానం లేదు. గతంలో నాతో రిలేషన్‌షిప్‌లో ఉన్నవారిపైన నాకేం కోపం, అసూయ లేవు. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను' అని పరోక్షంగా నాగచైతన్య గురించి స్పందించారు. ఒకరిపైన అసూయను పెంచుకోవడం వల్ల బాధపడడం తప్ప ఒరిగేదేముంది అన్నారు. రిలేషన్‌షిప్ వల్ల గతంలో చాలా కష్టాలు పడ్డానని చెప్పారు. వాటి నుంచి బయటపడడానికి చాలా శ్రమించాల్సి వచ్చిందనీ, ఆ అనుభవాల దృష్ట్యా ప్రస్తుతం రిలేషన్‌షిప్ గురించి ఆలోచించడం లేదని తెలిపారు. సమంతతో విడాకుల అనంతరం నాగచైతన్య హీరోయిన్ శోభితా ధూళిపాళ్లను పెళ్లాడిన విషయం తెలిసిందే.

మంచి కథా బలం ఉన్న చిత్రాలు నిర్మిస్తా

- శింగనమల రమేశ్‌బాబు



పవన్‌కల్యాణ్‌తో 'పులి', మహేశ్‌బాబుతో 'ఖలేజా' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు తీసిన నిర్మాత శింగనమల రమేశ్‌బాబు. ఓ కేసు విషయంలో 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేసి నిర్దోషిగా నిరూపించుకున్న ఆయన బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా మీదున్న ప్రేమతో నిర్మాతగా మారాను. పలు సినిమాలు నిర్మించాను. నా దగ్గరున్న స్థలాలను ఒకరికి తెలియకుండా, ఒకరికి అమ్మానని.. నాపై కేసు పెట్టారు. 14 ఏళ్లు న్యాయం కోసం పోరాడాను. న్యాయస్థానంలో అది తప్పుడు కేసు అని రుజువైంది. కోర్టు నన్ను నిర్దోషిగా తేల్చింది. నా సుదీర్ఘ న్యాయపోరాటం గెలిచింది. నాకు సినిమా తల్లిలాంటిది. నా పిల్లలు కూడా పరిశ్రమలోనే ఉన్నారు. భవిష్యత్తులోనూ మంచి కథాబలం ఉన్న సినిమాలు నిర్మిస్తాను. త్వరలోనే ఓ కొత్త సినిమాను ప్రకటిస్తాను. గతంలో జరిగిన తప్పులు మళ్లీ రిపీట్ కాకుండా జాగ్రత్తపడతాను" అని చెప్పారు.



ఇప్పటివరకూ ఇలాంటి పాత్ర పోషించలేదు

- సాయిరామ్ శంకర్



సాయిరామ్ శంకర్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. మలయాళ దర్శకుడు వినోద్‌కుమార్ విజయన్ తెరకెక్కించగా, గార్లపాటి రమేశ్ నిర్మించారు. సముద్రఖని, శృతి సోధి, ఆషిమా నర్వాల్ కీలక పాత్రలు పోషించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయిరామ్ శంకర్ చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు. "ఇందులో ఎన్నో షేడ్స్ ఉండే క్రిమినల్ లాయర్ పాత్రను పోషించాను. నా కెరీర్‌లో ఇప్పటివరకూ ఇలాంటి సినిమా చేయలేదు. అలాగే, ఇన్ని రకాల షేడ్స్ ఉన్న పాత్రలో నటించలేదు. దర్శకుడు వినోద్ నాకు చాలా ఏళ్ల నుంచి తెలుసు. ఇద్దరం కలసి చాలా సార్లు సినిమా చేద్దాం అని అనుకున్నాం. మంచి ప్రతిభ గల దర్శకుడు ఆయన. ఈ సినిమాలో ప్రతీ పాత్రను ఎంతో జాగ్రత్తగా డిజైన్ చేశారు. ఇది క్రైమ్ జానర్‌లో సాగుతూనే సందేశం ఇచ్చే సినిమా" అని చెప్పారు.

ప్రేమకథకు శ్రీకారం



తన కుమారుడు మారిశెట్టి అఖిల్‌ను హీరోగా పరిచయం చేస్తూ అనకాపల్లి జిల్లాకు చెందిన రాజకీయవేత్త మారిశెట్టి శ్రీకాంత్ నిర్మించే చిత్రం షూటింగ్ మంగళవారం లక్ష్మీపురం గ్రామంలోని రామాలయంలో మొదలైంది. నిర్మాత నట్టి కుమార్ తొలి క్లాప్ ఇచ్చారు. ఐదు రోజుల పాటు సాగే తొలి షెడ్యూల్‌లో ఒక పాట, ఓ ఫైట్ చిత్రీకరిస్తామని నిర్మాత శ్రీకాంత్ చెప్పారు. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తామని తెలిపారు. హారర్, కామెడీ అంశాలతో రూపొందుతున్న ప్రేమ కథాచిత్రమిదని దర్శకుడు శ్రీధర్ చెప్పారు. భానుశ్రీ ఈ చిత్రంలో హీరోయిన్.

భూమిని కాపాడే వీరుల తొలి అడుగులు



మార్వెల్ కామిక్స్ ఆధారంగా రూపొందిన 'ఫెంటాస్టిక్ ఫోర్' సినిమాలకు ఉన్న విశేష ఆదరణ గురించి తెలిసిందే.దుష్ట శక్తుల నుంచి భూమిని రక్షించే సూపర్‌హీరోల కథాంశంగా తెరకెక్కిన ఈ 'ఫెంటాస్టిక్ ఫోర్' ఫ్రాంచైజీలో ఇప్పటివరకూ నాలుగు సినిమాలు వచ్చాయి. తాజాగా, ఈ సిరీస్ నుంచి ఓ కొత్త చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. 'ఫెంటాస్టిక్ ఫోర్: ద ఫస్ట్ స్టెప్స్' టైటిల్‌తో 1960ల నేపథ్యంలో సాగే ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. విలన్ గలాక్టస్, ఆయన సహచరుల బారి నుంచి 'ఫెంటాస్టిక్ ఫోర్' (మిస్టర్ ఫెంటాస్టిక్, హ్యూమన్ టార్చ్, ద ఇన్‌విజిబుల్ విమెన్, థింగ్) ప్రపంచాన్ని కాపాడేందుకు చేసే పోరాట ఘట్టాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇందులో మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి ఈ నలుగురు సూపర్‌హీరోలు ఇప్పటివరకూ ఎందుకు భాగం కాలేదో చూపనున్నారని అంతా భావిస్తున్నారు. మాట్ షక్మాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 25న విడుదల కానుంది.



త్రిషకు రూ. కోటి నజరానా

» ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

» స్పిన్నర్ ధ్రుతి, సహాయ సిబ్బందికి తలో రూ.10 లక్షలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఐసీసీ అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిషా రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో ఆయన్ని త్రిష మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా త్రిషను అభినందించిన సీఎం.. ప్రభుత్వం తరఫున రూ. కోటి నజరానా ప్రకటించారు. త్రిషతో పాటు ఈ వరల్డ్‌కప్ జట్టులో సభ్యురాలైన హైదరాబాద్ క్రికెటర్ కేసరి ధ్రుతికి రూ.10 లక్షలు, భారత జట్టు ప్రధాన కోచ్‌గా పనిచేసిన హైదరాబాదీ నౌషీన్ అల్ ఖదీర్, ఫిట్‌నెస్ ట్రైనర్ షాలినికి చెరో రూ.10 లక్షల రివార్డును సీఎం ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, శాట్ వీసీ-ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ నుంచి రూ.10 లక్షలు..

వరల్డ్‌కప్‌లో పాల్గొన్న తెలంగాణ క్రికెటర్లు, సహాయ సిబ్బందికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు కూడా రివార్డు ప్రకటించారు. త్రిషకు రూ.10 లక్షలు, ధ్రుతి, నౌషీన్, షాలినికి తలో రూ.5 లక్షలను అందజేస్తామన్నారు. ఇక, ఈ సీజన్ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ తరఫున అత్యధిక రన్స్ చేసిన తన్మయ్ అగర్వాల్, అత్యధిక వికెట్లు తీసిన తనయ్ త్యాగరాజన్‌కు చెరో రూ.5 లక్షలు ప్రకటించారు.

చికిత బృందానికి కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో తెలంగాణకు మూడో కాంస్య పతకం లభించింది. డెహ్రాడూన్‌లో బుధవారం జరిగిన ఆర్చరీ మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో చికితరావు, మానస, శ్రేష్ఠ, మన్సుర్‌హాతో కూడిన రాష్ట్ర జట్టు కాంస్యం పోరులో 232-229తో ఢిల్లీ జట్టుపై గెలిచి పతకం అందుకుంది.

94 14 వేల పరుగుల మార్క్ చేరుకోవడానికి కోహ్లీకి కావాల్సిన పరుగులు. వన్డేల్లో సచిన్ (18,426 పరుగులు), సంగక్కర (14,234 పరుగులు) కోహ్లీ కంటే ముందున్నారు.

5 200 వికెట్ల మైలురాయిని చేరుకోవడానికి షమికి కావాల్సిన వికెట్లు.

పిచ్/వాతావరణం వికెట్ స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉంది. కానీ, బ్యాటింగ్‌కు కూడా అనుకూలమే. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు 288 పరుగులు. అయితే, ఆరేళ్ల తర్వాత ఇక్కడే వన్డే మ్యాచ్ జరుగుతోంది. వాతావరణం సాధారణంగా పొడిగా ఉండనుంది.

జట్లు **భారత్ (అంచనా):** రోహిత్, శుభ్‌మన్ గిల్, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్/పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్/సుందర్, కుల్దీప్, అర్ష్‌దీప్ సింగ్, షమి.

ఇంగ్లండ్ (తుది జట్టు): డకెట్, ఫిల్ సాల్ట్, రూట్, హ్యారీ బ్రూక్, జోష్ బట్లర్ (కెప్టెన్, వికెట్ కీపర్), లివింగ్‌స్టోన్, బెథల్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్, రషీద్, షకీబ్ మహమూద్.



ప్రాక్టీస్‌లో కోహ్లీ

‘చాంపియన్స్’కు ముందు

భలే చాన్స్!

- జట్టు కూర్పుపై రానున్న స్పష్టత
- కోహ్లీ, రోహిత్‌పైనే కళ్లన్నీ
- కీపర్ రేసులో రాహుల్, పంత్
- బలంగా కనిపిస్తున్న భారత్
- నేడు ఇంగ్లండ్‌తో తొలి వన్డే

నాగ్‌పూర్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (సీటీ)కి సన్నాహకంగా ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో.. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై మరోసారి అందరి దృష్టి నిలవనుంది. కొందరు క్రికెటర్ల ఫామ్, ఫిట్‌నెస్‌తోపాటు కొన్ని స్థానాలను తగిన ఆటగాళ్లను ఎంపిక చేయడానికి ఈ సిరీస్‌ను సెలెక్టర్లు ఉపయోగించుకోనున్నారు. టీ20 సిరీస్ విజయంతో జోష్ మీదున్న భారత్ గురువారం జరిగే తొలి వన్డేలో ఇంగ్లండ్‌తో తలపడనుంది. 14 నెలల క్రితం జరిగిన వన్డే వరల్డ్‌కప్ తర్వాత స్వదేశంలో తొలిసారి భారత్ యాభై ఓవర్ల ఫార్మాట్ బరిలోకి దిగుతోంది. ఇటీవల టెస్టుల్లో ఘోరంగా విఫలమైన రోహిత్, కోహ్లీ ఈ సిరీస్‌లో మునుపటి ఆటతో చెలరేగాలని అభిమానులు కోరుకొంటున్నారు. 2023 విశ్వకప్‌లో కోహ్లీ 765, రోహిత్ 597 పరుగులతో అదరగొట్టారు. దీంతో టీమిండియా అజేయంగా వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరినా.. ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా 0-2తో పరాజయం పాలైంది. రోహిత్ రెండు అర్ధ శతకాలు సాధించినా.. కోహ్లీ ఆకట్టుకోలేక పోయాడు. అదే పేలవ ఫామ్‌ను గత మూడు నెలలుగా వీరు కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే, చాంపియన్స్ ట్రోఫీకి ముందు తమ లోపాలను సరిదిద్దుకోవడానికి భారత ఆటగాళ్లకు ఇదే చివరి అవకాశం. వికెట్ కీపర్ విషయంలో కూడా మేనేజ్‌మెంట్ డోలాయమానంలో పడింది. కేఎల్ రాహుల్ లేదా రిషభ్ పంత్‌లో ఎవరికి తుది జట్టులో చోటు దక్కుతుందో తెలియదు. రోహిత్‌తో కలసి శుభ్‌మన్ గిల్ ఓపెనింగ్ చేయనుండగా.. కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ తర్వాత వికెట్ కీపర్-బ్యాటర్ బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. వన్డే వరల్డ్‌కప్‌లో కీపర్‌గా వ్యవహరించిన రాహుల్ మిడిలార్డర్ బ్యాటర్‌గా రాణించాడు. కానీ, ఎడమ చేతి వాటం ఆటగాడైన పంత్ జట్టులో ఉంటే వైవిధ్యంతో పాటు అతడి దూకుడైన ఆట జట్టుకు అదనపు బలంగా మారొచ్చు. ఒకవేళ ఇద్దరినీ ఆడించాలనుకొంటే మాత్రం అయ్యర్ బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. వరల్డ్‌కప్ తర్వాత హార్దిక్ పాండ్యా తొలిసారి వన్డేలు ఆడుతున్నాడు. గాయాల నుంచి కోలుకొని మళ్లీ జట్టులోకి వచ్చిన వెటరన్ పేసర్ మహ్మద్ షమి, కుల్దీప్ యాదవ్ ఫిట్‌నెస్‌ను ఈ సిరీస్‌తో నిశితంగా పరీక్షించే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో షమి బరిలోకి దిగగా.. కుల్దీప్ సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చాడు. బుమ్రా, సిరాజ్ లేకపోవడంతో షమి, అర్ష్‌దీప్‌పైనే బౌలింగ్ భారం ఎక్కువగా పడనుంది. జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లో ఇద్దరే ఆడే చాన్సులున్నాయి. వరుణ్ చక్రవర్తిని ఎంపిక చేసినా.. అతడిని ఆడించే అవకాశాలు తక్కువ.


పంత్




ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్, కోచ్ మెకల్లమ్

రూట్ రాకతో..

టీ20 సిరీస్‌లో ఓడిన ఇంగ్లండ్ వన్డేలతో బలంగా పుంజుకోవాలను కొంటోంది. 14 నెలల విరామం తర్వాత జో రూట్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. దీంతో ఇంగ్లండ్ బ్యాటింగ్ బలం పెరిగింది. ఈ ఒక్క మార్పు వినహా టీ20లు ఆడిన జట్టునే దాదాపుగా కొనసాగించనుంది. బట్లర్, లివింగ్‌స్టోన్, హ్యారీ బ్రూక్ రాణిస్తే ఈ జట్టు భారీ స్కోర్లు చేసే అవకాశం ఉంది. పేసర్ షకీబ్ మహమూద్‌కు తుది జట్టులో చోటు కల్పించారు.

టెన్నిస్‌కు హాలెప్ వీడ్కోలు



బుఖారెస్ట్ (రొమేనియా): రెండు గ్రాండ్‌స్లామ్‌ల విజేత సిమోనా హాలెప్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. రొమేనియాకు చెందిన 33 ఏళ్ల హాలెప్ గాయాలు, డోపింగ్‌తో సస్పెన్షన్ అనంతరం టెన్నిస్‌లోకి పునరాగమనం చేయాలని కొంత కాలంగా ప్రయత్నించింది. కానీ, అది సాధ్య పడలేదు. ‘సంతోషంతోనో విచారంతోనో ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తున్నానో తెలీదు. కానీ అటు ఆనందం, ఇటు బాధ కలుగుతున్నాయి. గతంలో మాదిరి పోటీలలో తలపడేందుకు నా శరీరం కూడా సహకరించడం లేదు’ అని సిమోనా వివరించింది. 2017లో సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలిచిన హాలెప్.. 2018లో ఫ్రెంచ్ ఓపెన్, 2019లో వింబుల్డన్ టైటిళ్లు నెగ్గింది.

నేను పాక్ వెళ్లను

» భారత అంపైర్ నితిన్ ప్రకటన

దుబాయ్: భారత్ నుంచి ఐసీసీ ఎలీట్ ప్యానెల్‌లో ఏకైక అంపైర్‌గా ఉన్న నితిన్ మెనన్ చాంపియన్స్ ట్రోఫీ బాధ్యతల నుంచి వైదొలగుతున్నట్టు బుధవారం ప్రకటించాడు. ‘చాంపియన్స్ ట్రోఫీకి ఐసీసీ ఎంపిక చేసిన అంపైర్ల జాబితాలో నితిన్ ఉన్నాడు. కానీ వ్యక్తిగత కారణాలతో పాక్ వెళ్లడం లేదని అతడు మాకు సమాచారమిచ్చాడు’ అని బీసీసీఐ తెలిపింది. పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా ఈనెల 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీకి ముగ్గురు రెఫరీలు, 12 మంది అంపైర్లు సహా మొత్తం 15 మంది మ్యాచ్ అధికారుల పేర్లను ఐసీసీ ప్రకటించింది. డేవిడ్ బూన్, రంజన్ మదుగలే, ఆండీ పైక్రాఫ్ట్‌లు మ్యాచ్ రెఫరీలు వ్యవహరిస్తారు.

గార్డ్‌నర్‌కు గుజరాత్ జెయింట్స్ పగ్గాలు



అహ్మదాబాద్: ఈ సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ అష్లే గార్డ్‌నర్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఆసీస్‌కే చెందిన బెత్ మూనీ స్థానంలో గార్డ్‌నర్‌కు జట్టు పగ్గాలు అప్పగించినట్టు జెయింట్స్ యాజమాన్యం బుధవారం ప్రకటించింది. డబ్ల్యూపీఎల్ మూడో ఎడిషన్ ఈనెల 14న మొదలవనుంది.

ఇదేం ప్రశ్న?

మీడియా సమావేశంలో రోహిత్ అసహనం



ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో రోహిత్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌లో తన పేలవ ఫామ్‌పై ఎదురైన ప్రశ్నకు రోహిత్ స్పందిస్తూ.. మీడియాపై అసహనం వ్యక్తం చేశాడు. ‘అసలు.. ఇదేం ప్రశ్న? ఆ ఫార్మాట్ (టెస్టు) వేరు.. ఇది వేరు. దానికి దీనికి ఎందుకు పోలిక తెస్తున్నారు? ఆటగాడికి కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజం. ఇదేమీ కొత్త కాదు. నా ప్రయాణంలో ఇలాంటివెన్నో చూశాను. ప్రతి సిరీస్ తాజా ఆరంభాన్ని ఇస్తుందని నమ్ముతా’ అని రోహిత్ అన్నాడు. కాగా, తన క్రికెట్ భవిష్యత్‌కు సంబంధించిన ఊహాగానాలపైనా హిట్‌మ్యాన్ స్పందించాడు. ‘ఎన్నో ఏళ్లుగా పుకార్లు వస్తూనే ఉన్నాయి. వాటిపై స్పష్టత ఇచ్చేందుకు ఇక్కడకు రాలేదు. నా దృష్టంతా ఇంగ్లండ్‌తో సిరీస్, చాంపియన్స్ ట్రోఫీపైనే ఉంది. ఆ తర్వాతే ఏంటనేది ఆలోచిస్తాను’ అని రోహిత్ చెప్పాడు. కాగా, నేటి మ్యాచ్‌లో కీపర్‌గా కేఎల్ రాహుల్‌కే అవకాశం ఉంటుందన్నట్టుగా చెప్పాడు. షమికి మద్దతుగా మాట్లాడిన రోహిత్.. బుమ్రా స్కాన్ రిపోర్టుల కోసం ఎదురుచూస్తున్నామన్నాడు.

అభిషేక్ @2



● ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

దుబాయ్: పొట్టి ఫార్మాట్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అభిషేక్ ఏకంగా 38 స్థానాలు మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌లో నిలిచాడు. తిలక్ వర్మ ఒక మెట్టుదిగి మూడో ర్యాంక్‌లో, సూర్యకుమార్ యాదవ్ ఐదో ర్యాంక్‌లో ఉన్నారు. ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) టాప్‌లో కొనసాగుతున్నాడు. బౌలర్ల జాబితాలో విస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా మూడు స్థానాలు మెరుగుపర్చుకొని ఆదిల్ రషీద్‌తో సమంగా రెండో ర్యాంక్‌లో నిలిచాడు. రవి బిష్ణోయ్ 6వ, అర్ష్‌దీప్ 9వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. అకిల్ హొస్సేన్ (వెస్టిండీస్) టాప్‌లో కొనసాగుతున్నాడు.

బిజినెస్



కొలువుల నెలవులు జీసీసీలు

» 2030 నాటికి 33 లక్షల ఉద్యోగాలు

» ఈ ఏడాది 4.5 లక్షల నియామకాలు

ముంబై: మన దేశంలో ఏర్పాటవుతున్న గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు (జీసీసీ)పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. 2030 నాటికి ఈ కేంద్రాల ద్వారా 33 లక్షల ఉద్యోగాలు ఏర్పడనున్నాయి. వచ్చే ఆరేళ్లలో కొత్త నియామకాలు 10 లక్షల వరకు ఉంటాయని అంచనా. ఇందులో 4.25 లక్షల నుంచి 4.5 లక్షల కొత్త నియామకాలు ఈ సంవత్సరం ఉంటాయని టెక్నాలజీ అండ్ డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ విడుదల చేసిన ‘ఇండియా జీసీసీ గ్రోత్ ఔట్‌లుక్, 2024’ నివేదిక తెలిపింది. దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో 10 విభిన్న రంగాలకు చెందిన 207 జీసీసీల ప్రధాన అధికారులతో మాట్లాడి ఎన్ఎల్‌బీ సర్వీసెస్ ఈ నివేదిక రూపొందించింది. బెంగళూరు, ముంబై, పుణె, చెన్నై నగరాల్లోని జీసీసీలు పెద్ద ఎత్తున ఫ్రెషర్స్‌కు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపింది.

2030 నాటికి 2,100 జీసీసీలు: ప్రస్తుతం మన దేశంలో దాదాపు 1,800 జీసీసీలున్నాయి. మరో ఐదేళ్లలో వీటి సంఖ్య 2,100కు, మార్కెట్ పరిమాణం 10,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.74 లక్షల కోట్లు) పెరిగేఅవకాశం ఉందని ఆ నివేదిక తెలిపింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, పెద్ద ఎత్తున నిపుణుల లభ్యతతో దాదాపు ప్రతి అంతర్జాతీయ కంపెనీ మన దేశంలో జీసీసీ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. దీంతో జీసీసీలకు సంబంధించిన టెక్నాలజీ, ఫైనాన్స్, తయారీ వంటి కీలక రంగాల్లో పని చేసేందుకు పెద్ద ఎత్తున నిపుణుల అవసరం ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే ఈ కేంద్రాల్లో ఈ సంవత్సరం ఆర్థిక సేవల నిపుణుల నియామకాలు 79%; మార్కెటింగ్, డిజిటల్ అడ్వర్టైజింగ్ నిపుణుల నియామకాలు 73%; ఇంజినీరింగ్, తయారీ నిపుణుల నియామకాలు 69%, హెచ్ఆర్-టాలెంట్ మేనేజ్‌మెంట్ నిపుణుల నియామకాలు 68% పెరుగుతాయని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ సీఈఓ సచిన్ అలుగ్ చెప్పారు.

8న హెచ్ఎంఏ లీడర్‌షిప్ సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) వజ్రోత్సవ లీడర్‌షిప్ సదస్సు వచ్చే శనివారం జరుగనుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. 1964లో ప్రారంభమైన హెచ్ఎంఏ ఈ ఏడాది 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. “ఇన్‌స్పైర్, ఇన్నోవేట్, ఇంపాక్ట్” థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సులో అపోలో, సైయెంట్, ఐటీసీ, హనీవెల్, మరుత్ డ్రోన్స్, జాగిల్, ఐఎస్‌బీ ప్రతినిధులు పాల్గొంటారని భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో నెట్‌సూట్ డేటాసెంటర్

న్యూఢిల్లీ: భారత ఆర్థిక రాజధాని ముంబై, హైదరాబాద్‌లలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నట్లు అమెరికాకు చెందిన నెట్‌సూట్ ఇంక్ బుధవారం ప్రకటించింది. భారత్‌లో పెరుగుతున్న కస్టమర్లకు మద్దతివ్వడంతోపాటు కార్యకలాపాలను అంతర్జాతీయంగా విస్తరించే దిశగా సంస్థ అడుగులు వేస్తోంది. 1998లో ప్రారంభమైన ఈ కంపెనీ.. చిన్న, మధ్యస్థాయి వ్యాపారాలకు (ఎస్ఎంబీ) అకౌంటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, మానవ వనరుల నిర్వహణ, ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు, సేవలందిస్తుంటుంది. అమెరికన్ టెక్ దిగ్గజం ఒరాకిల్ కార్పొరేషన్ 2016 నవంబరులో నెట్‌సూట్‌ను 930 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది.

సౌందర్య ఉత్పత్తుల మార్కెట్లోకి అనన్య బిర్లా



న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమార్తె అనన్య బిర్లా సౌందర్య సాధనాల మార్కెట్లోకి ప్రవేశించారు. వేగంగా విస్తరిస్తున్న బ్యూటీ, కాస్మెటిక్స్ విభాగంలో కొత్త వెంచర్ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అయితే ఆ వెంచర్ పేరు గాని, పెట్టుబడి వివరాలు గాని వెల్లడించలేదు. ఈ ఏడాది కొత్త బ్యూటీ, పర్సనల్ కేర్ బ్రాండ్లను మార్కెట్‌కు పరిచయం చేయనున్నామని ఆమె తెలిపారు. పర్సనల్ కేర్ ఉత్పత్తుల మార్కెట్ ఏటా 10-11 శాతం వృద్ధితో 2028 నాటికి 3,400 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనాగా చెబుతున్నారు. మారుతున్న యువత అభిరుచులకు దీటుగా కొత్త తరం బ్రాండ్లను తమ సంస్థ మార్కెట్లో ఆవిష్కరిస్తుందని అనన్య తెలిపారు. అనన్య 17 సంవత్సరాల వయసులోనే మైక్రో లెండింగ్‌లోకి ప్రవేశించారు. ఆమె నిర్వహణలోని స్వతంత్ర మైక్రో ఫిన్ దేశంలోనే రెండో పెద్ద ఎన్‌బీఎఫ్‌సీ-ఎంఎఫ్ఐగా ఎదిగింది.

నారాయణమూర్తికి గౌరవ డాక్టరేట్



చెన్నై (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి ఇంటర్నేషనల్ యూనివర్శిటీగా గుర్తింపు పొందిన సాయి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్‌పర్సన్, పద్మవిభూషణ్ ఎన్ఆర్ నారాయణ మూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ, కేంద్ర ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు, ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి సుబ్రమణియం కూడా గౌరవ డాక్టరేట్‌లను స్వీకరించారు.

రుణం కంటే ఎక్కువ వసూలు చేశారు

» బ్యాంకులపై విజయ్ మాల్యా పిటిషన్

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సంస్థ తీసుకున్న రుణాలకంటే బ్యాంకులు ఎక్కువగా వసూలు చేశాయని విజయ్ మాల్యా హైకోర్టును ఆశ్రయించారు. బ్యాంకులకు తమ సంస్థ రూ.6,200 కోట్లు బకాయి ఉందని, బ్యాంకర్లు అంతకు రెండురెట్లకు మించి వసూలు చేశారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. మాల్యాకు చెందిన రూ.14,131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీ చేశాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రస్తావించారని పిటిషన్‌లో వివరించారు. ఈ నెల 3న పిటిషన్ దాఖలు కాగా, జస్టిస్ ఆర్ దేవదాస్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. మాల్యా తరఫున న్యాయవాది సజన్ పూవయ్య వాదనలు వినిపించారు. రుణాల రికవరీ స్టేట్‌మెంట్ సమర్పించాలని బ్యాంకు అధికారులను ధర్మాసనం ఆదేశించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ నుంచి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పలు జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు రుణాల వసూలు ప్రక్రియను చేపట్టాయి. దీనిపై స్టే ఇవ్వాలని విజయ్ మాల్యా హైకోర్టుకు విన్నవించారు. ఈ అంశంపై బ్యాంకులు ఈ నెల 13లోగా వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.

స్వర్ణ భారతం



2024లో పసిడి గిరాకీ 803 టన్నులు

» 2025 డిమాండ్ అంచనా

800 టన్నులు..డబ్ల్యూజీసీ నివేదిక

ముంబై: ధరలు ఎప్పటికప్పుడు రికార్డు స్థాయికి ఎగబాకుతూ పోతున్నప్పటికీ బంగారం కొనుగోలు విషయంలో భారతీయులు ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. గత ఏడాది భారత్‌లో పసిడి గిరాకీ వార్షిక ప్రాతిపదికన 5 శాతం పెరిగి 802.8 టన్నులకు చేరిందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) నివేదిక వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై సుంకం తగ్గించడంతో పాటు పండగలు, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్లు డిమాండ్ వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయని ఆ నివేదికలో తెలిపారు. ఈ ఏడాదిలోనూ భారత్‌లో బంగారం డిమాండ్ 700-800 టన్నుల స్థాయిలో ఉండవచ్చని అంచనా వేశారు. ధరల అనూహ్య పెరుగుదలతో మందగించిన ఆభరణాల కొనుగోళ్లు పెళ్లిళ్ల సీజన్‌లో మళ్లీ పుంజుకోవచ్చని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా సచిన్ జైన్ అన్నారు. 2023లో బంగారం గిరాకీ 761 టన్నులుంది.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- 2024లో భారత పసిడి గిరాకీ విలువపరంగా 31 శాతం పెరిగి రూ.5,15,390 కోట్లకు పెరిగింది. 2023లో ఇది రూ.3,92,00 కోట్లుగా ఉంది.
- 2024 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో గిరాకీ ఎలాంటి వృద్ధి లేకుండా 265.8 టన్నులుగా నమోదైంది.
- గత సంవత్సరంలో స్వర్ణాభరణాల కొనుగోళ్లు మాత్రం వార్షిక ప్రాతిపదికన 2 శాతం తగ్గి రూ.563.4 టన్నులకు పరిమితమయ్యాయి. 2023లో 575.8 టన్నుల కొనుగోళ్లు జరిగాయి. అయినప్పటికీ, భారత్ చైనా కంటే అధిక నగలు కొనుగోలు చేసింది. 2024లో చైనాలో గోల్డ్ జువెలరీ డిమాండ్ 511.4 టన్నులుగా నమోదైంది.
- క్రితం ఏడాది బంగారంలో పెట్టుబడులు 29 శాతం పెరిగి 239.4 టన్నులకు చేరాయి. 2023లో ఇది 185.2 టన్నులుగా ఉంది. అనిశ్చితి సమయాల్లో బంగారం భద్రమైన పెట్టుబడి సాధనం అనడానికిదే నిదర్శనమని జైన్ పేర్కొన్నారు.
- 2024లో 114.3 టన్నుల గోల్డ్ రీసైక్లింగ్ (పునర్వినియోగం) జరిగింది. 2023లో జరిగిన 117.1 టన్నులతో పోలిస్తే 2 శాతం తగ్గింది.
- గత సంవత్సరం భారత్‌లోకి బంగారం దిగుమతులు 4 శాతం తగ్గి 712.1 టన్నులుగా నమోదైంది. 2023లో 744 టన్నులు దిగుమతైంది.

1045 టన్నులు కొనుగోలు చేసిన సెంట్రల్ బ్యాంకులు

గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా పసిడి గిరాకీ 4,974 టన్నులుగా నమోదైంది. అందులో 1,044.6 టన్నుల బంగారాన్ని వివిధ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లే కొనుగోలు చేశాయి. అంటే, ప్రపంచ డిమాండ్‌లో 20 శాతానికి పైగా వాటా వీటిదే. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు ఒక సంవత్సరంలో 1000 టన్నులకు పైగా బంగారాన్ని కొనుగోలు చేయడం వరుసగా ఇది మూడోసారి. ఆర్‌బీఐ గత ఏడాది మరో 73 టన్నుల బంగారం సమకూర్చుకుంది. 2023లో 16 టన్నులు కొనుగోలు చేసింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ

గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ క్రమంగా పెరుగుతోంది. గత ఏడాదంతా వీటికి డిమాండ్ నెలకొంది. అక్టోబరు-నవంబరు కాలంలో ధనత్రయోదశి, దీపావళి సీజన్‌లో ఈటీఎఫ్ యూనిట్ల కొనుగోళ్లు మరింత పెరిగాయి. రిటైల్ ఇన్వెస్టర్లు గోల్డ్ ఈటీఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్, నాణేలు, బార్‌ల కొనుగోలుకు అధిక ఆసక్తి చూపుతున్నారు.
- డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా సచిన్ జైన్

రూ..పాయే!

మరో జీవిత కాల కనిష్ఠ స్థాయి నమోదు

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్కరోజే 36 పైసలు క్షీణించి రూ.87.43 వద్ద ముగిసింది. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలతోపాటు డాలర్ బలోపేతం, ఆర్‌బీఐ పాలసీకి ముందు ఇన్వెస్టర్లలో అప్రమత్త ధోరణి ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం రూ.87.13 వద్ద ట్రేడింగ్ ప్రారంభమై ఒకదశలో రూ.87.49కు చేరుకున్నప్పటికీ, చివరికి 39 పైసల నష్టంతో రూ.87.46 వద్ద స్థిరపడింది.

ఆర్‌బీఐ పాలసీకి ముందు అప్రమత్తత

» 312 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: ఆర్‌బీఐ పాలసీతోపాటు వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో మదుపరులు అప్రమత్త ధోరణిని కనబరచడంతో ఈక్విటీ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 312.53 పాయింట్లు కోల్పోయి 78,271.28 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 42.95 పాయింట్ల నష్టంతో 23,696.30 వద్ద స్థిరపడింది.

అజాక్స్ ఐపీఓ ధరల శ్రేణి రూ.599-629: కాంక్రీట్ మిక్సర్ యంత్రాల తయారీ కంపెనీ అజాక్స్ ఇంజనీరింగ్ రూ.1,269 కోట్ల ఐపీఓ ఈనెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. ఐపీఓ షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.599-629గా నిర్ణయించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	500
వరంగల్	442	గోదావరి	452
చిత్తూరు	513	విశాఖపట్నం	470
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	114
కరీంనగర్	103	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	92
కర్నూలు	103	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	119		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,240 ▲	79,050 ▲	1,07,000 ▲
విజయవాడ	87,500 ▲	82,000 ▲	98,500 ▲
విశాఖపట్నం	84,730 ▲	77,670 ▲	96,260 ▲
రాజమండ్రి	86,240 ▲	79,050 ▲	96,600 ▲
ప్రొద్దుటూరు	85,200 ▲	78,900 ▲	96,000 ▲
ముంబై	84,660 ▲	77,550 ▲	95,425 ▲

బీసీల జనాభా లెక్కలపై రాద్ధాంతం వద్దు

» బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సర్కారు చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే-2024 నివేదికలోని ఆయా వర్గాల జనాభా లెక్కలపై తర్జనభర్జనలు అవసరం లేదని బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బీసీలు ఆశించిన స్థాయిలో 42 శాతం రిజర్వేషన్ల సాధించుకునే దిశగానే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని బీసీ వర్గాల మేధావులు, బీసీ సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కులగణన సర్వే నివేదికను స్వాగతిస్తున్నామన్నారు. ఏదేమైనా బీసీలు ఆశిస్తున్నట్టుగా 42% రిజర్వేషన్ల అమలు చేసేలా బీసీ సంఘాలు కృషి చేయాలన్నారు.

బీసీలను కాంగ్రెస్ మోసం చేసింది: శంకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీలను మరోసారి మోసం చేసిందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉందని, అయినా బీసీ రిజర్వేషన్ల విషయంలో దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. బీసీలను మభ్యపెట్టే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సామాజిక వర్గాల వారీగా కులగణన సర్వే లెక్కలు చెప్పమంటే.. సర్కారు దాటవేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంసీఆర్ వెబ్‌సైట్‌లో అధికారికంగా కులగణన వివరాలను అందుబాటులో ఉంచిందని, అయితే, దాన్ని ప్రామాణికంగా తీసుకోబోమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ: వెస్లీ

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని సీపీఎం స్పష్టం చేసింది. సీపీఐ, ఇతర వామపక్షాలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకు పోతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం 'మీట్ ది మీడియా' సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడం వల్లే ఆ పార్టీని కాదని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్.. మతోన్మాద పార్టీల వైఖరిపై తన అభిప్రాయం చెప్పకుండా అవకాశవాద రాజకీయాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. వామపక్ష పార్టీలను కలుపుకొని రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేసేందుకు సీపీఎం చొరవ తీసుకుంటుందని తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు,ఎస్సీ వర్గీకరణను సీపీఎం స్వాగతిస్తోందన్నారు.

'స్థానిక ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా గుర్తించండి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇప్పటి నుంచే సర్పంచ్ పదవులను వేలం వేస్తున్నారని వాటిని అరికట్టాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది. దీనిని నివారించడానికి 'నోటా(పై వారిలో ఎవరూ కాదు)'ను ఒక కల్పిత అభ్యర్థిగా గుర్తించి, ఏకగ్రీవ ఎన్నికలకు తావు లేకుండా చూడాలని సూచించింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి, కార్యదర్శి సోమ శ్రీనివాసరెడ్డి, సభ్యుడు జిల్లెల గోవర్ధన్‌రెడ్డి బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. నోటాను ఒక కల్పిత అభ్యర్థిగా గుర్తిస్తూ ఇక్కడి కమిషన్ నిర్ణయం తీసుకుంటే... ఏకగ్రీవ ఎన్నికలు ఉండవని, వేలం పాటలకు ఆస్కారమేర్పడదని అభిప్రాయ పడ్డారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

» సెక్రటేరియట్ వద్ద మాజీ సర్పంచ్‌ల నిరసన.. అరెస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెక్రటేరియట్ వద్ద నిరసన చేపట్టేందుకు మాజీ సర్పంచులు యత్నించగా పోలీసులు భగ్నం చేశారు. చలో సెక్రటేరియట్ పేరిట కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచుల సంఘం నాయకులు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ నిరసన తెలిపేందుకు మాజీ సర్పంచులు, సర్పంచుల సంఘం నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిలో సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వియాదయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాకనాగయ్య తదితరులున్నారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని 13 నెలలుగా ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని.. తక్షణం తమ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. కాగా.. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకపోగా.. తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలిపిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయి బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిజామాబాద్‌లో ఒకే రోజు 22 వేల కోళ్ల మృతి

భీమ్‌గల్/వేల్పూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఒకేరోజు అంతుచిక్కని వ్యాధితో 22 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. జిల్లాలోని భీమ్‌గల్‌కు చెందిన అశోక్ అనే వ్యక్తి కోళ్ల ఫారంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి కోళ్లు ఒక్కొక్కటిగా మృతిచెందాయి. బుధవారం రాత్రి వరకు మొత్తం 14 వేల కోళ్లు చనిపోయాయి. రూ.18 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అశోక్ ఆవేదన వ్యక్తం చేశాడు. వేల్పూర్ మండలం మోతె గ్రామంలో 7,200 కోళ్లు, లక్కోరలో 800 కోళ్లు మృతిచెందాయి. పశు సంవర్ధక శాఖాధికారులు చనిపోయిన కోళ్ల రక్త నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని వెటర్నరీ పరిశోధనా కేంద్రానికి పంపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో కూడా అంతుచిక్కని వైరస్‌తో లక్షల కోళ్లు చనిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పౌల్ట్రీ ఫారాల్లో కొత్త చిక్స్ (కోడి పిల్లలు) వేయొద్దని పశు సంవర్ధక శాఖ ఏడీ భరత్ కుమార్ సూచించారు. ఐదారు నెలల తర్వాత ఫాం అడుగు భాగంలోని మట్టిని తీసి, కొత్త మట్టి పోసి అప్పుడు చిక్స్ వేయాలని తెలిపారు.. కోడిగుడ్డు, చికెన్ ఉడికించిన తర్వాతనే తింటాం కాబట్టి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. హైదరాబాద్ నుంచి నివేదిక వచ్చాక వేల సంఖ్యలో కోళ్ల మృతికి కారణం ఏంటనేది తెలుస్తుందన్నారు.

దళితుల పట్ల అగ్ర కులస్థుల వివక్ష ?

» ఆలయానికి రంగులు వేయనీయకుండా అడ్డగింత

» దళిత సంఘాల ఆందోళన, పోలీసులకు ఫిర్యాదు

నర్సింహులపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆలయానికి రంగులు వేసే విషయంలో అగ్రకులస్థులు తమ పట్ల వివక్ష చూపారని ఆరోపిస్తూ దళితులు ఆందోళనకు దిగిన ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయపురంలో బుధవారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధిత దళితులు, కేవీపీఎస్ జిల్లా నాయకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయపురంలో ఈనెల 14న వేణుగోపాలస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన ఓ పెయింటర్‌కు ఆలయానికి రంగులు వేసే పని అప్పజెప్పారు. సదరు పెయింటర్ జయపురానికే చెందిన ముగ్గురు వ్యక్తులను కూలి పనికి పిలిచి రంగులు వేయడం ప్రారంభించాడు. అయితే, గ్రామానికి చెందిన కొందరు అగ్ర కులస్థులు అక్కడికి వచ్చి పనులను అడ్డుకున్నారు. దళితులు ఆలయానికి రంగులు వేయడం అపచారమని, రంగులు వేయొద్దంటూ స్పష్టం చేసి వాళ్లని అడ్డుకున్నారు. దీంతో రంగులు వేసే పనికి వచ్చిన వారితో పాటు మరికొందరు దళిత యువకులు ఆలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఆపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు వెళ్లి కులవివక్ష ఘటనపై ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం!



గత పదేళ్లూ ఏ ఎన్నికలు వచ్చినా దూకుడు.. ప్రస్తుతం అనాసక్తిపై రాజకీయ వర్గాల్లో చర్చ

ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నిర్ణయానికి వచ్చిన బీఆర్ఎస్!

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ఏ ఎన్నికలు వచ్చినా దూకుడుగా వ్యవహరించిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలపై ఏమాత్రం ఆసక్తి చూపకపోవడంతో సర్వత్రా చర్చ జరుగుతోంది. 'ఎన్నికలు ఏవైనా గెలుపు మాదే' అంటూ ధీమా వ్యక్తం చేస్తూ వచ్చిన గులాబీ పార్టీ ఈ ఎన్నికల్లో పాల్గొనకపోవడానికి కారణం ఏమై ఉంటుందని రాజకీయ వర్గాల్లో ఎవరికి తోచిన అభిప్రాయం వారు చెబుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవడం, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానం కూడా దక్కకపోవడం తదితర కారణాలు ఆ పార్టీని అయోమయంలో పడేశాయని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు, ఒకటి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం. వీటికి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. దీనిపై ఇప్పటివరకు తమ అధినేత కేసీఆర్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, బీఆర్ఎస్ తరఫున అభ్యర్థి పోటీలో ఉండరని ఆ పార్టీ నాయకులు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా... రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు జరుగుతున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కువ. దీంతో ఆ పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందన్న విషయంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఏపీ అంతటికీ ఒకే రైల్వే జోన్

(మొదటిపేజీ తరువాయి)

కానున్నాయి. దేశంలోనే అత్యధిక ఆదాయం తెచ్చిపెడుతున్న వాల్తేరు డివిజన్‌ను రద్దు చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించిన కేంద్రంపై కూటమి ఎంపీల ఒత్తిడి ఫలించింది. ఈ డివిజన్‌ను ఇకపై విశాఖపట్నం డివిజన్‌గా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనిపై నిజానికి గత నెల 10వ తేదీనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆ వివరాలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర ప్రాంతం భువనేశ్వర్ కేంద్రంగా నడుస్తున్న తూర్పు కోస్తా జోన్‌లోను, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలన్నీ సికింద్రాబాద్ కేంద్రంగా నడుస్తున్న దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోను ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండింటిలోని ప్రాంతాలను కలిపి విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా జోన్' ఏర్పాటుచేశారు. ఇందులో విశాఖపట్నం, (పాత వాల్తేరులో కొంత భాగం), విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఉంటాయి.

ఇదీ నేపథ్యం..

విశాఖ కేంద్రంగా ప్రత్యేక జోన్ ఇస్తామని ఐదేళ్ల క్రితం ప్రధాని మోదీ ప్రకటించారు. నెల రోజుల క్రితం(జనవరి 8న) జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జోన్ ఏర్పాటులో భాగంగా 130 ఏళ్లుగా నడుస్తున్న వాల్తేరు డివిజన్‌ను రద్దు చేస్తున్నట్టు చాలాకాలం క్రితమే కేంద్రం ప్రకటించింది. దేశంలో అత్యధిక ఆదాయం సమకూర్చే పది డివిజన్లలో వాల్తేరు ఒకటి. ఏడాదికి రూ.10వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. దీనిని రద్దు చేస్తే విశాఖ జోన్‌కే అర్థం ఉండదని, ఆ డివిజన్ లేకుండా జోన్ అవసరం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర పార్లమెంటు సభ్యులు కేంద్రంపై ఒత్తిడి పెంచారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, శ్రీకాకుళం ఎంపీ, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మరో వైపు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వాల్తేరు డివిజన్ ఉండాలని పట్టుబట్టారు. దీంతో ఎట్టకేలకు కేబినెట్ నిర్ణయాన్ని పక్కనపెట్టి రైల్వే బోర్డు ఇంకో నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వాల్తేరు డివిజన్ కొనసాగిస్తామని చెబుతూ, దానిని ఇకపై 'విశాఖ డివిజన్'గా వ్యవహరిస్తామని వెల్లడించింది.



కుదింపులు.. పొడిగింపులు..

వాల్తేరు రైల్వే డివిజన్ 1893లో ఏర్పాటైంది. దీని పరిధిలో దువ్వాడ-విశాఖపట్నం-పలాస మెయిన్ లైన్ 213 కిలోమీటర్ల మేర ఉంది. ఆర్‌వీ లైన్‌గా వ్యవహరించే రాయగడ-విజయనగరం-సింగాపురం రోడ్-తేరుబడి మార్గం 137 కిలోమీటర్లు, కేకే లైన్‌గా వ్యవహరించే కొత్తవలస-కిరండూల్ మార్గం పొడవు 446 కిలోమీటర్లు, కేఆర్ లైన్‌గా వ్యవహరించే కొరాపుట్-రాయగడ మార్గం 164 కిలోమీటర్లు, ఇవి కాకుండా కొత్తవలస-సింహాచలం 22 కిలోమీటర్లు, బొబ్బిలి-సాలూరు 18 కిలోమీటర్లు, నౌపడ-గుణుపూర్ లైన్ 90 కిలోమీటర్లు....కలిపి మొత్తం 1,052 కిలోమీటర్ల రైల్వే లైన్ వాల్తేరు డివిజన్‌లో ఉంది. ఇందులో కొత్తవలస-కిరండూల్, కూనేరు-తెరువలి జంక్షన్, సింగాపూర్ రోడ్-కొరాపుట్ జంక్షన్, పర్లాకివిడి-గుణుపూర్ మార్గాలను...సుమారు 680 కిలోమీటర్ల లైన్‌ను తీసుకువెళ్లి కొత్తగా ఒడిశాలో ఏర్పాటు చేసిన రాయగడ డివిజన్‌లో కలిపేశారు. మిగిలిన ప్రాంతాలతో వాల్తేరు డివిజన్ 410 కిలోమీటర్లకు కుదించుకు పోయింది. దీనిని విశాఖపట్నం డివిజన్‌గా వ్యవహరిస్తారు. అయితే, గుంతకల్లు రైల్వే డివిజన్ కొంతమేర కోతకు గురైంది. ఈ డివిజన్‌లోని రాయచూరు-నాల్వార్ రైల్వే సెక్షన్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోకి మారింది. అయితే, సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు వల్ల విశాఖపట్టణం-విజయవాడ-గుంతకల్లు రైల్వే డివిజన్ల మధ్య కనెక్టివిటీ, ట్రాఫిక్ పెరుగుతుంది. దీని వల్ల రాష్ట్ర రాజధానికి రైళ్లు లేక ఇబ్బందిపడుతున్న గుంతకల్లు రైల్వే డివిజన్ ప్రయాణికులకు, ముఖ్యంగా రాయలసీమ ప్రజలకు మేలు జరగనుంది. కాగా, విజయవాడ డివిజన్‌ను నౌపడ వరకు పొడిగిస్తూ పాత డీపీఆర్‌లో పొందుపరిచారు. తాజాగా విశాఖ డివిజన్‌ను (కొన్ని కుదింపులతో పూర్వ వాల్తేరు డివిజన్) ప్రకటించడం వల్ల తిరిగి దువ్వాడ వరకు విజయవాడ డివిజన్ (పాత రూట్) పరిమితం కానుంది. అమరావతి రైల్వే లైన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి-మోటుమర్రి వరకు ఉన్న 65 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను విజయవాడ డివిజన్‌లో కలపనున్నారు.

జగన్ మద్యం దోపిడీపై 'సిట్'

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో అడ్డగోలుగా మద్యం దోపిడీ చేసిన కుంభకోణం మూలాలను తవ్వి తీసేదిశగా కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మద్యం తయారీ, కొనుగోలు, సరఫరా, విక్రయాలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకుని 2019 అక్టోబరు నుంచి నిరుడు మార్చి వరకు దోచేసిన వేల కోట్లకు సంబంధించిన అసలు లబ్ధిదారులకు ఉచ్చు బిగించే నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు (ఐజీ ర్యాంకు) సారథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. ఈ కుంభకోణంలో నెలకు రూ.60 కోట్ల చొప్పున మూడు కోట్లు వసూలు చేసినట్లు ఇప్పటికే ఆధారాలు సంపాదించిన విషయం తెలిసిందే.

హరీశ్‌రావు క్వాష్ పిటిషన్ మళ్లీ వాయిదా

» లూథ్రా గైర్హాజరుపై ధర్మాసనం అసంతృప్తి

» 12న తప్పకుండా విచారణ జరుగుతుందని స్పష్టీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ మళ్లీ వాయిదా పడింది. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించాల్సిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరు కాకపోవడమే ఇందుకు కారణం. ఈనెల 12న ఎవరు వచ్చినా రాకపోయినా విచారణ చేపడతామని జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం స్పష్టం చేసింది. సిద్ధిపేట నియోజకవర్గం నుంచి హరీశ్‌రావుపై పోటీ చేసి ఓడిపోయిన జి.చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు హరీశ్‌రావుతోపాటు మాజీ పోలీసు అధికారి రాధాకిషన్‌రావుపై ఫోన్‌ట్యాపింగ్ కేసు నమోదు చేశారు. అయితే చక్రధర్‌గౌడ్ ఓ క్రిమినల్ అని, తప్పుడు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయడం చెల్లదని పేర్కొంటూ హరీశ్‌రావు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో హరీశ్‌రావును అరెస్ట్ చేయరాదని హైకోర్టు ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. గత నెల 28న జరిగిన విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, హరీశ్‌రావు తరఫున మరో సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు హాజరయ్యారు. తదుపరి విచారణకు ఈనెల 5 (బుధవారం) అనుకూలంగా ఉంటుందని.. అదే రోజు పూర్తిస్థాయి వాదనలు వినిపిస్తామని ఇద్దరూ పేర్కొన్నారు. దాంతో విచారణను ఈనెల 5కు వాయిదా వేసింది. బుధవారం ఈ పిటిషన్ మళ్లీ విచారణకు రాగా సిద్ధార్థ లూథ్రా హాజరుకాలేదు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఢిల్లీలో పోలింగ్ ఉన్నందున లూథ్రా హాజరుకాలేదని చెప్పారు. లూథ్రా హాజరు కాకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇరువర్గాల అంగీకారం మేరకు 12కు వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. ఆరోజు పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని స్పష్టంచేసింది.



తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రెడ్డి జేఏసీ ప్రతినిధులు

అభ్యంతరాలుంటే పార్టీ వేదికలపై మాట్లాడాలి

» తీన్మార్ మల్లన్నపై మంత్రి సీతక్క ధ్వజం

» ఆయనపై రెడ్డి జేఏసీ ఫిర్యాదు

» పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్/ సరూర్‌నగర్/ ఏఎస్‌రావునగర్/ హనుమకొండ టౌన్/ రామాయంపేట/ నర్సాపూర్/ హసన్‌పర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే సరిగా లేదంటూ తీన్మార్ మల్లన్న మాట్లాడటం సరికాదని మంత్రి సీతక్క అన్నారు. కులగణన సర్వేపై ఏమైనా అభ్యంతరాలుంటే పార్టీ వేదికలపై మాట్లాడాలి కానీ బహిరంగంగా మాట్లాడమేంటని ఆమె పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న సంగతి పార్టీ చూసుకుంటుందని చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన 'మంత్రితో ముఖాముఖీ' కార్యక్రమంలో పాల్గొన్న సీతక్క.. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉందని, లింకా బుక్ ఆఫ్ రికార్డు కోసం ఒక్క రోజులో సర్వే పూర్తిచేశారని ఆరోపించారు. తాము చేపట్టిన కులగణన సర్వేను బహిష్కరించాలని పిలుపునిచ్చిన బీఆర్ఎస్‌కు ఇప్పుడు కులగణన లెక్కలు అడిగే హక్కు లేదని అన్నారు. బీఆర్ఎస్ అధ్యక్ష పదవి ఒకే సామాజిక వర్గానికి ఇచ్చారని, ఆ పార్టీలో ఎదిగిన ఆలె నరేంద్ర, ఈటల రాజేంద్ర వంటి బీసీ నేతలను అవమానించి బయటికి పంపేశారని విమర్శించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కులగణనలో ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. కులగణనలో ఎక్కడా లెక్క తప్పలేదని, ఆయా సామాజిక వర్గాల లెక్కలు పక్కాగా తేలాయని చెప్పారు. గడిచిన 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పంచాయితీని తెంచి ఎవరి వాటాను వారికి పంచామని సీతక్క పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న ఓ అవకాశవాది అని, రాజకీయ పార్టీలను బెదిరించి లబ్ధి పొందడమే ఆయన పని అని తెలంగాణ రెడ్డి జేఏసీ ప్రతినిధులు ఆరోపించారు. తీన్మార్ మల్లన్న బీసీల యుద్ధభేరి సభలో రెడ్ల గురించి చేసిన వ్యాఖ్యలు అసభ్యంగా, అభ్యంతరకరంగా ఉన్నాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పార్టీ లైన్ దాటితే ఎవరైనా సరే చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అలాంటి వారిపై క్రమశిక్షణా కమిటీ చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

బతుకుల సమాధి

సెల్లార్ తవ్వుతుండగా కూలిన మట్టిదిబ్బలు

ముగ్గురు కూలీల దుర్మరణం.. మృతులు.. తండ్రి, కుమారుడు, మేనల్లుడు

ఎల్బీనగర్ మన్సూరాబాద్‌లో ఘటన.. గుండెలవిసేలా కుటుంబీకుల రోదన



సెల్లార్ నిర్మాణంలో కూలిన మట్టి దిబ్బలు

మన్సూరాబాద్, కొణిజర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంతెత్తు నుంచి పెద్ద పెద్ద మట్టిదిబ్బలు ఊడి.. నేరుగా మీద పడితే ఎవరు మాత్రం ప్రాణాలతో బయటపడగలరు? పాపం ఆ కూలీలు, మట్టి దిబ్బలు మీద పడి.. పూర్తిగా కూరుకుపోవడంతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టినా వారిని విగతజీవులుగానే బయటకు తీయాల్సివచ్చింది. ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్ చంద్రపురి కాలనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణం చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికుల వివరాల ప్రకారం.. చంద్రపురి కాలనీలోని ఆరెంజ్ ఆస్పత్రి సమీపంలో కుసుమ రమేశ్, విజయ దంపతులకు చెందిన 1582 గజాల స్థలంలో సాయినాథ్ అనే బిల్డర్ రెండు సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్ ప్లస్ నాలుగు అంతస్తులతో వాణిజ్య భవన నిర్మాణాన్ని చేపట్టాడు. అయితే రిటైనింగ్ వాల్‌ను నిర్మించకుండానే సెల్లార్ తవ్వకం పనులు చేపట్టారు. సెల్లార్ కోసం ఇప్పటికే దాదాపు 12 మీటర్ల మేర లోతు తవ్వారు. బుధవారం కూడా అక్కడ ఓ ప్రొక్లెయిన్, 15-20 మంది అడ్డా కూలీలతో సెల్లార్ తవ్వకం పనులు కొనసాగించారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు సెల్లార్‌లో ఓవైపు నుంచి ఒక్కసారిగా మట్టి దిబ్బలు కూలి పడ్డాయి. కూలీల్లో కొందరు ప్రమాదాన్ని గుర్తించి పక్కకు జరిగి తప్పించుకున్నా.. నలుగురు కూలీలు మట్టిలో కూరుకుపోయారు. పోలీసులు, డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది వచ్చి.. మట్టి తొలగించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నలుగురిలో ముగ్గురు.. అల్లకుంట వీరయ్య (42), ఆయన చిన్న కుమారుడు అల్లకుంట రాము (22), మేనల్లుడు ముద్దంగుల శ్రీనివాస్ (20) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బిక్షపతి అనే కూలీని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. వీరయ్య స్వస్థలం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామం. భార్య రాధమ్మ, కుమారులు శ్రీను, రాముతో కలిసి ఆర్నెల్ల క్రితం వీరయ్య బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కొచ్చాడు. ఈ కుటుంబం పెద్ద అంబర్‌పేటలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. మృతుడు శ్రీనివాస్, వీరయ్య సోదరి తిరుపతమ్మ కుమారుడు. ఆమె నిరుడు అనారోగ్యంతో చనిపోవడం.. బావ కృష్ణ తాగుడు బానిసవ్వడంతో ఇద్దరు మేనల్లుళ్లు శ్రీనివాస్, శ్రీరామ్‌లను వీరయ్య తన వద్దకే తెచ్చుకున్నాడు. ఎప్పటిలాగే వీరంతా అడ్డా మీద నిలబడితే.. బిల్డర్ వీరిని సెల్లార్ తవ్వే పనులకు తీసుకెళ్లాడు. అప్పటిదాకా కళ్లముందున్న భర్త, కుమారుడు ఇక లేరని తెలిసి రాధ, ఆమె పెద్ద కుమారుడు శ్రీను, మృతుడు శ్రీనివాస్ తమ్ముడు శ్రీరామ్ రోదనలతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది. కాగా ఘటనకు కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఈ ఘటనపై జీహెచ్ఎంసీ స్పందించింది. నిర్మాణ అనుమతులు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసింది.

తెలంగాణ రైల్వే ప్రాజెక్టులపై వివక్ష

బడ్జెట్ కేటాయింపులు పెంచని కేంద్రం.. నత్తనడకన సాగుతున్న పనులు

» అతీగతీలేని కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

» కేంద్రానికి సవతితల్లి ప్రేమ అని ఆరోపణలు

హైదరాబాద్/సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైల్వేలకు బడ్జెట్ కేటాయింపులు పెంచకపోవడంతో రాష్ట్రంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు మోక్షం లభించే అవకాశాలు కనిపించడం లేదు. 2025-26 బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు రూ.14,754 కోట్లు కేటాయించగా ఇందులో సింహభాగం (రూ.9,417 కోట్లు) పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రాజెక్టుల కోసమే వ్యయం చేయనున్నారు. గత ఏడాది బడ్జెట్‌లో తెలంగాణలోని రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.5,336 కోట్లు కేటాయించగా ఈసారి నిధులు పెంచకుండా కేవలం రూ.5337 కోట్లకే పరిమితం చేయడం బీజేపీ ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం నిరుడు రూ.9,151 కోట్లు కేటాయించగా ఈసారి రూ.266 కోట్లు పెంచి, రూ.9,417 కోట్లు కేటాయించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించలేదని, తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమకు ఇదే నిదర్శనమన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో 41,677 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. నిధుల కొరత కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సగానికి పైగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు ఇప్పటికీ చేపట్టకపోవడం గమనార్హం. నిధుల కేటాయింపుల్లో వివక్ష కారణంగా ఏళ్ల తరబడి పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలున్నాయి. దక్షిణ మధ్య రైల్వే తెలంగాణలో 1465 కి.మీ. ట్రాక్ విద్యుదీకరణతో 100 శాతం పూర్తి చేసినట్లయింది. ప్రమాదాలను నివారించే కవచ్ వ్యవస్థను 1026 కి.మీ. పరిధిలో ఏర్పాటు చేసింది.

అతిపెద్ద డివిజన్‌గా సికింద్రాబాద్!

జోన్ల విభజనతో మారిన డివిజన్ల రూపురేఖలు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ రైల్వే డివిజన్ రూపురేఖలు త్వరలో మారబోతున్నాయి. ఇప్పటికే జోన్ పరిధిలో పెద్ద డివిజన్‌గా ఉన్న సికింద్రాబాద్‌కు ఇతర డివిజన్ల నుంచి రైల్వే లైన్ తోడవుతుండడంతో అతిపెద్ద డివిజన్‌గా అవతరించనుంది. 1966లో 1,490 కిలోమీటర్ల రైల్వే లైన్‌తో ఏర్పాటైన సికింద్రాబాద్ డివిజన్ దాదాపు 60 ఏళ్ల తర్వాత విస్తరించబోతోంది. రైల్వేబోర్డు తాజా ప్రతిపాదనల మేరకు డివిజన్ నుంచి 46 కిలోమీటర్ల రైల్వేలైన్ వేరేజోన్‌కు బదిలీ అవుతుండగా, ఇతర జోన్ల నుంచి 250 కి.మీ. జత కానుంది. దీంతో సికింద్రాబాద్ డివిజన్ రైల్వే లైన్ పొడవు 1,694 కిలోమీటర్లకు చేరనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర పరిధిలో ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి కొంత భాగాన్ని విడదీస్తూ సౌత్ కోస్టల్ రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపింది. గుంతకల్ డివిజన్ పరిధిలోని రాయచూర్-వాడి స్టేషన్ల మధ్యనున్న 108 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను సికింద్రాబాద్ డివిజన్‌కు బదలాయించాలని రైల్వేబోర్డు ప్రతిపాదించింది. ఇందులో కొంతభాగం ప్రతిపాదిత సౌత్ కోస్టల్ రైల్వే, మరికొంత సెంట్రల్ రైల్వే పరిధిలోనిది కావడం విశేషం. సికింద్రాబాద్ డివిజన్ నుంచి రాయచూర్ సమీపంలోని రెండు పవర్ ప్లాంట్లకు బొగ్గు రవాణాలో ఇబ్బందులు ఎదురవకుండా ఈ నిర్ణయం తీసున్నట్లు రైల్వే బోర్డు ఈడీ సంజీవ్‌కుమార్ పేరిట విడుదల చేసిన లేఖలో ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రైల్వే బోర్డు ప్రతిపాదనల లేఖపై జనవరి 10వ తేదీ ఉండడంతో, రైల్వే అధికారులు ధ్రువీకరించడం లేదు. కానీ, లేఖలో ప్రస్తావించిన డివిజన్ల సరిహద్దు ప్రతిపాదనలను కొట్టిపారేయలేమని చెబుతుండడం గమనార్హం.

నారాయణపూర్ నుంచి జూరాలకు 4 టీఎంసీలు

» తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో అంగీకరించిన కర్ణాటక

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో నారాయణపూర్ జలాశయం నుంచి 4 టీఎంసీలు విడుదల చేయడానికి కర్ణాటక సర్కారు అంగీకరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో ప్రతినిధుల బృందం బుధవారం కర్ణాటక వెళ్లింది. బెంగళూరులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసింది. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగు, తాగునీటి అవసరాలను వివరించి నారాయణపూర్ నుంచి జూరాల జలాశయానికి నీరు వదలాలని కోరింది. పాలమూరు జిల్లా వరప్రదాయని అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో వేగంగా నీటి నిల్వలు పడిపోతున్నాయని తెలిపింది. వేసవి సమీపిస్తుండటంతో నారాయణపూర్ జలాశయం నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల జూపల్లి, శ్రీధర్‌బాబు కోరారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 1.7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, పరిస్థితి ఇలాగే ఉంటే డెడ్ స్టోరేజీకి పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గద్వాల్, వనపర్తి, కొల్లాపూర్, దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల్లో తీవ్ర నీటి సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. 30 లక్షల మంది ప్రజలు తాగునీటి కోసం ఈ ప్రాజెక్టు మీదే ఆధారపడి ఉన్నారని వివరించారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించి.. 4 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. గత సంవత్సరం తాగునీటి ఎద్దడి ఏర్పడగా 1.90 టీఎంసీలను నారాయణపూర్ నుంచి జూరాలకు విడుదల చేశారు. ఈ ఏడాది కూడా పరిస్థితి అలాగే ఉండటంతో నారాయణపూర్ నుంచి 5 టీఎంసీలతో పాటు తుంగభద్ర డ్యాం నుంచి నదికి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరింది. తుంగభద్రకు నీటి విడుదలపై త్వరలోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

టెట్‌లో 31 % ఉత్తీర్ణత

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత నెలలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ.నరసింహారెడ్డితో కలిసి ఈ ఫలితాలను వెలువరించారు. టెట్ పరీక్ష రెండు పేపర్లకు మొత్తం 1,35,802 మంది హాజరవ్వగా 42,384 (31.21%) మంది అర్హత సాధించారు. పేపర్-1కు 69,476 మంది హాజరవ్వగా 41,327(59.48%) మంది ఉత్తీర్ణ సాధించారు. అలాగే పేపర్-2లో మ్యాథమెటిక్స్, సైన్స్ పరీక్షకు 69,390 మంది హాజరవ్వగా 23,755(34.24%)మంది, సోషల్ స్టడీస్ పరీక్ష 66,412 మంది రాయగా 18,629(28.05%) మంది అర్హత సాధించారని యోగితా రాణా తెలిపారు. జనవరి 24న సబ్జెక్టుల వారీగా ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను విడుదల చేసిన విద్యాశాఖ జనవరి 27వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి బుధవారం తుది కీ, ఫలితాలు ప్రకటించింది.

పేదలు ఉంటున్న భూములను 118 జీవో ప్రకారం రెగ్యులరైజ్ చేయండి

» సీఎంకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి వినతి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి నియోజకవర్గంలో భూదాన్, అర్బన్‌ల్యాండ్ సీలింగ్, దేవాదాయశాఖ తదితర భూముల్లో ఏళ్ల తరబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదలకు ఆ భూములను జీవో 118 ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం సీఎం రేవంత్‌ను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. మల్కాజిగిరి పరిధిలోని సర్వేనంబర్ 278 లో సుమారు 22 కాలనీలకు చెందిన ప్రజలు దశాబ్దాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారని వివరించారు. పేదలు నివాసముంటున్న దేవాదాయశాఖ భూమిని పేదలకే ఇచ్చి, దేవాదాయ శాఖకు ప్రభుత్వ భూమిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని రాజశేఖరరెడ్డి కోరారు.

మొగిలిగిద్ద గ్రామానికి ఏటీసీ కేంద్రం

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను ప్రభుత్వం మంజూరు చేసింది. మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవానికి జనవరి 31న వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఏటీసీ కేంద్రం ఏర్పాటుకు అనుమతి లభించింది. ఈ కేంద్రాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కేటాయించిన సర్వే నెంబరు 287లో నిర్మించే అవకాశం ఉంది. ఆరు కోర్సులు, 244 సీట్లతో నూతన ఏటీసీని ఏర్పాటు చేస్తారు. వీటిలో రెండు సంవత్సరాల కోర్సులైన ఆధునాతన సీఎన్‌సీ మ్యాచింగ్ టెక్నీషియన్‌లో 48 సీట్లు, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్)లో 48 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులో 48 సీట్లు, ఏడాది కోర్సులైన ఆర్టిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్‌టూల్స్‌లో 20 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కోర్సులో 40 సీట్లు, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్‌లో 40 సీట్లు ఉంటాయి.

తెలంగాణలో చికిత్స తీసుకున్నా రీయింబర్స్‌మెంట్

» ఏపీ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం వెసులుబాటు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నివాసం ఉంటున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సేవల్లో రాష్ట్ర ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. ఏపీ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ వైద్య విద్య డైరెక్టరేట్ (డీఎంఈ) గుర్తించిన ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు బుధవారం మెమో ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

కులగణన పేరిట బీసీలను సీఎం రేవంత్ పొడిచి చంపారు: లక్ష్మణ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో కులగణనకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నివేదిక పూర్తిగా తప్పుల తడకగా ఉందని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శించారు. సమగ్ర సర్వే పేరుతో కేసీఆర్ ఒక్కరోజులో తడిగుడ్డతో బీసీల గొంతు కోస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కులగణన పేరిట 50 రోజుల పాటు రోజూ పొడిచి పొడిచి చంపారని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ బీసీల పట్ల కపట ప్రేమను ఒలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు. సర్వేలో బీసీల శాతాన్ని తగ్గించి చూపించారని, ఇదంతా బీసీలను రాజకీయంగా అణగదొక్కేందుకు తీసుకున్న చర్యగా స్పష్టమవుతోందన్నారు. కులగణనలో నివేదికలో రాజ్యాంగ విరుద్ధమైన పదాలు వాడారని.. హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని పేర్కొన్నారని మండిపడ్డారు.

బీసీ జనాభాను తగ్గించి.. అవమానిస్తే సహించం

» సర్కారుపై బీసీ సంఘాల ప్రతినిధుల ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే పేరిట బీసీ జనాభాను తగ్గించి చూపుతూ అవమానించే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని బీసీ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. కులగణన సర్వే నివేదికపై సమగ్రంగా చర్చించేందుకు సైతం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తప్పుల తడకగా ఉన్న బీసీ సర్వే నివేదికను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. 42% రిజర్వేషన్లు సాధ్యం కాని పక్షంలో పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పోరాట కార్యాచరణకు బీసీలను సమన్వయం చేసేందుకు త్వరలో బీసీ కుల సంఘాల నేతలు, మేధావులు, కళాకారులతో సమావేశమవుతున్నట్లు పేర్కొన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం కాకి లెక్కలతో కమిషన్‌ను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నట్టుందన్నారు. బీసీలకు న్యాయం జరగని పక్షంలో పోరాటమే శరణ్యమని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ.. బీసీల జనాభా తగ్గించి చూపడంతో భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎకరం వరకు ఉన్న రైతుల ఖాతాల్లో 'భరోసా' జమ

» 17.03 లక్షల మందికి 1,126.54 కోట్లు
» నిర్ణీత కాల వ్యవధిలో రైతు భరోసా ఇస్తాం
» పంటలకు గిట్టుబాటు ధరకు చర్యలు
» ఈ యాసంగిలోనూ సన్నాలకు బోనస్
» రైతే ప్రభుత్వ ప్రాధాన్యం: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఒక ఎకరం వరకు భూమి ఉన్న మొత్తం 17.03 లక్షల రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత కాల వ్యవధిలో రైతు భరోసా నిధులను జమ చేయడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన సందర్భంలో విడుదల చేసిన నిధులతో కలిపి బుధవారం వరకు మొత్తం రూ.1,126.54 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని ఓ ప్రకటనలో వివరించారు. ఇప్పటికే రైతుబంధు కింద రూ.7,625 కోట్లు, రుణమాఫీ పథకం కింద రూ.20,616.89 కోట్లు, రైతు బీమా కింద రూ.3,000 కోట్లు వ్యయం చేశామన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.14,893 కోట్లతో 20,11,954 మెట్రిక్ టన్నుల పత్తిని మద్దతు ధరతో సేకరించామన్నారు. పత్తి పంటను పూర్తిగా సేకరించడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి కోరామని తెలిపారు. మరో రూ.406.24 కోట్లతో సోయాబీన్స్, పెసళ్లు, కందులు వంటి పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరలకు సేకరించామని వివరించారు. ఈసారి రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి అయిందని, ఈ ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే సేకరిస్తున్నామన్నారు. గత యాసంగిలో రూ.10,547 కోట్లతో 48.06 లక్షల మెట్రిక్ టన్నులు, ఖరీఫ్ సీజన్‌లో రూ.12,178.97 కోట్లతో 52.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని పేర్కొన్నారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి కొనుగోలు చేశామని, దీనికి రూ.1,154 కోట్లు వ్యయం చేశామని తెలిపారు. ఈ యాసంగిలో కూడా సన్నాలకు బోనస్ కొనసాగిస్తామని వివరించారు. పసుపు, మిరప పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా, విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎరువుల కేటాయింపు విషయంలో ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. తమ ప్రభుత్వానికి రైతే మొదటి ప్రాధాన్యమని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామని తెలిపారు.

2 రోజుల్లో సర్వే వివరాలు కొన్ని వెల్లడిస్తాం

సమగ్ర కుటుంబ సర్వేతో పోలిస్తే బీసీ, ఎస్టీ జనాభా పెరిగింది.. ఓసీ జనాభా మాత్రం తగ్గింది

» కులగణన వివరాలు సంక్షేమ కార్యక్రమాల అమలుకు వినియోగిస్తాం
» సర్వేపై మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వే శాస్త్రీయంగా, పారదర్శకంగా జరిగిందని, దీనిపై ఎవరూ అనుమానం.. అపోహ పడొద్దని కులగణన సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ సర్వే మొత్తం వెయ్యి పేజీల డాక్యుమెంట్ అని, ఇందులో కొన్ని వాల్యూమ్‌లను ఒకటి, రెండు రోజుల్లో పబ్లిక్ డొమైన్‌లో పెడతామని చెప్పారు. ఈ డాక్యుమెంట్‌లో వ్యక్తిగత సమాచారం ఉన్న వాటిని పబ్లిక్ డొమైన్‌లో పెట్టేందుకు వీలు లేదన్నారు. బుధవారం కులగణన సర్వేపై అసెంబ్లీ కమిటీ హాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. ఇందులో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేతో పోలిస్తే బీసీ జనాభా పెరిగిందని ఉత్తమ్ చెప్పారు. ఆ సర్వేలో బీసీ జనాభా 51.09 శాతంగా పేర్కొంటే.. తమ సర్వేలో 56.33 శాతానికి పెరిగిందన్నారు. అలాగే ఎస్టీ జనాభా 9.8 నుంచి 10.45 శాతానికి పెరిగిందని చెప్పారు. అదే ఓసీ జనాభా 21.55 శాతం నుంచి 15.79 శాతానికి తగ్గిందని వెల్లడించారు. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో తొలిసారిగా జరిగిన కులగణన సర్వే ఇదని.. ఈ సర్వేపై విపక్షాలు తప్పుడు గణాంకాలతో అసత్య ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కులగణన సర్వే వివరాలను సంక్షేమ కార్యక్రమాల అమలుకు వినియోగిస్తామని చెప్పారు. సర్వేను శాస్త్రీయంగా నిర్వహించడానికి 1.03 లక్షల మంది శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు 55 రోజుల పాటు కృషి చేశారని అన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ సర్వేలో పాల్గొనడం.. సర్వే ప్రామాణికతకు అద్దం పడుతుందన్నారు. సర్వే అనంతరం సీజీజీ ఆధ్వర్యంలో 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆధునిక సాఫ్ట్‌వేర్ సాయంతో డేటాను విశ్లేషించి డిజిటలైజ్ చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే.. పబ్లిక్ డాక్యుమెంట్ కాదని, దాన్ని అసెంబ్లీలో పెట్టలేదని చెప్పారు. తమ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో.. క్షేత్రస్థాయిలో వచ్చిన సమాచారాన్ని యథాతథంగా పొందుపరిచామని స్పష్టం చేశారు.

సర్వేలో పాల్గొనని వారు వివరాలిస్తే తీసుకుంటాం: భట్టి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఇదివరకు వివరాలివ్వని వారు మళ్లీ ఇవ్వొచ్చని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పేరు, కుటుంబ వివరాలు చెబితే తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఇలాంటి కులగణన సర్వే దేశవ్యాప్తంగా జరగాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కొన్ని దశాబ్దాలుగా కొన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్న కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలను శాసనసభలో ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సర్వే.. ప్రజల వివిధ రకాల స్థితిగతులకు సంబంధించి ఒక ఫుల్ బాడీ చెకప్ అని, ఒక ఎక్స్‌రేలాంటిదన్నారు.

బీసీలు ఘనం.. నివేదిక సాక్ష్యం..

» ఆ డప్పు గుండె చప్పుడు తెలిసినోడిని..
» కులగణన, ఎస్సీ వర్గీకరణపై సీఎం ట్వీట్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి పూర్తిచేసిన కులగణన నివేదిక, ఎస్సీ వర్గీకరణ నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టడంపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై వేర్వేరుగా తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు. బీసీలకు సంబంధించి "బీసీలు ఘనం.. నివేదిక సాక్ష్యం. నిన్నటి కాకిలెక్కలు కాదు.. ఇవీ నేటి నికార్సైన లెక్కలు" అంటూ పోస్టు చేశారు. ఎస్సీ వర్గీకరణపై స్పందిస్తూ.. "ఆ డప్పు గుండె చప్పుడు తెలిసినోడిని.. విపక్షంలోనే వర్గీకరణపై సభలో రణం చేసినోడిని. సోదరుడు సంపత్ సాక్షిగా ఆనాడు ప్రతినభూని.. ఈనాడు వర్గీకరణపై ఆచరణలో అడుగు ముందుకువేసి.. దేశానికి మార్గం చూపించాం. ఈ ఆనంద క్షణాన గాంధీ భవన్ వేదికగా సోదరుల డప్పుల చప్పుళ్లు చిరకాలం గుర్తుండే జ్ఞాపకాలు" అని పేర్కొంటూ గాంధీభవన్‌లో నిర్వహించిన సంబురాల వీడియోను పోస్టు చేశారు.

జనంలోకి వెళ్దాం

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లాలవారీ సమావేశాలకు కూడా సీఎం ప్రణాళిక వేసుకున్నారు. కానీ, గురువారం సాయంత్రం ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఆ ప్రణాళిక వాయిదా పడింది. రాష్ట్రంలో కులగణనకు సంబంధించిన నివేదికను ప్రవేశపెట్టి.. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి షమీమ్ అక్తర్ నివేదికను ఆమోదించిన నేపథ్యంలో వీటిపై అధిష్ఠానానికి వివరాలు వెల్లడించేందుకు ఢిల్లీకి వెళ్లాలని సీఎం ముందే భావించారు. అయితే, బుధవారం ఢిల్లీ శాసనసభకు ఎన్నికలు జరగడం.. శనివారం ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో గురువారం రావాల్సిందిగా ఆయనకు అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినట్టు తెలిసింది. ఈమేరకు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు బయల్దేరి ఆయన ఢిల్లీ వెళ్లనున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కూడా ఆయనతో ఢిల్లీకి వెళ్లనున్నారు. వీరు శుక్రవారం కూడా అక్కడే ఉండి.. రాహుల్‌గాంధీని, పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేని కలవనున్నట్టు సమాచారం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన వివరాలతోపాటు.. రాష్ట్ర కాంగ్రెస్‌లో జరుగుతున్న ఇతర పరిణామాల గురించి చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదాల్లో.. ప్రజలు మరణిస్తే బాధ్యత ఎవరిది?

» తక్షణమే రహదారుల మరమ్మతులు
» అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు

"రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు మరణిస్తే.. బాధ్యత ఎవరిది?" అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు చాలా సమయం తీసుకుంటే ఎలా? అని అధికారులను నిలదీశారు. అధికారులతో రోడ్ల మరమ్మతులపై ఆయన సమీక్ష నిర్వహించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హ్యామ్)లో అభివృద్ధి చేయాల్సిన రోడ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని, వాటిని రెండు/మూడు నెలల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రోడ్డు నాణ్యతలో రాజీ పడకూడదని, నిర్మాణ కాంట్రాక్టులను దక్కించుకున్నవాళ్లే 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతను చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ముగ్గురు హైకోర్టు అదనపు జడ్జిలకు శాశ్వత హోదా

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించిన జడ్జిల సంఖ్య 42 కాగా ప్రస్తుతం 30 మంది ఉన్నారు. ఇంకా 12 ఖాళీలు ఉన్నాయి.

జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ

నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామానికి చెందిన జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ... గంగాధర్, రాజుబాయి దంపతులకు 1968లో జన్మించారు. ముష్కల్ జడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి, నిజామాబాద్ గవర్నమెంట్ కాలేజీలో ఇంటర్, గిరిరాజ్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పూర్తిచేసి 1994లో ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదయ్యారు. కాన్‌స్టిట్యూషనల్, ఆర్బిట్రేషన్, వాణిజ్య, భూవివాదాలు, భూసేకరణ, రెవెన్యూ, ఆహార కల్తీ వంటి విభాగాల్లో కేసులు వాదించారు. ఎన్‌హెచ్‌ఏఐ, ఎన్‌బీసీసీ, హిందుస్థాన్ స్టీల్ వర్క్స్, ఎల్‌ఐసీ హౌసింగ్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, ఐడీబీఐ బ్యాంకు వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, రియల్ ఎస్టేట్ కంపెనీలు, సీడ్ కంపెనీలు, ఎరువుల కంపెనీలకు న్యాయవాదిగా పనిచేశారు.

జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం మంగలిపేట్‌కు చెందిన జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్... వీరబాసప్ప, లక్ష్మీబాయి దంపతులకు 1971లో జన్మించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్, లా డిగ్రీ, మర్కంటైల్ లా లో పీజీ, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వ్యవస్థ (ఏడీఆర్)లో డిప్లొమా పూర్తిచేశారు. 2002లో అప్పటి ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు అయ్యారు. సివిల్, క్రిమినల్, కాన్‌స్టిట్యూషనల్, ట్యాక్సేషన్, ఉద్యోగ సర్వీసు అంశాల్లో ప్రాక్టీస్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్యపన్నుల శాఖకు జూనియర్ స్టాండింగ్ కౌన్సిల్, స్పెషల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. న్యాయసంబంధమైన వ్యవహారాల్లో హైకోర్టు తరఫున, జిల్లా కోర్టుల తరఫున న్యాయవాదిగా ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు న్యాయవాదిగా వ్యవహరించారు.

జస్టిస్ కె.సుజన

ఆలేరుకు చెందిన జస్టిస్ కె.సుజన.. మధుసూదన్, ప్రమీల దంపతులకు 1970లో జన్మించారు. స్థానికంగానే ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన ఆమె.. 1997లో న్యాయశాస్త్రంలో పట్టభద్రురాలై అదే ఏడాది ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదయ్యారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2012లో జిల్లా జడ్జి పరీక్షలు రాసి విజయం సాధించారు. కరీంనగర్, నిజామాబాద్, స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి, రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్, రిజిస్ట్రార్ (పరిపాలన), హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా సేవలందించారు.

ఆర్ అండ్ బీలో పదోన్నతులకు రంగం సిద్ధం

ఆంధ్రప్రదేశ్ నుంచి అందిన సీనియారిటీ జాబితా.. పదోన్నతులు ఇచ్చేందుకు శాఖలో జాబితా ప్రకటన

» అభ్యంతరాల స్వీకరణకు 10వ తేదీ దాకా అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలో పదోన్నతుల నిరీక్షణకు తెరపడనుంది. దశాబ్ద కాలంగా సాగుతున్న ఇన్‌చార్జిల పాలనకు శుభం కార్డు పడనుంది. ఇంత కాలం పదోన్నతులకు అడ్డంగా ఉన్న సీనియారిటీ జాబితాపై స్పష్టత వచ్చింది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(డీఈఈ) కేడర్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితా తాజాగా రాష్ట్ర ఆర్‌అండ్‌బీకి అందింది. దీంతో శాఖలో రెగ్యులర్ పదోన్నతులు, పోస్టులకు అవకాశం కలగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఆర్ అండ్ బీ అధికారులు తదుపరి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 2014 జూన్ 2 వరకు ఉన్న సీనియారిటీని తేల్చే పనిలో పడ్డారు. డీఈఈ కేడర్ (పాత విధానంలోని 5, 6 హైదరాబాద్ పరిధి జోన్లు) జాబితాను ఇప్పటికే ప్రకటించడంతోపాటు ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 10వ తేదీలోగా తెలపాలని సూచించారు. దీని ప్రకారం 2014వరకు సీనియర్లు ఎవరన్నది తేలుతుంది. దాంతో 2014 జూన్ 3నుంచి తెలంగాణలో ఉన్న అధికారులు ఎవరనే వివరాలతోపాటు సీనియారిటీ కూడా తేలనుంది. ఆ మేరకు పదోన్నతులతోపాటు రెగ్యులర్ పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. మరోవైపు.. 1986 నుంచి ఇప్పటి వరకు శాఖ పరిధిలో సీనియారిటీని తేల్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు నడుం బిగించారు. అప్పటి నుంచి ఏ పోస్టు ఏ పరిధిలో ఉంది? ఆ తరువాత ఏయే పోస్టుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి? అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. ఇందు కోసం శాఖ అంతర్గతంగా పలువురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. ఈ చర్యలతో శాఖలో పదోన్నతులు, రెగ్యులర్ పోస్టింగ్‌లకు సంబంధించిన అంశం ఒక కొలిక్కి రానున్నట్టు సమాచారం. కాగా, ఇపుడు ఏపీ నుంచి వచ్చిన జాబితా డీఈఈ కేడర్‌లోనే వచ్చింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, సూపరింటెండెంట్ ఇంజినీరు, చీఫ్ ఇంజినీర్లకు సంబంధించిన మరో జాబితా కూడా అందాల్సి ఉంది. అయితే, బేస్‌కేడర్ పోస్టు అయిన డీఈఈల్లో సీనియారిటీ తేలితే..మిగిలిన పోస్టుల సీనియారిటీ కూడా తేలుతుందని ఉద్యోగులు చెబుతున్నారు. ఏళ్ల తరువాత సీనియారిటీ జాబితా రావడం, పదోన్నతులకు మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూయేతర ఉద్యోగులపై చర్యలు

» తొలి విడతలో 18 మంది గుర్తింపు
» ఇక నుంచి ఆలయాలు, ఉత్సవాల విధులకు దూరం పెడుతూ నిర్ణయం



తిరుపతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో పనిచేస్తున్న హిందూయేతరులను గుర్తించి వారిని ఇతర విభాగాలకు బదిలీ చేయడమో లేక.. స్వచ్ఛంద పదవీ విరమణకు అవకాశం ఇవ్వడమో చేస్తామని ప్రకటించిన టీటీడీ పాలక మండలి తాజాగా కార్యాచరణ ప్రారంభించింది. తొలి దశలో గుర్తించిన 18 మంది హిందూయేతర ఉద్యోగులను ఉత్సవాలు, వేడుకల విధులకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఇప్పటికే వారిలో ఎవరైనా ఆలయాలు, మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో పనిచేస్తుంటే తక్షణం బదిలీ చేయాలని, సాధారణ విధులు అప్పగించాలని ఆదేశించింది. టీటీడీలో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కేటగిరీల్లో సుమారు 25 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో హిందూయేతరులైన ఉద్యోగుల సంఖ్య గణనీయంగా ఉందనే ఆరోపణలున్నాయి.

బోర్డు తొలి భేటీలోనే..

టీటీడీ పాలకమండలి చైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేయకముందే టీటీడీలో హిందూయేతర ఉద్యోగులను కొనసాగించే ప్రసక్తే లేదని స్పష్టంగా ప్రకటించారు. దానికి అనుగుణంగానే గత నవంబరు 18న జరిగిన పాలక మండలి తొలి సమావేశంలో ఈ విషయాన్ని అజెండాలో ప్రధాన అంశంగా చేర్చారు. హిందూయేతర ఉద్యోగులకు రెండు అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. వీటిలో 1. వీఆర్ఎస్ ఎంచుకోవడం. 2. ప్రభుత్వంలోని ఇతర శాఖలకు బదిలీ కావడం. అయితే.. తొలుత టీటీడీలో ఎంత మంది అన్యమత ఉద్యోగులు పనిచేస్తున్నారో లెక్కలు తీయాలని నిర్ణయించారు.

ప్రమాణం చేసి కూడా

టీటీడీలో పనిచేస్తున్న వారిలో 18 మంది హిందూయేతరులు ఉన్నారని ఈ నెల 1న అధికారులు పేర్కొన్నారు. వీరంతా హిందూయేతరులని గతంలోనే అధికారులు గుర్తించారు. అప్పట్లో.. శ్రీవారి చిత్రపటం ఎదుట నిలబడి.. హిందూమతాన్ని అనుసరిస్తామని, మరే ఇతర మతాల ఆచార వ్యవహారాలను పాటించమని ప్రమాణం చేశారు. అయినా, వీరు ఇతర మతాలను అనుసరిస్తున్నారని టీటీడీ గుర్తించింది. ఈ కారణంగా వారిని ఆలయాలు, ఉత్సవాల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. కాగా, రానున్న రెండు మూడు నెలల్లో టీటీడీలో హిందూయేతర ఉద్యోగులు ఎందరున్నారనే విషయమై లోతుగా విచారణ జరిపి గుర్తించే ప్రయత్నం జరుగుతోంది. 11న ఏపీ సీఎం చంద్రబాబు వద్ద ఈ అంశం ప్రస్తావించాలని టీటీడీ అధికారులు, చైర్మన్ భావిస్తున్నారు. సీఎం సూచనలకు అనుగుణంగా వ్యవహరించనున్నారు.

ఎండ మంటలు

(మొదటిపేజీ తరువాయి)

వాడకం మొదలవ్వడంతో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోయింది. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ మంగళవారం రికార్డు స్థాయిలో 15,582 మెగావాట్లుగా నమోదయింది. గతేడాది ఇదే రోజున విద్యుత్ డిమాండ్ 13,276 మెగావాట్లుగా ఉండడం గమనార్హం. గృహ వినియోగంతోపాటు వ్యవసాయ వినియోగం కూడా అధికమవ్వడంతో విద్యుత్ డిమాండ్ (ఏకకాలంలో రాష్ట్రంలో అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలు వాడకంతో ఆయా పరికరాల సామర్థ్యం మేరకు రికార్డయ్యేది) గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఇక, వినియోగం(రోజంతా వినియోగించే విద్యుత్ యూనిట్ల ఆధారంగా లెక్కకట్టేది) కూడా భారీగానే ఉంది. విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం గతేడాది ఫిబ్రవరి 4న 248.74 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం ఈనెల 4న 286.01 మిలియన్ యూనిట్లుగా నమోదయింది. గతేడాది కన్నా ఇది 14.98 శాతం అధికం. ఇక, గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కూడా 14 వేల మెగావాట్లకు తగ్గడం లేదు. ఫిబ్రవరి1న 14,822 మెగావాట్లు(276.64 మిలియన్ యూనిట్లు), 2న 14,826 మెగావాట్లు(270.54 మిలియన్ యూనిట్లు), 3న 15,262 మెగావాట్లు(280.59 మిలియన్‌యూనిట్లు) డిమాండ్ నమోదయింది. విద్యుత్ డిమాండ్‌లో గ్రేటర్ హైదరాబాద్ వాటా అధికంగా ఉంది. హైదరాబాద్ పరిధిలో గత ఫిబ్రవరి 4న 2,616 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ ఈ నెల 4న 3,320 మెగావాట్లుగా నమోదైంది. ఇది గతేడాదితో పోల్చితే 26.91 శాతం అధికం. ఇక, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ నెల 2న 60.13 మిలియన్ యూనిట్లు, 3న 58.06 మిలియన్ యూనిట్లు, ఈనెల 4న 54.28 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ఎండలు పెరగనున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం మరింత పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.